www.vishalabharati.com
epaper.vishalabharati.com

మంగళవారం, హైదరాబాద్
25 ఆగస్టు 2026
సంపుటి:4 సంచిక: 229

# విశాల భారతి

తెలుగు దినపత్రిక




## ఇదేనా ప్రజా పాలన?

- జాబ్ నోటిఫికేషన్లు నిల్.. లిక్కర్ ఫుల్..
- 121 మద్యం బ్రాండ్ల నోటిఫికేషన్లపై ప్రశ్న
- రెండు లక్షల ఉద్యోగాల హామీపై విమర్శ
- ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై అసంతృప్తి
- రాజీవ్ యువ వికాసంపై ఎద్దేవా

02

ఉద్యోగ నోటిఫికేషన్లపై హరీశ్ రావు ఫైర్

## క్యూట్‌గా ఉన్నావు.. మీటవుతావా!



- అథ్లెట్ ప్రతిభ సంచలన ఆరోపణలు
- మాజీ క్రీడా మంత్రి వేధింపులు?
- వైరల్‌గా ఇంటర్వ్యూ ప్రోమో
- కాంగ్రెస్, బీజేపీ విమర్శలు
- శ్రీనివాస్ గౌడ్‌పై అనుమానాలు
- స్పందన కోసం ఎదురుచూపులు

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

తెలంగాణ అంతర్జాతీయ అథ్లెట్ తక్కడపల్లి ప్రతిభ చేసిన సంచలన ఆరోపణలు రాజకీయ వర్గాల్లో కలకలం రేపుతున్నాయి. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో క్రీడా మంత్రిగా ఉన్న ఓ వ్యక్తి తనను వేధించారని ఆమె ఓ ఇంటర్వ్యూలో వెల్లడించినట్లు తాజాగా విడుదలైన ప్రోమోలో పేర్కొన్నారు. అంతర్జాతీయ విజయాలు సాధించిన సమయంలో అభినందించాల్సిన చోట తన రూపంపై అసభ్యకరంగా మాట్లాడారని ప్రతిభ ఆరోపించారు. క్యూట్‌గా ఉన్నావు, మీటవుతావా? అంటూ ప్రశ్నించినట్లు ఆమె తెలిపారు. ఈ వ్యాఖ్యలకు సంబంధించిన వీడియో ప్రోమో సోషల్ మీడియాలో విస్తృతంగా వైరల్ అవుతోంది. దీంతో రాజకీయ పార్టీల మధ్య విమర్శలు మొదలయ్యాయి.

మిగతా 3లో..



కొండా సురేఖ వ్యాఖ్యలపై సీఎం రేవంత్ రెడ్డి స్పందించేందుకు నిరాకరించారు. మీడియా సమావేశంలో ఈ అంశాన్ని విలేకరులు ప్రస్తావించగా, వ్యవహారం పార్టీ పరిధిలో ఉందని స్పష్టం చేశారు. ప్రభుత్వం, పరిపాలనకు సంబంధించిన విషయాలకే ప్రాధాన్యం ఇస్తామని తెలిపారు. పార్టీ అంతర్గత అంశాలపై బహిరంగంగా మాట్లాడే ఉద్దేశం లేదన్నారు. ప్రస్తుతం కొండా సురేఖ వ్యవహారం కాంగ్రెస్ క్రమశిక్షణ కమిటీ పరిశీలనలో ఉందని వివరించారు. పార్టీ విధానాలు, నిబంధనలు అందరికీ వర్తిస్తాయని చెప్పారు. బాధ్యతాయుత పదవిలో ఉన్న నేతలు పార్టీ నియమాలను పాటించాల్సిందేనన్నారు. హైకమాండ్ ఇప్పటికే అంశాన్ని పరిశీలిస్తోందని తెలిపారు. పార్టీ కంటే ఎవరూ పెద్దవారు కాదని స్పష్టం చేశారు. అధిష్టానం నిర్ణయానికి ప్రతి ఒక్కరూ కట్టుబడి ఉండాల్సిందేనన్నారు. అంతర్గత క్రమశిక్షణ విషయంలో రాజీ ఉండదని చెప్పారు. ప్రజా సమస్యల పరిష్కారం, సంక్షేమ పథకాల అమలే ప్రభుత్వ ప్రాధాన్యతగా కొనసాగుతుందని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. త్వరలో అధిష్టానం నిర్ణయం వెలువడుతుందని సీఎం తెలిపారు.

# సురేఖపై సైలెంట్.. కేంద్రంపై ఫైర్!

- కొండా సురేఖ అంశంపై సీఎం మౌనం
- క్రమశిక్షణ కమిటీ పరిధిలో వివాదం
- అమెరికా పర్యటనకు అనుమతి
- నిరాకరణపై ఆగ్రహం
- కేంద్రంపై వివక్ష ఆరోపణలు
- గుజరాత్ అంశం పై మోదీకి ప్రశ్న
- పార్లమెంట్‌లో తెలంగాణ గళం
- వినిపిస్తామన్న సీఎం



**విశాలభారతి, స్టేట్ బ్యూరో:** అమెరికా పర్యటనకు కేంద్రం రాజకీయ అనుమతి నిరాకరించడంపై సీఎం రేవంత్ రెడ్డి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. తెలంగాణ అభివృద్ధి, విద్య, క్రీడలు, పెట్టుబడుల కోసం పర్యటన రూపొందించామని తెలిపారు. ఒకే పర్యటనలో ఇంగ్లండ్‌కు అనుమతి ఇచ్చి అమెరికాకు నిరాకరించడం వివక్షగా కనిపిస్తోందన్నారు. ఇది వ్యక్తిగత అంశం కాదని, నాలుగు కోట్ల తెలంగాణ ప్రజల ఆత్మగౌరవానికి సంబంధించిన విషయమని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం విదేశీ పర్యటనలు అవసరమని వివరించారు. పెట్టుబడులు, యువతకు అవకాశాలు, అంతర్జాతీయ భాగస్వామ్యాల కోసం కార్యక్రమాలు సిద్ధం చేశామని చెప్పారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే సహా పలువురు కేంద్ర నిర్ణయాన్ని ప్రశ్నిస్తున్నారని తెలిపారు. సమాఖ్య స్ఫూర్తిని గౌరవించాల్సిన కేంద్రం రాష్ట్ర అభివృద్ధి ప్రయత్నాలకు రాజకీయ అడ్డంకులు సృష్టించకూడదని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. రాష్ట్ర హక్కుల కోసం ప్రజాస్వామ్య పద్ధతుల్లో పోరాటం కొనసాగుతుందని సీఎం స్పష్టం చేశారు, రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గబోమని చెప్పారు స్పష్టం చేశారు. అమెరికా పర్యటన వివరాలు కేంద్రానికి సమర్పించలేదన్న బీజేపీ ప్రచారాన్ని రేవంత్ రెడ్డి ఖండించారు. విదేశాంగ శాఖకు విద్య, క్రీడలు, పెట్టుబడుల అంశాలతో పూర్తి ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. విదేశీ పర్యటనల సమయంలో భారత రాయబార కార్యాలయ అధికారులు సమన్వయం చేస్తారని చెప్పారు. వారి నివేదికలు

మిగతా 2లో..



## హరీశ్‌రావు ఫాంహౌస్ ప్రభుత్వం కాదిది

- 22ఏ భూములపై పొంగులేటి కీలక ప్రకటన
- 98 శాతం జెన్యూన్ భూముల రిజిస్ట్రేషన్
- టోల్‌ఫ్రీకి 980 ప్రత్యేక కాల్స్
- బీఆర్ఎస్ ఆరోపణలపై మంత్రి ఫైర్
- హరీశ్‌రావుపై పొంగులేటి ప్రశ్నలు
- ప్రజలు భయపడొద్దన్న మంత్రి

03



## 2029 నాటికే జమిలి ఎన్నికలు?

- 'వన్ నేషన్ - వన్ ఎలక్షన్'పై కీలక సంకేతాలు
- అనుకున్నదానికంటే ముందే జమిలి అమలు దిశగా అడుగులు
- జమిలి ఎన్నికల ప్రతిపాదనకు మద్దతు.. జేపీసీ ఛైర్మన్ పి.పి. చౌదరి వెల్లడి
- రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారిన ప్రతిపాదన

02

## ఈగల్ టీమ్‌లో ఇంటి దొంగలు

- ఈగల్ టీమ్‌లో ఇద్దరు కానిస్టేబుల్స్‌పై సస్పెన్షన్ వేటు
- సీజ్ చేసిన ఎక్స్టసీ టాబ్లెట్లను అక్రమంగా దాచినట్లు ఆరోపణలు
- డ్రగ్స్ విలువ సుమారు రూ.50 లక్షలుగా సమాచారం
- పెడ్లర్ల సమాచారంతో అధికారుల నిఘా
- అంతర్గత విచారణ తర్వాత శాఖాపరమైన చర్యలు
- గతంలో డ్రగ్స్ పట్టివేతకు ఇద్దరికీ అవార్డులు

02




## కొండా సురేఖ చేరికపై అధిష్టానమే ఫైనల్



- కొండా సురేఖ అంశంపై డీకే అరుణ ఆసక్తికర వ్యాఖ్యలు
- పార్టీలోకి తీసుకోవాలా? వద్దా? అనేది బీజేపీ నిర్ణయిస్తుందని కామెంట్
- కాంగ్రెస్ పాలిట ఆగస్టు సంక్షోభం ఖాయమంటూ జోస్యం
- టీ బీజేపీలో అంతా ఐక్యంగానే ఉన్నాం.. మీడియా చిట్ చాట్‌లో ఎంపీ

03




## 'జీవో 97'తో లాభమా? నష్టమా?

**జీవో 97తో పాలిటెక్నిక్‌లకు కొత్త వ్యవస్థ**

- శక్తి శాఖ పరిధిలోకి సాంకేతిక విద్య
- వైఐఎస్‌యూ అనుసంధానంపై విద్యార్థుల అభ్యంతరం
- ఈసెట్, ఫీజు రీయింబర్స్ మెంట్‌పై సందేహాలు
- అధ్యాపకుల్లో కేడర్, ఉద్యోగ భద్రత ఆందోళన
- జీవో సవరణకు విద్యార్థి సంఘాల డిమాండ్

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:** తెలంగాణలో సాంకేతిక విద్యారంగంలో జీవో ఎంఎస్ నంబర్ 97 తీవ్ర చర్చకు దారితీసింది. దశాబ్దాలుగా ఉన్నత విద్యాశాఖ పరిధిలో స్వయంప్రతిపత్తితో కొనసాగుతున్న ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలను యంగ్ ఇండియా స్కిల్స్

మిగతా 2లో..

## జనసేనలోకి కొండా సుస్మిత?

- సురేఖకు షోకాజ్ నోటీసులు
- ఏఐసీసీకి పీసీసీ నివేదిక
- 20 మంది ఎమ్మెల్యేల అసమ్మతి
- సుస్మిత జనసేనతో భేటీ
- పరకాల టికెట్‌పై చర్చ
- వరంగల్ పగ్గాలపై కన్ను

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:** తెలంగాణ కాంగ్రెస్‌లో కొండా సురేఖ వ్యవహారం కీలక మలుపు తిరిగింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై కొండా సురేఖ కుమార్తె సుస్మిత చేసిన వ్యాఖ్యలు రాజకీయ దుమారం రేపాయి. ఈ పరిణామాల నేపథ్యంలో సురేఖకు షోకాజ్ నోటీసులు జారీ కావడం, తన కుమార్తె వ్యాఖ్యలతో తనకు సంబంధం లేదని ఆమె వివరణ ఇవ్వడం, తనపై కుట్ర జరుగుతోందంటూ అధిష్ఠానానికి

మిగతా 2లో..






03

## వంటింట్లో ఉల్లి మంట!

- సన్నబియ్యం కిలో రూ.70 వరకు.. ఉల్లి ధర దాదాపు రెట్టింపు
- వెల్లుల్లి రూ.250కు చేరిక.. చక్కెర 50 శాతం పెరుగుదల
- బెల్లం ధర రూ.75 వరకు.. పూల ధరలు కూడా భారీగా పెంపు

## స్మార్ట్ మీటర్లపై టీఆర్ ఎస్ చీఫ్ కవిత ఆగ్రహం



03



## నాపైన ఏసీపీతో నిఘా పెట్టించిండ్రు!

- ఎంపీ అరవింద్ సంచలన ఆరోపణలు
- కదలికలపై పోలీస్ నిఘా ఆరోపణ
- డీజీపీ సీవీ ఆనంద్‌కు ఎక్స్‌లో ఫిర్యాదు
- సీఎం సోదరుడి ఆదేశాలంటూ వ్యాఖ్య
- రాజ్యాంగం, చట్టం అంశంపై ప్రశ్నలు
- ప్రభుత్వ స్పందనపై రాజకీయ ఉత్కంఠ

03

# ఇదేనా ప్రజా పాలన?

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

రాష్ట్రంలో ఉద్యోగాల కోసం లక్షలాది మంది నిరుద్యోగులు ఎదురుచూస్తున్న వేళ రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఉద్యోగ నోటిఫికేషన్ల విషయంలో జాప్యం చేస్తోందని బీఆర్ఎస్ ఎల్పీ ఉపనేత హరీశ్ రావు విమర్శించారు. యువత భవిష్యత్తుకు భరోసా కల్పించే నియామక ప్రకటనలు విడుదల చేయడంలో ప్రభుత్వం ఎందుకు వెనుకడుగు వేస్తోందని ప్రశ్నించారు. ఉద్యోగాల కోసం చదువులు పూర్తి చేసి, పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న యువతలో నిరాశ పెరుగుతోందని పేర్కొన్నారు. ఖాళీ పోస్టుల వివరాలు సేకరించి వేగంగా నియామక ప్రక్రియ ప్రారంభించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. నిరుద్యోగుల ఆశలు నిలబెట్టేలా స్పష్టమైన కార్యాచరణ ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న కుటుంబాల ఆర్థిక పరిస్థితిని ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోవాలని సూచించారు. నోటిఫికేషన్లపై స్పష్టత లేకపోవడం యువతలో ఆందోళన పెంచుతోందని అన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను గుర్తు చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఉద్యోగ క్యాలెండర్ ప్రకటించాలని హరీశ్ రావు డిమాండ్ చేశారు. ఇదే సమయంలో 121 మద్యం బ్రాండ్లకు సంబంధించిన నోటిఫికేషన్లు మాత్రం ఆఘమేఘాల మీద విడుదల చేస్తున్నారని హరీశ్ రావు మండిపడ్డారు. యువతకు ఉద్యోగాలు కల్పించే ప్రక్రియలో కనిపించని వేగం మద్యం వ్యాపారానికి సంబంధించిన నిర్ణయాల్లో ఎందుకు కనిపిస్తోందని నిలదీశారు. నిరుద్యోగుల జీవితాలను ప్రభావితం చేసే నియామకాలపై నెలకొన్న ఆలస్యం ప్రభుత్వ ప్రాధాన్యతలను ప్రశ్నించేలా ఉందన్నారు. మద్యం విక్రయాల ద్వారా వచ్చే ఆదాయంపై చూపుతున్న శ్రద్ధను ఉద్యోగాల కల్పనపై కూడా చూపాలని సూచించారు. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ప్రభుత్వ పోస్టులను గుర్తించి, వాటి భర్తీకి సమయపట్టిక ప్రకటించాలని డిమాండ్ చేశారు. యువతను నిరాశకు గురిచేసే నిర్ణయాలకు బదులుగా ఉపాధి అవకాశాలను పెంచే విధానాలు తీసుకురావాలని కోరారు. ఉద్యోగ నోటిఫికేషన్ల కోసం ఎదురు చూస్తున్న అభ్యర్థులకు ప్రభుత్వం సమాధానం చెప్పాలని అన్నారు. లిక్కర్ ప్రకటనల వేగంపై వివరణ ఇవ్వాలని ప్రశ్నించారు. నిరుద్యోగులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరారు. రెండు లక్షల ప్రభుత్వ ఉద్యోగాల హామీపై కూడా హరీశ్ రావు తీవ్ర విమర్శలు చేశారు. ఎన్నికల సమయంలో యువతకు ఇచ్చిన హామీల్లో ఉద్యోగ కల్పనకు ప్రాధాన్యత ఇచ్చినప్పటికీ, అమలులో మాత్రం పరిస్థితి భిన్నంగా ఉందని ఆరోపించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ విషయంలో విద్యార్థులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఉన్నత విద్య కోసం ఆర్థిక సహాయం అవసరమైన విద్యార్థుల కుటుంబాలకు భరోసా కల్పించాలని డిమాండ్ చేశారు. రాజీవ్ యువ వికాసం పథకం కూడా ఆశించిన స్థాయిలో ముందుకు సాగడం లేదని ఎద్దేవా చేశారు. యువత స్వయం ఉపాధి అవకాశాల కోసం ఎదురుచూస్తున్న పరిస్థితిలో పథకాల అమలుకు వేగం పెంచాల్సిన అవసరం ఉందన్నారు. మేనిఫెస్టోలో పేర్కొన్న హామీల అమలుపై ప్రభుత్వం ప్రజలకు స్పష్టమైన వివరాలు ఇవ్వాలని కోరారు. నిరుద్యోగ సమస్యను రాజకీయ ప్రచార అంశంగా కాకుండా అత్యవసర సామాజిక సమస్యగా చూడాలని సూచించారు. రేవంత్ పగ.. యువత దగ అన్నట్లుగా రాష్ట్రంలో పరిస్థితి తయారైందని హరీశ్ రావు తీవ్ర వ్యాఖ్యలు చేశారు. యువతకు భవిష్యత్తుపై నమ్మకం కల్పించాల్సిన ప్రభుత్వం నిర్ణయాల్లో స్పష్టత చూపడం లేదని ఆరోపించారు. ఉద్యోగ నోటిఫికేషన్లు ఎప్పుడు వస్తాయో తెలియని పరిస్థితి కొనసాగితే పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులు మానసికంగా, ఆర్థికంగా ఇబ్బందులు పడతారని పేర్కొన్నారు. పరీక్షలకు సిద్ధమయ్యేందుకు కోచింగ్, పుస్తకాలు, ప్రయాణాల కోసం కుటుంబాలు ఖర్చు చేస్తున్నాయని గుర్తు చేశారు. నియామక ప్రక్రియ ఆలస్యం అయితే ఆ భారమంతా అభ్యర్థులపైనే పడుతుందని అన్నారు. ప్రభుత్వ శాఖల్లో ఖాళీలను భర్తీ చేయడం ద్వారా పరిపాలన సామర్థ్యం పెరుగుతుందని పేర్కొన్నారు. యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తే కుటుంబాల ఆర్థిక స్థితి మెరుగుపడుతుందని చెప్పారు. నిరుద్యోగ సమస్యపై అసెంబ్లీ వేదికగా చర్చించి, కార్యాచరణ ప్రకటించాలని డిమాండ్ చేశారు. యువతకు భరోసా కల్పించే చర్యలు చేపట్టాలని కోరారు. ఉద్యోగ ప్రకటనలపై తేదీలు వెల్లడించాలని డిమాండ్ చేశారు. అభ్యర్థులకు నమ్మకం కల్పించాలని కోరారు. జాబ్ నోటిఫికేషన్లు నిల్.. లిక్కర్ నోటిఫికేషన్లు ఫుల్.. ఇదేనా రేవంత్ రెడ్డి ప్రజా పాలన అని హరీశ్ రావు ప్రశ్నించారు. ప్రభుత్వ ప్రాధాన్యతలు యువత ఆకాంక్షలకు విరుద్ధంగా ఉన్నాయని విమర్శించారు. ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న నిరుద్యోగులకు తక్షణం నోటిఫికేషన్లు విడుదల చేసి నియామక ప్రక్రియ ప్రారంభించాలని డిమాండ్ చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు, యువ వికాస పథకం అమలు, మేనిఫెస్టో హామీలపై కూడా ప్రభుత్వం స్పష్టమైన సమాధానం ఇవ్వాలని కోరారు. నిరుద్యోగుల సమస్యను పరిష్కరించకుండా మద్యం రంగానికి సంబంధించిన ప్రకటనలకు ప్రాధాన్యత ఇవ్వడం సరికాదన్నారు. యువతలో పెరుగుతున్న అసంతృప్తిని ప్రభుత్వం గమనించాలని సూచించారు. ఉద్యోగ క్యాలెండర్ ప్రకటించి ప్రతి ఖాళీ పోస్టును నిర్ణీత గడువులో భర్తీ చేయాలని కోరారు. హామీల అమలుపై ప్రజలకు నివేదిక ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ చర్యలు యువతకు భరోసా కల్పించేలా ఉండాలని హరీశ్ రావు స్పష్టం చేశారు. ఇదే ప్రభుత్వానికి ఆయన ప్రధాన ప్రశ్నగా నిలిచింది.



## 2029 నాటికే జమిలి ఎన్నికలు?

**న్యూఢిల్లీ :** దేశవ్యాప్తంగా లోక్‌సభ, రాష్ట్రాల అసెంబ్లీలకు ఒకేసారి ఎన్నికలు నిర్వహించాలన్న 'వన్ నేషన్ వన్ ఎలక్షన్' ప్రతిపాదనపై కీలక పరిణామం చోటుచేసుకుంది. ముందుగా అంచనా వేసిన 2034 కంటే ఐదేళ్ల ముందే, అంటే 2029 సార్వత్రిక ఎన్నికల నాటికే జమిలి ఎన్నికలు నిర్వహించే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఈ ప్రతిపాదనపై అధ్యయనం చేస్తున్న పార్లమెంటరీ జాయింట్ కమిటీ (జేపీసీ) ఛైర్మన్ పి.పి. చౌదరి ఈ మేరకు కీలక సంకేతాలిచ్చారు. వివిధ వర్గాల నుంచి ఈ ప్రతిపాదనకు అనూహ్యమైన మద్దతు లభిస్తోందని పి.పి. చౌదరి తెలిపారు. కమిటీ సంప్రదించిన ప్రజాప్రతినిధులు, రాజకీయ పార్టీలు, నిపుణులు, ఇతర భాగస్వామ్య వర్గాల్లో దాదాపు 99 శాతం మంది జమిలి ఎన్నికల ఆలోచనకు సానుకూలంగా స్పందించారని ఆయన వెల్లడించారు. ఈ బలమైన మద్దతే 2029 నాటికి దీనిని అమలు చేయాలనే ఆలోచనకు బలం చేకూరుస్తోందని కమిటీ వర్గాలు పేర్కొంటున్నాయి. ఇటీవల జరిగిన జేపీసీ సమావేశానికి కాంగ్రెస్ నాయకురాలు ప్రియాంక గాంధీ, సీనియర్ నేత పి. చిదంబరం, ఎన్సీపీ ఎంపీ సుప్రియా సూలే, తృణమూల్ కాంగ్రెస్ నాయకురాలు సాగరికా ఘోష్‌వంటి ప్రతిపక్ష సభ్యులు హాజరయ్యారు. జమిలి ఎన్నికల సాధ్యాసాధ్యాలు, దానివల్ల ఎదురయ్యే సవాళ్లపై వారు తమ అభిప్రాయాలను, అభ్యంతరాలను కమిటీ ముందుంచారు. అయితే, జమిలి ఎన్నికల అమలు అంత సులభం కాదు. దీనికోసం రాజ్యాంగంలోని పలు అధికరణలను సవరించాల్సి ఉంటుంది. పార్లమెంట్ ఉభయ సభలతో పాటు, కనీసం సగం రాష్ట్రాల అసెంబ్లీల ఆమోదం కూడా అవసరం. ప్రస్తుతం వేర్వేరు సమయాల్లో ఎన్నికలు జరుగుతున్న రాష్ట్రాల అసెంబ్లీల పదవీకాలాన్ని కొన్నింటికి తగ్గించడం, మరికొన్నింటికి పెంచడం వంటి క్లిష్టమైన ప్రక్రియను చేపట్టాల్సి ఉంటుంది.

# సురేఖపై సైలెంట్.. కేంద్రంపై ఫైర్!

**మొదటి పేజీ తరువాయి**

కేంద్రానికి చేరుతాయని వివరించారు. వివరాలు లేవని చెప్పడం వాస్తవాలను వక్రీకరించడమేనని విమర్శించారు. అధికారులు పక్షపాతంగా వ్యవహరిస్తే ఉద్యోగాలకు రాజీనామా చేసి రాజకీయాల్లోకి రావాలని వ్యంగ్యంగా సూచించారు. తెలంగాణ పెట్టుబడుల కార్యక్రమాన్ని అడ్డుకోవడం ద్వారా రాష్ట్రానికి నష్టం కలిగించే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు. విదేశీ సంస్థలతో చర్చలు, యువత అవకాశాలు, పెట్టుబడుల విస్తరణపై ప్రభుత్వం దృష్టి పెడుతుందని చెప్పారు. అనుమతి సమస్య వచ్చినా ప్రత్యామ్నాయ మార్గాల్లో పెట్టుబడిదారులతో సంబంధాలు కొనసాగిస్తామని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ప్రజలకు వాస్తవాలు వివరిస్తామని రేవంత్ రెడ్డి చెప్పారు, తెలంగాణ ప్రయోజనాల కోసం జాతీయ స్థాయిలో గళం వినిపిస్తామని తెలిపారు. వైబ్రెంట్ గుజరాత్ కార్యక్రమాల కోసం గుజరాత్ ముఖ్యమంత్రికి అమెరికా, కెనడా రోడ్‌షోలకు అనుమతి ఇచ్చిన కేంద్రం, తెలంగాణ రైజింగ్ కోసం తన పర్యటనకు అడ్డంకులు ఎందుకు సృష్టించిందని రేవంత్ ప్రశ్నించారు. తన పర్యటనలో స్పష్టత లేదని భావిస్తే ఇంగ్లండ్ పర్యటనకు అనుమతి ఎలా ఇచ్చారని నిలదీశారు. మోదీది గుజరాత్, రేవంత్‌ది తెలంగాణ అన్నట్లుగా కేంద్ర వైఖరి కనిపిస్తోందని ఆరోపించారు. పెట్టుబడుల విషయంలో రాష్ట్రాల మధ్య పోటీ సహజమేనని చెప్పారు. అయితే కేంద్రం అన్ని రాష్ట్రాలకు సమాన అవకాశాలు కల్పించాల్సిన బాధ్యత ఉందన్నారు. తెలంగాణ బీజేపీ నేతలు రాష్ట్ర ప్రయోజనాల కోసం కేంద్రాన్ని ప్రశ్నించాలని సూచించారు. రాష్ట్ర హక్కుల విషయంలో వెనక్కి తగ్గబోమని తేల్చిచెప్పారు. తెలంగాణ అభివృద్ధి కార్యక్రమాలకు రాజకీయ రంగు పులమడం సమాఖ్య స్ఫూర్తికి విఘాతమని ముఖ్యమంత్రి విమర్శించారు. రాష్ట్రానికి రావాల్సిన పెట్టుబడులు, అవకాశాల విషయంలో ఎలాంటి రాజీ ఉండదని తేల్చిచెప్పారు, సమాన అవకాశాల కోసం కేంద్రాన్ని ప్రశ్నిస్తామని స్పష్టం చేశారు. కేంద్ర నిర్ణయంపై పార్లమెంట్‌లో తెలంగాణ వాదన వినిపిస్తామని రేవంత్ రెడ్డి ప్రకటించారు. రాష్ట్ర అభివృద్ధి అంశాలను జాతీయ స్థాయిలో చర్చకు తీసుకెళ్తామని తెలిపారు. అనుమతి నిరాకరణతో ప్రభుత్వం వెనక్కి తగ్గదని స్పష్టం చేశారు. తెలంగాణ రైజింగ్ కార్యక్రమాన్ని మరింత విస్తృతంగా ముందుకు తీసుకెళ్తామని చెప్పారు. పెట్టుబడిదారులు, విద్యా సంస్థలు, క్రీడా సంస్థలు, అంతర్జాతీయ కంపెనీలతో ప్రత్యక్ష సంబంధాలు పెంచేందుకు కొత్త ప్రణాళికలు రూపొందిస్తామని వివరించారు. కేంద్రం అనుమతించకపోయినా పెట్టుబడుల కోసం ప్రత్యామ్నాయ మార్గాలు అన్వేషిస్తామని తెలిపారు. హైదరాబాద్‌ను ప్రపంచ స్థాయి పెట్టుబడి కేంద్రంగా తీర్చిదిద్దడమే లక్ష్యమన్నారు. మరోవైపు కొండా సురేఖ అంశాన్ని పార్టీ నాయకత్వం పరిష్కరిస్తుందని స్పష్టం చేశారు. పార్టీ నిర్ణయాలకు అందరూ కట్టుబడి ఉండాలని పునరుద్ఘాటించారు. ప్రభుత్వ దృష్టి మాత్రం ప్రజా సంక్షేమం, అభివృద్ధి, పెట్టుబడులు, ఉద్యోగ అవకాశాలపైనే ఉంటుందని ముఖ్యమంత్రి తేల్చిచెప్పారు. పెట్టుబడుల కోసం ప్రత్యామ్నాయ మార్గాలు వెతుకుతూ అభివృద్ధి లక్ష్యాలను ముందుకు తీసుకెళ్తామని సీఎం స్పష్టం చేశారు.



## ఈగల్ టీమ్‌లో ఇంటి దొంగలు




**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

తెలంగాణ ఈగల్ టీమ్‌లో పనిచేస్తున్న ఇద్దరు కానిస్టేబుల్స్ స్వామి, నరహరి వ్యవహారం పోలీస్ శాఖలో కలకలం రేపుతోంది. డ్రగ్స్ నిర్మూలన కోసం ఏర్పాటైన ప్రత్యేక బృందంలో విధులు నిర్వహించిన వీరిద్దరూ, సీజ్ చేసిన నిషేధిత మాదకద్రవ్యాలను నిబంధనల ప్రకారం రికవరీలో చూపకుండా అక్రమంగా దాచినట్లు ఆరోపణలు వచ్చాయి. తర్వాత ఆ డ్రగ్స్‌ను బయట వ్యక్తులకు విక్రయించి డబ్బు సంపాదించేందుకు ప్రయత్నించినట్లు దర్యాప్తులో వెల్లడైనట్టు సమాచారం. ఈ వ్యవహారం వెలుగులోకి రావడంతో ఉన్నతాధికారులు ఇద్దరినీ సస్పెండ్ చేశారు. కొన్నేళ్లుగా ఈగల్ టీమ్‌లో పనిచేసిన వీరికి డ్రగ్స్ కేసుల్లో కీలక అనుభవం ఉంది. పట్టుబడిన నిందితుల వివరాలు సేకరించే బాధ్యత కూడా వీరికి ఉండేది. ఇప్పుడు అదే సమాచారం దుర్వినియోగం చేసినట్లు ఆరోపణలు వచ్చాయి. ఈ ఘటన పోలీస్ వర్గాల్లో తీవ్ర చర్చకు దారితీసింది. ఈ ఘటనతో డ్రగ్స్ నిరోధక చర్యల్లో పనిచేసే సిబ్బంది నిబద్ధత, పర్యవేక్షణపై కొత్త ప్రశ్నలు తలెత్తుతున్నాయి. స్వామి, నరహరి గతంలో డ్రగ్స్ కేసుల్లో నిందితులను పట్టుకోవడంలో కీలకంగా వ్యవహరించినట్లు అధికారులు గుర్తించారు. దాడులు, తనిఖీల సమయంలో పట్టుబడిన పెడ్లర్లు, వినియోగదారుల వ్యక్తిగత వివరాలు, సంప్రదింపు నంబర్లు వీరి వద్దకు చేరేవి. ఆ సమాచారాన్ని అధికారిక దర్యాప్తు కోసం వినియోగించాల్సిన పరిస్థితిలో, కొందరిని వ్యక్తిగతంగా సంప్రదించి డ్రగ్స్ సరఫరాకు సంబంధాలు ఏర్పరచుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇలా పలువురు వ్యక్తులతో సంబంధాలు కొనసాగిస్తూ అక్రమ విక్రయాలకు పాల్పడినట్లు ప్రాథమిక విచారణలో అనుమానాలు వ్యక్తమయ్యాయి. డ్రగ్స్ కేసుల్లో అధికారికంగా సీజ్ చేసిన వస్తువులను రికార్డుల్లో చూపించడం, సురక్షితంగా భద్రపరచడం పోలీసుల బాధ్యత. ఆ ప్రక్రియను పక్కనపెట్టి మాదకద్రవ్యాలను బయటకు తరలించే ప్రయత్నం చేయడం ఇప్పుడు శాఖలో పెద్ద ప్రశ్నగా మారింది. కేసు విచారణ కొనసాగుతోంది. పూర్తి వివరాలు అధికారిక నివేదిక తర్వాత వెల్లడయ్యే అవకాశం ఉంది. అధికారిక సమాచారం బయటకు రాకముందు ఆరోపణలపై తుది నిర్ణయం చెప్పడం సరికాదని అధికారులు భావిస్తున్నారు. ఇటీవల పెడ్లర్లపై అధికారులు చేపట్టిన తనిఖీల సమయంలో ఈ వ్యవహారానికి సంబంధించిన కీలక ఆధారాలు బయటపడినట్లు తెలుస్తోంది. స్వామి, నరహరికి పట్టుబడిన ఎక్స్టసీ టాబ్లెట్లను రికవరీలో నమోదు చేయకుండా దాచుకున్నట్లు ఆరోపణలు వచ్చాయి. వాటిని బయట ప్రైవేట్ వ్యక్తులకు విక్రయించేందుకు ప్రయత్నించిన సమయంలో అనుమానాలు బలపడ్డాయి. దాచిన ఎక్స్టసీ టాబ్లెట్ల విలువ సుమారు యాభై లక్షల రూపాయల వరకు ఉండవచ్చని సమాచారం. డ్రగ్స్ పెడ్లర్లు ఇచ్చిన సమాచారాన్ని ఆధారంగా చేసుకుని ఉన్నతాధికారులు ఇద్దరు కానిస్టేబుల్స్‌పై నిఘా పెట్టినట్లు తెలిసింది. అనంతరం అంతర్గత విచారణ చేపట్టి ఆరోపణలపై వివరాలు సేకరించారు. సాక్ష్యాలు, సమాచారం పరిశీలించిన తర్వాత వారిని విధుల నుంచి దూరంగా ఉంచుతూ సస్పెన్షన్ చర్యలు తీసుకున్నట్లు తెలుస్తోంది. ఈ ఘటనలో మరెవరైనా ప్రమేయం ఉందా, ఇంతకాలం అక్రమ కార్యకలాపాలు కొనసాగాయా అనే కోణాల్లో అధికారులు పరిశీలిస్తున్నట్లు సమాచారం. తదుపరి విచారణలో మరిన్ని విషయాలు వెలుగులోకి రావచ్చు. అధికారులు అన్ని కోణాల్లో ఆధారాలను పరిశీలిస్తున్నారు. స్వామి, నరహరి గతంలో డ్రగ్స్ నియంత్రణ చర్యల్లో చురుకుగా పనిచేసినందుకు సందర్భాల్లో ప్రశంసలు, అవార్డులు అందుకున్నట్లు సమాచారం. డ్రగ్స్ పట్టుకోవడంలో చూపిన పనితీరుకు గుర్తింపు పొందిన సిబ్బందిపైనే ఇప్పుడు తీవ్రమైన ఆరోపణలు రావడం శాఖలో ఆశ్చర్యానికి కారణమైంది. నిషేధిత మాదకద్రవ్యాలను అడ్డుకోవాల్సిన ప్రత్యేక బృందానికి చెందిన సిబ్బంది వాటి అక్రమ విక్రయానికి పాల్పడ్డారనే ఆరోపణలు పరిస్థితి తీవ్రతను స్పష్టం చేస్తున్నాయి. ఒకవైపు డ్రగ్స్‌పై కఠిన చర్యలు తీసుకుంటున్న పోలీస్ శాఖ, మరోవైపు తమ వ్యవస్థలోనే ఇలాంటి ఆరోపణలు రావడంతో అంతర్గత పర్యవేక్షణపై ప్రశ్నలు ఎదురవుతున్నాయి. ముఖ్యంగా స్వాధీనం చేసుకున్న డ్రగ్స్‌కు సంబంధించిన రికార్డులు, నిల్వ విధానం, అధికారుల పర్యవేక్షణ వంటి అంశాలపై కట్టుదిట్టమైన తనిఖీలు అవసరమనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ ఘటన తర్వాత ఈగల్ టీమ్ పనితీరుపై కూడా దృష్టి పెరిగింది. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవడంతోపాటు భవిష్యత్తులో నియంత్రణ చర్యలు అవసరమని అధికారులు భావిస్తున్నారు. డ్రగ్స్ నిర్మూలన కోసం పనిచేసే బృందంలో ఉన్న సిబ్బందిపైనే అక్రమ డ్రగ్స్ విక్రయ ఆరోపణలు రావడం తెలంగాణలో చర్చనీయాంశంగా మారింది. ప్రజల నుంచి డ్రగ్స్ సమాచారాన్ని సేకరించి, నిందితులను పట్టుకుని, మాదకద్రవ్యాలను స్వాధీనం చేసుకోవాల్సిన బాధ్యత ఉన్న సిబ్బంది వ్యవహారంపై అనుమానాలు రావడం వ్యవస్థపై ప్రభావం చూపే అంశంగా మారింది. స్వామి, నరహరి వ్యవహారంలో ఉన్నతాధికారులు ప్రారంభించిన విచారణ పూర్తయిన తర్వాత ఆరోపణలకు సంబంధించిన వాస్తవాలు స్పష్టమయ్యే అవకాశం ఉంది. ప్రస్తుతం ఇద్దరినీ విధులకు దూరంగా ఉంచి సస్పెండ్ చేయడం ద్వారా శాఖ చర్యలు ప్రారంభించింది. అక్రమంగా దాచినట్లు చెబుతున్న ఎక్స్టసీ టాబ్లెట్ల మూలం, వాటి గమ్యం, సంబంధిత వ్యక్తుల వివరాలు వంటి అంశాలను అధికారులు పరిశీలిస్తున్నట్లు సమాచారం. విచారణలో మరిన్ని పేర్లు బయటపడతాయా, డ్రగ్స్ అక్రమ నెట్‌వర్క్‌తో సంబంధాలు ఎంతవరకు ఉన్నాయన్నది ఆసక్తికరంగా మారింది.

# జనసేనలోకి కొండా సుస్మిత?

**మొదటి పేజీ తరువాయి**

లేఖ రాయడం చర్చనీయాంశమైంది. ఇదే సమయంలో సురేఖను మంత్రి పదవి నుంచి తొలగించాలని అసమ్మతి వర్గం డిమాండ్ చేసింది. దాదాపు ఇరవై మంది ఎమ్మెల్యేలు బహిరంగంగా గళం విప్పడంతో వ్యవహారం మరింత సీరియస్‌గా మారింది. పీసీసీ కూడా సురేఖ వ్యవహారంపై నివేదికను ఏఐసీసీకి పంపినట్లు సమాచారం. ఇప్పుడు అధిష్ఠానం నిర్ణయంపైనే అందరి దృష్టి నెలకొంది. కఠిన చర్యలు తీసుకుంటే కొండా కుటుంబం తదుపరి అడుగు ఏంటన్నది ఆసక్తిగా మారింది. అధిష్ఠానం నుంచి వచ్చే ఆదేశాలు పార్టీ భవిష్యత్ సమీకరణాలను ప్రభావితం చేయవచ్చని నేతలు భావిస్తున్నారు. ఈ పరిస్థితుల్లో కొండా కుటుంబం ప్రత్యామ్నాయ రాజకీయ మార్గాలపై దృష్టి పెట్టినట్లు ప్రచారం జరుగుతోంది. ముఖ్యంగా సుస్మిత జనసేన వైపు అడుగులు వేస్తున్నారనే చర్చ తెలంగాణ రాజకీయ వర్గాల్లో ఊపందుకుంది. జూబ్లీహిల్స్‌లోని ఓ ప్రముఖ నేత నివాసంలో జనసేన కీలక నేతలతో ఆమె భేటీ కానున్నట్లు సమాచారం. ఈ సమావేశంలో పరకాల అసెంబ్లీ టికెట్‌పై ప్రధానంగా చర్చ జరిగే అవకాశం ఉందని తెలుస్తోంది. ఉమ్మడి వరంగల్ జిల్లాలో పార్టీకి నాయకత్వం వహించే బాధ్యతలు చేపట్టే అంశం కూడా చర్చకు రావచ్చని సమాచారం. గతంలోనే పరకాల నియోజకవర్గంపై సుస్మిత ఆసక్తి వ్యక్తం చేసినట్లు రాజకీయ వర్గాలు గుర్తుచేస్తున్నాయి. కాంగ్రెస్‌లో తల్లి మంత్రి పదవిలో ఉన్నప్పటికీ, భవిష్యత్ రాజకీయ అవకాశాల విషయంలో స్పష్టత లేకపోవడం కుటుంబాన్ని ప్రత్యామ్నాయాల వైపు నడిపిస్తున్నట్లు కనిపిస్తోంది. ఈ నేపథ్యంలో జనసేనతో చర్చలకు ప్రాధాన్యం పెరిగింది. ఈ భేటీకి సంబంధించిన వివరాలు అధికారికంగా బయటకు రాకపోయినా, రాజకీయ వర్గాల్లో రాజకీయ వర్గాల్లో ఆసక్తి పెరిగింది. జనసేన నుంచి వచ్చే స్పందనతో సుస్మిత వ్యూహంపై కొంత స్పష్టత వచ్చే అవకాశం ఉంది. అప్పటి వరకు ఊహాగానాలు కొనసాగనున్నాయి. కొండా సురేఖపై కాంగ్రెస్ అధిష్ఠానం కఠిన నిర్ణయం తీసుకుంటే జనసేనలోకి వెళ్లే అవకాశాన్ని కుటుంబం పరిశీలిస్తున్నట్లు సమాచారం. అయితే చర్యలు లేకపోయినా సుస్మిత జనసేనలో కీలక బాధ్యతలు పొందేందుకు ప్రయత్నిస్తున్నారనే ప్రచారం కొనసాగుతోంది. ఇటీవల జనసేన అధినేత పవన్‌కల్యాణ్ వరంగల్ పర్యటనకు వచ్చిన స్పందన, ఆయనకు ఉన్న వ్యక్తిగత అభిమాన బలం, తెలంగాణలో పార్టీని విస్తరించాలన్న సంకేతాలు కొండా కుటుంబానికి ఆకర్షణగా మారినట్లు రాజకీయ విశ్లేషణలు వినిపిస్తున్నాయి. తెలంగాణలో వచ్చే ఎన్నికల బరిలో జనసేనను నిలబెట్టాలన్న పవన్ ఆలోచన కూడా ఈ సమీకరణానికి బలం చేకూరుస్తోంది. ముఖ్యంగా ఉమ్మడి వరంగల్ ప్రాంతంలో పార్టీకి బలమైన స్థానిక నాయకత్వం అవసరమనే అభిప్రాయం ఉంది. సుస్మిత చేరితే ఆ లోటు భర్తీ కావచ్చన్న అంచనాలు జనసేన వర్గాల్లో వినిపిస్తున్నాయి. అయితే ఇవన్నీ ప్రస్తుతానికి రాజకీయ చర్చలుగానే ఉన్నాయి. పార్టీ విస్తరణలో వరంగల్‌కు ప్రాధాన్యం ఇవ్వాలని జనసేన భావిస్తే సుస్మితకు అవకాశం దక్కవచ్చన్న చర్చ ఉంది. ఇక పీసీసీ నివేదికలో సురేఖ వ్యవహారంపై ఏ అంశాలను ప్రస్తావించారన్నది కూడా కీలకంగా మారింది. పార్టీ క్రమశిక్షణ, ముఖ్యమంత్రి నాయకత్వంపై వచ్చిన వ్యాఖ్యలు, అనంతరం జరిగిన పరిణామాలు అధిష్ఠానం పరిశీలనలో ఉన్నట్లు సమాచారం. సురేఖకు మద్దతుగా మాట్లాడే వర్గాలు కూడా ఉన్నప్పటికీ, ఎమ్మెల్యేల బహిరంగ వ్యతిరేకత పార్టీకి ఇబ్బందికరంగా మారింది. బీసీ నాయకురాలిగా సురేఖకు ఉన్న రాజకీయ ప్రాధాన్యం దృష్ట్యా నిర్ణయం తీసుకునే ముందు అధిష్ఠానం అన్ని కోణాలను పరిశీలించే అవకాశం ఉంది. మంత్రి పదవి నుంచి తొలగింపు వంటి చర్య జరిగితే వరంగల్ రాజకీయాల్లో కొత్త సమీకరణాలు ఏర్పడవచ్చు. అదే సమయంలో సుస్మిత జనసేనలో చేరితే పరకాల కేంద్రంగా కొత్త రాజకీయ పోటీ మొదలయ్యే అవకాశముంది. కాంగ్రెస్‌లో కొనసాగితే కుటుంబానికి భవిష్యత్ అవకాశాలపై మరోసారి చర్చ జరిగే పరిస్థితి కనిపిస్తోంది. అందుకే ప్రస్తుత పరిణామాలు ఉత్కంఠను పెంచుతున్నాయి. అయితే అధిష్ఠానం తుది నిర్ణయం తీసుకునే వరకు రాజకీయంగా ఎలాంటి అంచనాకూ అధికారిక ప్రకటన కోసం పార్టీ వర్గాలు ఎదురుచూస్తున్నాయి. ఇప్పుడు అందరి చూపు కొండా కుటుంబం తదుపరి నిర్ణయంపైనే ఉంది. కాంగ్రెస్ అధిష్ఠానం సురేఖపై ఎలాంటి చర్య తీసుకుంటుందో తేలిన తర్వాత సుస్మిత రాజకీయ వ్యూహం మరింత స్పష్టమయ్యే అవకాశం ఉంది. జనసేనతో భేటీ నిజమైతే అది కేవలం మర్యాదపూర్వక సమావేశమా, రాజకీయ భవిష్యత్‌పై చర్చనా అన్నది కూడా ఆసక్తికరంగా మారుతుంది. పరకాల టికెట్, ఉమ్మడి వరంగల్ బాధ్యతలు, తెలంగాణలో జనసేన విస్తరణ వంటి అంశాలు చర్చకు వస్తే ఈ భేటీకి రాజకీయ ప్రాధాన్యం పెరుగుతుంది. మరోవైపు కాంగ్రెస్ అధిష్ఠానం కఠిన చర్యలకు వెళ్లకుండా సమస్యను అంతర్గతంగా పరిష్కరిస్తే కొండా కుటుంబం వైఖరి ఎలా ఉంటుందన్నది ప్రశ్నగా మిగులుతుంది. ఏ నిర్ణయం వచ్చినా వరంగల్ రాజకీయాల్లో దాని ప్రభావం కనిపించే అవకాశముంది. ప్రస్తుతానికి జనసేన వైపు సుస్మిత అడుగులు వేస్తున్నారనే ప్రచారం మాత్రమే ఉంది. అధికారిక ప్రకటన వెలువడే వరకు దీనిపై తుది నిర్ణయం చెప్పలేం. ఈ పరిణామాలు తెలంగాణ రాజకీయాల్లో కొత్త చర్చకు తెరతీసింది.



## 'జీవో 97'తో లాభమా? నష్టమా?

**మొదటి పేజీ తరువాయి**

యూనివర్సిటీ పరిధికి అనుసంధానిస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం విద్యార్థులు, అధ్యాపకుల్లో ఆందోళన పెంచింది. కార్మిక, ఉపాధి కల్పన, శిక్షణ శాఖను శక్తి పేరుతో పునర్వ్యవస్థీకరించిన ప్రభుత్వం, ఐటీఐలు, అడ్వాన్స్‌డ్ ట్రైనింగ్ సెంటర్లు, పాలిటెక్నిక్‌లను ఒకే వ్యవస్థలోకి తీసుకురావాలని ప్రతిపాదించింది. ఆస్తులు, నిర్వహణ బాధ్యతలను స్కిల్స్ యూనివర్సిటీతో అనుసంధానించే అంశం కూడా జీవోలో ప్రస్తావనకు వచ్చింది. దీంతో విద్యా వ్యవస్థ స్వరూపం మారుతుందన్న చర్చ మొదలైంది. ప్రస్తుతం రామాంతపూర్, మసబ్ ట్యాంక్, రాయదుర్గం ప్రాంతాల్లో నిరసనలు కొనసాగుతున్నాయి. ఈ నిర్ణయంపై స్పష్టత లేకపోవడంతో విద్యార్థులలో భవిష్యత్తు మార్గంపై అనిశ్చితి నెలకొంది. పాలిటెక్నిక్‌ల ప్రత్యేక గుర్తింపు, పరీక్షల నిర్వహణ, పాఠ్యప్రణాళిక, డిప్లొమా ధ్రువపత్రాల జారీ వంటి అంశాలపై కూడా సమగ్ర వివరణ అవసరమవుతోంది. ప్రభుత్వం చెబుతున్న ఉద్దేశం మాత్రం నైపుణ్య శిక్షణను ఆధునికీకరించడమే. సంప్రదాయ పాలిటెక్నిక్ కోర్సుల్లో తరగతి బోధనకు ఎక్కువ ప్రాధాన్యం ఉండగా, పరిశ్రమలకు అవసరమైన శిక్షణ తగిన స్థాయిలో లేదన్న అభిప్రాయం అధికారుల్లో ఉంది. ఐటీఐలు, పాలిటెక్నిక్‌లు, స్కిల్స్ యూనివర్సిటీలను సమన్వయంతో నడిపితే ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, రోబోటిక్స్, ఈవీ టెక్నాలజీ, ఆటోమేషన్ వంటి ఆధునిక రంగాల్లో శిక్షణ అందించవచ్చని ప్రభుత్వం భావిస్తోంది. పీపీపీ విధానంలో పరిశ్రమల భాగస్వామ్యాన్ని పెంచి, డిప్లొమా పూర్తయ్యే నాటికే ఉద్యోగ అవకాశాలు కల్పించాలన్నది లక్ష్యంగా చెబుతోంది. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా పాఠ్యాంశాలు రూపొందించడం, ప్రయోగాత్మక శిక్షణ పెంచడం, విద్యార్థులకు ఉపాధి అవకాశాలు అందించడం ఈ మార్పు వెనుక ప్రధాన ఉద్దేశాలుగా అధికారులు వివరిస్తున్నారు. పరిశ్రమలతో అనుసంధానం పెరగడం మంచిదే అయినా, డిప్లొమా విద్యకు ఉన్న సాంకేతిక, ఉన్నత విద్యా ప్రాధాన్యం తగ్గకుండా జాగ్రత్తలు అవసరం. శిక్షణతోపాటు పరిశోధన, ఉన్నత విద్యకు వెళ్లే మార్గాలు బలంగా ఉండాలని విద్యార్థులు కోరుతున్నారు. అయితే విద్యార్థులు మాత్రం తమ అకడమిక్ భవిష్యత్తుపై ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పాలిటెక్నిక్ డిప్లొమా పూర్తిచేసిన వారికి సూపర్‌వైజరీ, సబ్‌ఇంజనీర్, టెక్నికల్ హోదాల్లో అవకాశాలు ఉన్నాయి. అలాంటి కోర్సులను ఐటీఐలతో సమాన వ్యవస్థలోకి తీసుకురావడం వల్ల డిప్లొమా విలువ తగ్గే ప్రమాదం ఉందని వారు చెబుతున్నారు. ముఖ్యంగా బీటెక్ రెండో సంవత్సరంలోకి ప్రవేశం కల్పించే ఈసెట్ లేటరల్ ఎంట్రీ విధానం కొనసాగుతుందా అన్న సందేహం ఉంది. విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై కూడా స్పష్టత కోరుతున్నారు. మరోవైపు అధ్యాపకులు తమ కేడర్, ప్రమోషన్లు, వేతనాలు, భద్రతపై ఆందోళన చెందుతున్నారు. ఏఐసీటీఈ నిబంధనలకు అనుగుణంగా ఉన్నత విద్యాశాఖలో కొనసాగుతున్న సేవా ప్రయోజనాలు మారకూడదని వారు కోరుతున్నారు. లిఖితపూర్వక హామీ కోరుతున్నారు. ఈ హక్కులు స్పష్టంగా కొనసాగితే విద్యార్థుల భయాలు తొలగే అవకాశం ఉంది. పాలిటెక్నిక్ విద్యను నైపుణ్య శిక్షణతో కలపడం స్వాగతించదగినదే అయినా, రెండు వ్యవస్థల మధ్య తేడాలు కాపాడటం అత్యవసరమని నిపుణులు చెబుతున్నారు. ఈ వివాదానికి పరిష్కారంగా పాలిటెక్నిక్ విద్యా స్వరూపాన్ని కాపాడుతూ నైపుణ్య శిక్షణను బలోపేతం చేయాలన్న సూచనలు వస్తున్నాయి. కళాశాలల అకడమిక్ నియంత్రణ, సర్టిఫికేషన్ బాధ్యతలను ఉన్నత విద్యాశాఖ, ఎస్‌బీటీఈటీ పరిధిలోనే కొనసాగించాలని నిపుణులు చెబుతున్నారు. యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీని నైపుణ్య శిక్షణ, పరిశ్రమల అనుసంధాన భాగస్వామిగా ఉపయోగించుకోవచ్చని సూచిస్తున్నారు. ఈసెట్ లేటరల్ ఎంట్రీ హక్కు, ఫీజు రీయింబర్స్‌మెంట్, ప్రవేశ విధానంపై జీవోలోనే నిబంధనలు ఉండాలని కోరుతున్నారు. అధ్యాపకుల కేడర్, వేతనాలు, ప్రమోషన్లు ఏఐసీటీఈ మార్గదర్శకాల ప్రకారమే కొనసాగాలని అభిప్రాయపడుతున్నారు. దీంతో విద్యా ప్రమాణాలు దెబ్బతినకుండా నైపుణ్య శిక్షణ సాధ్యమవుతుందని భావిస్తున్నారు. ప్రభుత్వం విద్యార్థుల సందేహాలను పరిగణనలోకి తీసుకుని స్పష్టత ఇవ్వాల్సిన ఉందని విద్యావర్గాలు చెబుతున్నాయి. ముఖ్యంగా డిప్లొమా విద్యార్థులను కేవలం కార్మిక శక్తిగా చూడకుండా, సాంకేతిక విద్యార్థులుగా గుర్తించే విధానం కొనసాగాలని వారు సూచిస్తున్నారు.



# వంటింట్లో ఉల్లి మంట!



**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

తెలంగాణలో నిత్యావసరాల ధరలు సామాన్యుల గుండెల్లో గుబులు పుట్టిస్తున్నాయి. వంటింటి ఖర్చులు రోజురోజుకూ పెరగడంతో మధ్యతరగతి కుటుంబాల నెలవారీ బడ్జెట్ తారుమారవుతోంది. బియ్యం, చక్కెర, బెల్లం, కూరగాయలు, వంటనూనెల ధరలు పెరగడంతో ఇంటి నిర్వహణ భారంగా మారింది. తక్కువ ఆదాయం ఉన్న కుటుంబాలు అవసరాలు తగ్గించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. గతంలో నిర్ణయించిన నెలసరి ఖర్చుతో ఇప్పుడు సరుకులు పూర్తిగా కొనలేకపోతున్నామని వినియోగదారులు వాపోతున్నారు. మార్కెట్ పరిస్థితులు, రవాణా వ్యయాలు, డిమాండ్ పెరుగుదల ప్రభావం ధరలపై కనిపిస్తోంది. పండగల సీజన్ సమీపించడంతో కొన్ని వస్తువుల ధరలు మరింత ఎగబాకే అవకాశం ఉందన్న ఆందోళన నెలకొంది. ఇప్పటికే కూరగాయల మార్కెట్‌కు వెళ్లిన ప్రతి కుటుంబానికి పెరిగిన ధరల ప్రభావం స్పష్టంగా కనిపిస్తోంది. వ్యాపారులు కొనుగోలు ధరలు పెరగడం వల్లే రిటైల్ ధరలు పెంచాల్సి వస్తోందని చెబుతున్నారు. ప్రభుత్వం ధరల నియంత్రణకు తక్షణ చర్యలు తీసుకోవాలని ప్రజలు బలంగా కోరుతున్నారు. ఈ పరిస్థితి త్వరగా మారాలని వారు ఆశిస్తున్నారు. సన్నబియ్యం ధరలు ఇటీవల భారీగా పెరిగి వినియోగదారులకు షాక్ ఇస్తున్నాయి. రెండు నెలల క్రితం కిలో రూ.50 నుంచి రూ.52 వరకు ఉన్న మేలు రకం సన్నబియ్యం ఇప్పుడు రూ.63 నుంచి రూ.70 వరకు పలుకుతోంది. ధర పెరిగినా నాణ్యతలో కొంత తగ్గుదల కనిపిస్తోందని వ్యాపార వర్గాలు చెబుతున్నాయి. వానాకాలం పంట బియ్యంతో యాసంగి పంటను కలపడం వల్ల నూకల శాతం పెరుగుతోందని సమాచారం. బహిరంగ మార్కెట్లో సన్నరకాల ధాన్యం లభ్యత తగ్గడం ధరలపై ప్రభావం చూపుతోంది. కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడు రాష్ట్రాల నుంచి సన్నబియ్యానికి డిమాండ్ పెరగడం సరఫరాపై ఒత్తిడిని పెంచుతున్నట్లు మార్కెట్ వర్గాలు వివరిస్తున్నాయి. పౌరసరఫరాల సంస్థ వద్ద నిల్వలు ఉన్నప్పటికీ వేలం ప్రక్రియకు ఆశించిన స్పందన రాకపోవడం పరిస్థితిని క్లిష్టంగా మార్చింది. బియ్యం ధర పెరగడం నేరుగా ప్రతి కుటుంబ వంటింటి బడ్జెట్‌పై ప్రభావం చూపుతోంది. ధరల నియంత్రణకు నిల్వల విడుదల వేగవంతం చేయాలని ప్రజలు కోరుతున్నారు. కూరగాయల మార్కెట్‌లో ధరల పెరుగుదల వినియోగదారులకు మరో భారంగా మారింది. ఉల్లిగడ్డ ధర నెలరోజుల వ్యవధిలోనే దాదాపు రెట్టింపైంది. జూలై చివరి వారంలో కిలో రూ.22 నుంచి రూ.26 ఉన్న ఉల్లి ఇప్పుడు రూ.45 నుంచి రూ.52 వరకు చేరింది. వెల్లుల్లి ధర కూడా జూన్ మొదటి వారంతో పోలిస్తే రూ.120 నుంచి రూ.130 స్థాయి నుంచి రూ.250 వరకు పెరిగింది. ఎండుమిర్చి ధర కిలోకు రూ.240 నుంచి రూ.300కు చేరగా, కొన్ని కార్పొరేట్ స్టోర్లలో రూ.360 వరకు విక్రయిస్తున్నారు. క్యారెట్ రూ.60 నుంచి రూ.70, బీన్స్ రూ.100 నుంచి రూ.110, చిక్కుడు రూ.80 వరకు పలుకుతున్నాయి. మోరంగడ్డ ధర రూ.25 నుంచి రూ.33 స్థాయి నుంచి రూ.60కు చేరింది. పచ్చిమిర్చి కూడా రూ.45 నుంచి రూ.55 వరకు పెరిగింది. ఈ పెరుగుదలతో కూర వండటానికే అదనపు వ్యయం అవుతోంది. రోజువారీ కూలీలు, చిన్న ఉద్యోగులు, పెన్షన్ ఆధారిత కుటుంబాలు ధరల ప్రభావాన్ని ఎక్కువగా ఎదుర్కొంటున్నాయి. మార్కెట్‌లో ధరల హెచ్చుతగ్గులను నియంత్రించేందుకు సరఫరా వ్యవస్థను బలోపేతం చేయాలని వ్యాపారులు సూచిస్తున్నారు. ఈ చర్యలతో వినియోగదారులకు కొంత ఉపశమనం లభించవచ్చు. వంటింటి ఇతర సరుకుల ధరలు కూడా కుటుంబాలపై అదనపు భారాన్ని మోపుతున్నాయి. వంట నూనెల ధరలు కిలోకు రూ.4 నుంచి రూ.5 వరకు పెరిగాయి. చక్కెర ధర ఆరేడు వారాల్లో కిలోకు రూ.42 నుంచి రూ.44 స్థాయి నుంచి రూ.60 నుంచి రూ.65 వరకు చేరింది. దాదాపు 50 శాతం పెరుగుదల నమోదైంది. బెల్లం ధర కూడా కిలోకు రూ.55 నుంచి రూ.70 నుంచి రూ.75 వరకు పెరిగింది. టీ, కాఫీ, అల్పాహార పదార్థాలతో పాటు రోజువారీ వంటలో ఉపయోగించే ఇతర సరుకుల ధరలు పెరగడంతో నెలవారీ ఖర్చు మరింత పెరుగుతోంది. పండగలు, శుభకార్యాలు, బోనాల నేపథ్యంలో పూల ధరలు కూడా గణనీయంగా పెరిగాయి. గతంలో మూరకు రూ.20 నుంచి రూ.25 ఉన్న పూల ధర ఇప్పుడు రూ.50 నుంచి రూ.60 వరకు చేరింది. ధరలపై నిరంతర పర్యవేక్షణ అవసరమని వినియోగదారులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. ఇదే సమయంలో అక్రమ నిల్వలపై చర్యలు అవసరం. నిత్యావసరాల ధరలు అదుపు తప్పుతున్న నేపథ్యంలో ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని సామాన్యులు కోరుతున్నారు. మార్కెట్‌లో నిల్వలు, సరఫరా, రిటైల్ ధరలపై అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేయాల్సిన అవసరం ఉంది. అవసరమైన వస్తువుల లభ్యత తగ్గినప్పుడు ప్రభుత్వ నిల్వలను వేగంగా మార్కెట్‌కు విడుదల చేయడం ద్వారా ధరల ఒత్తిడిని తగ్గించవచ్చు. రైతులకు గిట్టుబాటు ధర లభించేలా చర్యలు తీసుకుంటూనే వినియోగదారులపై అధిక భారం పడకుండా సరఫరా గొలుసును సమర్థంగా నిర్వహించాలి. ధరలు పెరిగిన ప్రతిసారి కుటుంబాలు తమ ఆహార అవసరాలను తగ్గించుకోవడం సమస్యలకు దారితీయవచ్చు. ముఖ్యంగా తక్కువ ఆదాయ వర్గాలపై ప్రభావం ఎక్కువగా ఉంటుంది. ప్రభుత్వం మార్కెట్ తనిఖీలు పెంచి, కృత్రిమ కొరత సృష్టించే ప్రయత్నాలను అడ్డుకోవాలని ప్రజలు కోరుతున్నారు. పౌరసరఫరాల వ్యవస్థను మరింత చురుకుగా నిర్వహిస్తే కొంత ఉపశమనం కలిగే అవకాశం ఉంది. ధరల వివరాలను ప్రజలకు పారదర్శకంగా అందించడం అవసరం. వంటింటి ఖర్చులు తగ్గేలా తక్షణ చర్యలు చేపట్టాలని ప్రజలు ఆశిస్తున్నారు.

# నాపైన ఏసీపీతో నిఘా పెట్టించిండ్రు!

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

తెలంగాణ రాజకీయాల్లో ఇంటెలిజెన్స్, పోలీసుల నిఘా వ్యవహారం మరోసారి తీవ్ర చర్చకు దారితీసింది. నిజామాబాద్ బీజేపీ ఎంపీ ధర్మపురి అరవింద్ తన కదలికలపై రాష్ట్ర ప్రభుత్వం నిఘా పెట్టిందంటూ సంచలన ఆరోపణలు చేశారు. ఈ అంశంపై ఆయన నేరుగా రాష్ట్ర డీజీపీ సీవీ ఆనంద్‌కు ఎక్స్ వేదికగా ఫిర్యాదు చేయడం రాజకీయ వర్గాల్లో ఆసక్తిని పెంచింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోదరుడి ఆదేశాల మేరకు తెలంగాణ పోలీస్ శాఖకు చెందిన ఏసీపీ ర్యాంక్ అధికారి తనపై నిరంతరం నిఘా పెడుతున్నారని సమాచారం ఉందని అరవింద్ పేర్కొన్నారు. తనకు దశాబ్దాలుగా సీవీ ఆనంద్ సమర్థుడైన అధికారిగా తెలుసని చెబుతూనే, ప్రస్తుతం జరుగుతోందని చెబుతున్న పరిణామం తనను విస్మయానికి గురిచేసిందని ట్వీట్ చేశారు. ఈ ఆరోపణలు నిజమైతే పోలీస్ వ్యవస్థ పనితీరుపై తీవ్రమైన ప్రశ్నలు తలెత్తుతాయని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ముఖ్యంగా ప్రజాప్రతినిధి కదలికలపై నిఘా అంశం ఇప్పుడు రాజకీయ చర్చకు కేంద్రబిందువైంది. తనపై జరుగుతోందని చెబుతున్న పోలీస్ నిఘాను అరవింద్ తీవ్రంగా తప్పుబట్టారు. తెలంగాణ పోలీసులు రాజ్యాంగానికి, చట్టానికి లోబడి పనిచేస్తున్నారా లేక ముఖ్యమంత్రి కుటుంబ సభ్యుల ఆదేశాలకు అనుగుణంగా వ్యవహరిస్తున్నారా అనే ప్రాథమిక ప్రశ్న తలెత్తుతోందని ఆయన వ్యాఖ్యానించారు. పోలీస్ శాఖ చట్టానికి జవాబుదారీగా ఉండాలని, ఏ రాజకీయ కుటుంబానికి జవాబుదారీగా ఉండకూడదని స్పష్టం చేశారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో పోలీసుల తటస్థత అత్యంత కీలకమని, రాజకీయ ప్రత్యర్థులపై నిఘా కోసం అధికార యంత్రాంగాన్ని ఉపయోగించారనే అనుమానం కూడా తీవ్రమైనదేనని ప్రతిపక్ష వర్గాలు చెబుతున్నాయి. అరవింద్ చేసిన వ్యాఖ్యల్లో ముఖ్యంగా సీఎం సోదరుడి పేరు ప్రస్తావనకు సంబంధించిన ఆరోపణ రాజకీయంగా మరింత వేడిని పెంచుతోంది. సాధారణంగా ఇటువంటి ఆరోపణలకు ప్రభుత్వం, పోలీస్ శాఖ నుంచి వివరణ రావడం సహజమే. అయితే ప్రస్తుతం ఈ అంశంపై అధికారికంగా ఎలాంటి స్పందన వస్తుందన్నది ఆసక్తికరంగా మారింది.



అరవింద్ ఆరోపణలకు ఆధారాలు ఏమిటన్న ప్రశ్న కూడా రాజకీయ చర్చలో ప్రాధాన్యం సంతరించుకుంది. ఎక్స్ వేదికగా డీజీపీని నేరుగా ఉద్దేశించి అరవింద్ చేసిన పోస్టు సోషల్ మీడియాలో వేగంగా వైరల్ అవుతోంది. ఒక ఎంపీ స్వయంగా రాష్ట్ర పోలీస్ అధిపతికి బహిరంగంగా ఫిర్యాదు చేయడం సాధారణ రాజకీయ విమర్శల కంటే భిన్నమైన పరిణామంగా కనిపిస్తోంది. తనపై నిఘా జరుగుతోందనే సమాచారాన్ని ఆయన ఏ ఆధారాలపై పొందారన్న విషయంపై కూడా చర్చ జరుగుతోంది. బీజేపీ శ్రేణులు ఈ ఆరోపణలను తీవ్రంగా ప్రచారం చేస్తుండగా, అధికార పక్షం నుంచి వచ్చే సమాధానం కోసం ఎదురుచూస్తున్నారు. తెలంగాణలో గతంలో కూడా రాజకీయ నేతలపై నిఘా, ఫోన్ ట్యాపింగ్, అధికార యంత్రాంగం దుర్వినియోగం వంటి అంశాలు పెద్ద రాజకీయ దుమారాన్నే సృష్టించాయి. అలాంటి నేపథ్యంలో అరవింద్ తాజా ఆరోపణలు మరింత ప్రాధాన్యం పొందుతున్నాయి. పోలీస్ శాఖ రాజకీయ ఒత్తిళ్లకు అతీతంగా పనిచేయాలనే వాదన మరోసారి ముందుకు వచ్చింది. ప్రజాస్వామ్యంలో ప్రభుత్వంపై విమర్శలు చేసే ప్రతిపక్ష నేతలకు భద్రత, స్వేచ్ఛ విషయంలో స్పష్టమైన నమ్మకం ఉండాలనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఈ వివాదంలో డీజీపీ సీవీ ఆనంద్ స్పందన కీలకంగా మారనుంది. అరవింద్ చేసిన ఫిర్యాదుపై అంతర్గతంగా విచారణకు ఆదేశిస్తారా, లేక ఆరోపణలను ఖండిస్తూ అధికారిక ప్రకటన విడుదల చేస్తారా అన్నది చూడాలి. రాష్ట్ర ప్రభుత్వం కూడా ఈ అంశాన్ని రాజకీయ ఆరోపణగా కొట్టిపారేస్తుందా లేక వాస్తవ పరిస్థితిని వివరిస్తుందా అనేది ఆసక్తిని రేకెత్తిస్తోంది. ముఖ్యమంత్రి కుటుంబ సభ్యుడి ఆదేశాల మేరకు పోలీస్ అధికారి పనిచేస్తున్నారన్న ఆరోపణను ప్రభుత్వం సీరియస్‌గా తీసుకోవాల్సిన అవసరం ఉందని బీజేపీ నేతలు చెబుతున్నారు. మరోవైపు ఎలాంటి అధికారిక ఆధారాలు లేకుండా ఇలాంటి ఆరోపణలు చేయడం రాజకీయ ఉద్దేశంతోనే జరుగుతుందా అన్న ప్రశ్నను అధికార పక్షం లేవనెత్తే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో రెండు వైపుల వాదనలు రాజకీయ వాతావరణాన్ని మరింత వేడెక్కించే సూచనలు కనిపిస్తున్నాయి. ముఖ్యంగా తెలంగాణలో బీజేపీ, కాంగ్రెస్ మధ్య పెరుగుతున్న రాజకీయ పోటీకి ఈ వివాదం కొత్త అంశంగా మారే అవకాశముంది. రానున్న రోజుల్లో పరస్పర ఆరోపణలు తీవ్రస్థాయికి చేరవచ్చని పరిశీలకులు అంచనా వేస్తున్నారు. ప్రస్తుతం అరవింద్ ట్వీట్ చుట్టూ సోషల్ మీడియాలో విభిన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కొందరు ప్రతిపక్ష నేతపై పోలీస్ నిఘా ఆరోపణను తీవ్రంగా పరిగణించి సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేస్తుంటే, మరికొందరు ఆరోపణలకు స్పష్టమైన ఆధారాలు బయటపెట్టాలని కోరుతున్నారు. రాజకీయ నాయకులపై నిఘా వ్యవహారం నిజమైతే అది వ్యక్తిగత స్వేచ్ఛ, ప్రజాస్వామ్య విలువలు, పోలీస్ వ్యవస్థ తటస్థతపై ప్రభావం చూపే అంశమవుతుందని నెటిజన్లు వ్యాఖ్యానిస్తున్నారు. మరోవైపు ఈ వివాదం కేవలం ఎక్స్ పోస్టులతోనే ముగుస్తుందా లేక అధికారిక ఫిర్యాదు, విచారణ దిశగా వెళుతుందా అన్నది చూడాలి. అరవింద్ ఆరోపణలకు డీజీపీ సీవీ ఆనంద్ నుంచి వచ్చే స్పందన అత్యంత కీలకం కానుంది. రాష్ట్ర ప్రభుత్వం వివరణ ఇచ్చిన తర్వాతే ఈ వివాదంపై పూర్తి స్పష్టత వచ్చే అవకాశముంది. అప్పటివరకు తెలంగాణ రాజకీయాల్లో నిఘా వ్యవహారం హాట్ టాపిక్‌గా కొనసాగడం ఖాయంగా కనిపిస్తోంది. అధికార యంత్రాంగం వినియోగం, పోలీస్ స్వతంత్రతపై కొత్త రాజకీయ పోరు మొదలయ్యే సూచనలు కూడా స్పష్టంగా కనిపిస్తున్నాయి.

## కొండా సురేఖ చేరికపై అధిష్టానమే ఫైనల్

**తెలంగాణ బ్యూరో:** తెలంగాణ రాజకీయాల్లో మంత్రి కొండా సురేఖ భవిష్యత్‌పై చర్చ జరుగుతున్న వేళ, ఆమె బీజేపీలో చేరతారన్న ఊహాగానాలపై ఎంపీ డీకే అరుణ కీలక వ్యాఖ్యలు చేశారు. కొండా సురేఖను పార్టీలోకి తీసుకోవాలా? వద్దా? అనేది బీజేపీ నిర్ణయిస్తుందని స్పష్టం చేశారు. సోమవారం మీడియాతో చిట్‌చాట్‌లో మాట్లాడిన డీకే అరుణ పలు అంశాలపై స్పందించారు. ఈసారి మహబూబ్‌నగర్ స్థానికులకే ఎమ్మెల్సీ టికెట్ ఇవ్వాలని కోరుతున్నట్లు తెలిపారు. అన్ని ఎన్నికల్లో పనిచేసిన పవన్‌కుమార్‌రెడ్డికి టికెట్ ఇవ్వాలని పార్టీని కోరినట్లు చెప్పారు. బీజేపీ జాతీయ నూతన కమిటీపై స్పందిస్తూ, ఒక బాధ్యత నుంచి తొలగిస్తే అంతకంటే మంచి బాధ్యత ఇస్తారేమోనని వ్యాఖ్యానించారు. బండి సంజయ్ మంత్రి అయిన తర్వాత పార్టీ బాధ్యతలు ఉండవని, తాను ఎంపీ అయిన తర్వాత సమయం లేక కర్ణాటక ఇన్‌ఛార్జి బాధ్యతలను వదిలేశానని తెలిపారు. తెలంగాణ బీజేపీ ఎంపీలందరూ ఐక్యంగానే ఉన్నారని డీకే అరుణ స్పష్టం చేశారు. ఆగస్టు సంక్షోభం కాంగ్రెస్‌కే ఉందని, ఎవరిని గద్దె దించి ఎవరిని నియమిస్తారో చూడాలని వ్యాఖ్యానించారు. రేవంత్‌రెడ్డి అమెరికా పర్యటనపై ఆంక్షల అంశంపైనా ఆమె స్పందించారు. రేవంత్‌రెడ్డికి అన్ని విషయాలు తెలుసని, పాస్‌పోర్టుకు కూడా క్లియరెన్స్ అవసరమని పేర్కొన్నారు.



# హరీశ్‌రావు ఫాంహౌస్ ప్రభుత్వం కాదిది

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

తెలంగాణలో 22ఏ భూముల వ్యవహారం రాజకీయంగా మరింత వేడెక్కింది. హైదరాబాద్ నగర పరిధిలో ప్రైవేటు భూములను 22ఏ జాబితాలో చేర్చారంటూ ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణలపై మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఘాటుగా స్పందించారు. బీఆర్ఎస్ హయాంలో కనిపించిన ఫాంహౌస్ పాలనకు భిన్నంగా, తమది ప్రజా ప్రభుత్వం అని స్పష్టం చేశారు. రాష్ట్రంలో తలెత్తుతున్న సమస్యలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ, నిజాయితీ, జవాబుదారీతనంతో పరిష్కారాలు చూపుతున్నామని తెలిపారు. సమస్యలను రాజకీయంగా వాడుకుంటూ ప్రజల్లో భయాందోళనలు సృష్టించడం సరికాదని హితవు పలికారు. 22ఏ అంశంపై కొత్త కథనాలు అల్లి ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని బీఆర్ఎస్ నేతలపై విమర్శలు గుప్పించారు. ఇదే సమయంలో హరీశ్‌రావు తీరుపైనా మంత్రి తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. ప్రజలకు వాస్తవ పరిస్థితిని వివరించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని చెప్పారు. అందుకే అధికార యంత్రాంగం నుంచి పూర్తి వివరాలు సేకరించి, రిజిస్ట్రేషన్ల ప్రక్రియను స్పష్టంగా వివరిస్తున్నామని పేర్కొన్నారు. ప్రజలకు స్పష్టత ఇవ్వడమే లక్ష్యమని మరోసారి చెప్పారు. 22ఏ భూముల విషయంలో గతంలో రిలాక్స్ ఇచ్చిన కేసులకు ప్రభుత్వం క్లియరెన్స్ ఇచ్చిందని పొంగులేటి వెల్లడించారు. జెన్యూన్‌గా గుర్తించిన భూముల్లో 98 శాతం రిజిస్ట్రేషన్లు పూర్తయ్యాయని చెప్పారు. నిబంధనల ప్రకారం రిజిస్ట్రేషన్ చేయలేని వాటిని చేయలేమని స్పష్టంగా చెప్పామని వివరించారు. దీంతో అర్హత ఉన్న భూముల యజమానులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని భరోసా



ఇచ్చారు. హైదరాబాద్ పరిధిలో 22ఏ పేరుతో ప్రతిపక్షాలు చేస్తున్న ప్రచారంలో వాస్తవాలు తక్కువగా, రాజకీయ ఉద్దేశాలు ఎక్కువగా ఉన్నాయని ఆరోపించారు. ప్రజలు ఎలాంటి అపోహలకు గురికావద్దని సూచించారు. భూమి హక్కులకు సంబంధించిన సమస్యలను ప్రభుత్వం పరిశీలిస్తోందని తెలిపారు. ప్రతి ఫిర్యాదును నిర్దిష్ట వివరాలతో పరిశీలించి, సాధ్యమైన పరిష్కారం అందిస్తున్నామని చెప్పారు. రిజిస్ట్రేషన్ వ్యవస్థపై అనవసర అనుమానాలు కలిగించే ప్రయత్నాలను ప్రజలు నమ్మవద్దని మంత్రి కోరారు. ప్రభుత్వ నిర్ణయాలు ఆధారాలతో ఉంటాయని, వాటిపై రాజకీయ ఆరోపణలు చేయడం వల్ల సమస్య పరిష్కారం కాదని స్పష్టం చేశారు. ప్రభుత్వ రికార్డులే ఆధారమని తెలిపారు అన్నారు. టోల్‌ఫ్రీ నంబర్ పనిచేయడం లేదంటూ ప్రతిపక్షాలు చేస్తున్న విమర్శలను కూడా పొంగులేటి ఖండించారు. ఇప్పటివరకు ఆ నంబర్‌కు 1,162 కాల్స్ వచ్చాయని తెలిపారు. రిపీటెడ్ కాల్స్ తొలగించిన తర్వాత 980 ప్రత్యేక కాల్స్ నమోదయ్యాయని వివరించారు. వాటిలో 547 వ్యవసాయానికి అనుబంధమైన అంశాలకు సంబంధించినవని, మరో 433 కాల్స్ వ్యవసాయేతర విషయాలపై వచ్చాయని చెప్పారు. ఈ గణాంకాలు టోల్‌ఫ్రీ సేవ పనిచేస్తున్నదానికి స్పష్టమైన ఆధారమని పేర్కొన్నారు. ఫిర్యాదులు వస్తే వాటిని పరిశీలించేందుకు సంబంధిత శాఖలు చర్యలు తీసుకుంటున్నాయని వివరించారు. భూముల విషయంలో ఎవరైనా నిజమైన సమస్యతో ముందుకొస్తే ప్రభుత్వం పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటుందని స్పష్టం చేశారు. ప్రజల హక్కులను కాపాడటమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి పేర్కొన్నారు. అనవసర ప్రచారంతో ప్రజల్లో గందరగోళం పెంచడం వల్ల ఎవరికీ ప్రయోజనం ఉండదని చెప్పారు. ఈ వివరాలు అధికారిక వ్యవస్థల ద్వారా సేకరించామని మంత్రి స్పష్టం చేశారు. ప్రజలకు సేవలు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. ఇదే సమయంలో హరీశ్‌రావుపై పొంగులేటి చేసిన వ్యాఖ్యలు రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకున్నాయి. అధికారంలో ఉన్న సమయంలో బీజేపీ నేతలకు సంబంధించిన సంస్థలతో వ్యాపార సంబంధాలపై ప్రశ్నలు తలెత్తాయని మంత్రి ఆరోపించారు. తన కంపెనీ వెబ్‌సైట్‌ను ఎందుకు మూసివేశారంటూ హరీశ్‌రావును ప్రశ్నించారు. తప్పు ఏమీ లేకపోతే వెబ్‌సైట్ మూసివేయాల్సిన అవసరం ఏమొచ్చిందని నిలదీశారు. ప్రభుత్వ భూముల అమ్మకాలు, పర్సంటేజీల ఆరోపణలు, తరువాత వెబ్‌సైట్ మూసివేత వంటి అంశాలపై హరీశ్ మాట్లాడటం విడ్డూరంగా ఉందని వ్యాఖ్యానించారు. ఓట్ల కోసం ప్రజలను రెచ్చగొట్టడం ఆయనకు మొదటి నుంచీ అలవాటేనని విమర్శించారు. ఎన్నికల రాజకీయాల కోసం ప్రజల్లో అనుమానాలు పెంచడం కాకుండా, వాస్తవాలను వివరించాలని సూచించారు. 22ఏ వివాదాన్ని రాజకీయ ఆయుధంగా మార్చే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. ప్రభుత్వం మాత్రం సమస్యల పరిష్కారంపైనే దృష్టి పెడుతోందని స్పష్టం చేశారు. ప్రజలకు వాస్తవాలు తెలియజేయడమే ప్రభుత్వ ఉద్దేశమని తెలిపారు. మొత్తంగా 22ఏ భూముల అంశం తెలంగాణ రాజకీయాల్లో మరో కీలక వివాదంగా మారింది. ఒకవైపు బీఆర్ఎస్ నేతలు ప్రభుత్వంపై తీవ్ర ఆరోపణలు చేస్తుండగా, మరోవైపు మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి గణాంకాలు, ప్రభుత్వ చర్యలను ప్రస్తావిస్తూ ప్రతివాదన చేస్తున్నారు. జెన్యూన్ భూముల్లో 98 శాతం రిజిస్ట్రేషన్లు పూర్తయ్యాయని చెప్పడం ద్వారా వైఖరిని స్పష్టం చేసింది. టోల్‌ఫ్రీ నంబర్‌కు వచ్చిన 980 ప్రత్యేక కాల్స్ వివరాలను వెల్లడించడం ద్వారా సేవలు అందుబాటులో ఉన్నాయని వివరించారు. రిజిస్ట్రేషన్ కాలేదని ఎవరూ భయపడాల్సిన అవసరం లేదని మంత్రి భరోసా ఇచ్చారు. సమస్య ఉన్న ప్రతి కేసును పరిశీలిస్తామని చెప్పారు. హరీశ్‌రావు చేసిన విమర్శలకు సమాధానంగా వ్యక్తిగత, వ్యాపార అంశాలను ప్రస్తావించిన పొంగులేటి, 22ఏ భూములపై స్పష్టత కోసం ప్రభుత్వం మరింత సమాచారం అందిస్తుందా, ప్రతిపక్షాలు తమ ఆరోపణలకు ఆధారాలు చూపుతాయా అనేది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. వివాదం రాజకీయాలపై ప్రభావం చూపే అవకాశాలు ఉన్నాయి. భూముల స్థితిగతులపై అధికారిక సమాచారం తీసుకోవాలని సూచించారు.

# క్యూట్‌గా ఉన్నావు.. మీటవుతావా!

**మొదటిపేజీ తరువాయి**

ఈ ఆరోపణలపై పూర్తి ఇంటర్వ్యూ బయటకు వస్తే మరిన్ని వివరాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు. ప్రస్తుతం ప్రతిభ వ్యాఖ్యలపై అధికార, ప్రతిపక్ష వర్గాల్లో ఆసక్తి నెలకొంది. ఈ అంశంపై ప్రజల్లో కూడా విస్తృత ఆసక్తి కనిపిస్తోంది. వైరల్ అవుతున్న ప్రోమోలో ప్రతిభ మరింత తీవ్రంగా స్పందించినట్లు కనిపిస్తోంది. తనను వేధించిన సదరు క్రీడా మంత్రికి తాను గట్టిగా హెచ్చరిక ఇచ్చానని ఆమె వెల్లడించారు. రెండు నిమిషాల్లో నీ బాడీలో ఏ పార్ట్ పని చేయకుండా చేస్తానని చెప్పినట్లు ఆమె పేర్కొన్నారు. తనను తాను రక్షించుకోవడానికి ఆ సమయంలో ధైర్యంగా సమాధానం ఇచ్చానని ఆమె వివరించినట్లు ప్రోమో ద్వారా తెలుస్తోంది. ఈ వ్యాఖ్యలు ఇప్పుడు సామాజిక మాధ్యమాల్లో విస్తృత చర్చకు కారణమయ్యాయి. కాంగ్రెస్, బీజేపీ వర్గాలు వీడియోను తమ అధికారిక ఖాతాల్లో పంచుకుంటున్నాయి. అంతర్జాతీయ పతకాలు సాధించిన క్రీడాకారిణిని గౌరవించాల్సిన సమయంలో వ్యక్తిగత వ్యాఖ్యలతో ఇబ్బంది పెట్టడం దారుణమని ప్రత్యర్థి పార్టీ నేతలు విమర్శిస్తున్నారు. ఈ వ్యవహారం మహిళా క్రీడాకారిణుల భద్రత, గౌరవంపై మరోసారి చర్చను ముందుకు తెచ్చింది. అయితే పూర్తి సందర్భం తెలుసుకోవాల్సిన అవసరం ఉందని కొందరు అభిప్రాయపడుతున్నారు. సంబంధిత వర్గాలు ఇప్పుడు పూర్తి ఇంటర్వ్యూ కోసం ఎదురుచూస్తున్నాయి. ప్రతిభ తాజా వ్యాఖ్యలు గత బీఆర్ఎస్ ప్రభుత్వంలోని క్రీడా శాఖను లక్ష్యంగా చేసుకున్నవిగా ప్రచారం జరుగుతోంది. ఆ సమయంలో



క్రీడా మంత్రిగా శ్రీనివాస్ గౌడ్ బాధ్యతలు నిర్వహించారు. ప్రతిభ అంతర్జాతీయ స్థాయిలో పతకాలు సాధించిన సందర్భాల్లో ఆమెను ఇంటికి పిలిపించి అభినందించిన విషయాన్ని కూడా రాజకీయ వర్గాలు గుర్తుచేస్తున్నాయి. దీంతో ఆమె చేసిన ఆరోపణలు శ్రీనివాస్ గౌడ్‌ను ఉద్దేశించినవేనా అనే ప్రశ్న తెరపైకి వచ్చింది. అయితే ప్రోమోలో ప్రతిభ సదరు మంత్రిగా ఉన్న వ్యక్తి పేరును స్పష్టంగా వెల్లడించలేదు. అందువల్ల ఆరోపణలు ఎవరిని ఉద్దేశించాయనే అంశంపై స్పష్టత రావాలి. మరోవైపు, తనపై వచ్చిన ఆరోపణలపై శ్రీనివాస్ గౌడ్ నుంచి స్పష్టమైన స్పందన లేదు. ఆయన స్పందన వెలువడితే ఈ రాజకీయ వివాదానికి స్పష్టత వచ్చే అవకాశం ఉంది. అప్పటివరకు ప్రచారాన్ని నిర్ధారణగా భావించలేం. ఇదే అంశంపై రాజకీయ నేతల మధ్య మాటల యుద్ధం మొదలైంది. కామారెడ్డి జిల్లా పిట్లం మండలానికి చెందిన తక్కడపల్లి ప్రతిభ అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన క్రీడాకారిణిగా నిలిచారు. ఇటలీలో జరిగిన ఐదో చెస్ బాక్సింగ్ వరల్డ్ ఛాంపియన్‌షిప్‌లో ఆమె బంగారు పతకం సాధించారు. కోల్‌కతాలో జరిగిన ఆసియా చెస్ బాక్సింగ్ ఛాంపియన్‌షిప్‌లోనూ స్వర్ణం గెలిచారు. జాతీయ స్థాయిలో పద్నాలుగు స్వర్ణ పతకాలు సాధించిన ప్రతిభ, రెండు అంతర్జాతీయ రజత పతకాలను కూడా సాధించారు. మార్షల్ ఆర్ట్స్‌లోనూ ప్రతిభ చాటిన ఆమె దేశానికి ప్రాతినిధ్యం వహిస్తూ విజయాలు అందుకున్నారు. మహిళా సాధికారతకు క్రీడారంగం ద్వారా ఆదర్శంగా నిలిచిన ఆమె నుంచి వచ్చిన తాజా ఆరోపణలు ఇప్పుడు రాజకీయ చర్చకు కేంద్రంగా మారాయి. తన అనుభవాన్ని ఆమె బహిరంగంగా వెల్లడించడంతో మహిళా క్రీడాకారిణులు ఎదుర్కొనే సమస్యలపై చర్చ మొదలైంది. పూర్తి ఇంటర్వ్యూలో ఆమె మరిన్ని వివరాలు చెబుతారా అనే ఆసక్తి నెలకొంది. అలాగే ఈ వ్యవహారంపై తదుపరి పరిణామాలు ఎలా ఉంటాయోనన్న ఉత్కంఠ కొనసాగుతోంది. ఈ వ్యవహారంలో ప్రస్తుతం ప్రధానంగా రెండు అంశాలు చర్చనీయాంశంగా ఉన్నాయి. ఒకటి ప్రతిభ చేసిన వేధింపుల ఆరోపణలు, రెండోది ఆ ఆరోపణలు ఎవరిని ఉద్దేశించాయనే ప్రశ్న. రాజకీయ పార్టీలు తమకు అనుకూలంగా ఈ అంశాన్ని ప్రస్తావిస్తుండటంతో వివాదం మరింత వేడెక్కుతోంది. కాంగ్రెస్, బీజేపీ నేతలు గత ప్రభుత్వ వైఖరిపై విమర్శలు చేస్తుండగా, ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తి నుంచి వచ్చే సమాధానం కీలకంగా మారింది. మరోవైపు ప్రతిభకు జరిగిన అనుభవంపై పూర్తి వివరాలు వెలుగులోకి రావాల్సిన అవసరం ఉంది. వీడియో ప్రోమో ఆధారంగా మాత్రమే తుది నిర్ణయానికి రావడం సరికాదనే అభిప్రాయం కూడా వినిపిస్తోంది. పూర్తి ఇంటర్వ్యూ విడుదలైన తరువాత ఆమె చేసిన వ్యాఖ్యల సందర్భం, ఆరోపణల నేపథ్యం, సంబంధిత వ్యక్తి స్పందన వంటి అంశాలు స్పష్టమయ్యే అవకాశం ఉంది. అప్పటివరకు ఈ వ్యవహారం రాజకీయ దుమారం కొనసాగించే సూచనలు కనిపిస్తున్నాయి. ప్రతిభ ఆరోపణలపై అధికారికంగా ఎలాంటి చర్యలు ఉంటాయో కూడా ఇప్పుడు ఆసక్తిగా మారింది.

## స్మార్ట్ మీటర్ల పై టీఆర్ ఎస్ చీఫ్ కవిత ఆగ్రహం

**విశాలభారతి, సిటీ బ్యూరో :**

తెలంగాణలో గృహ విద్యుత్ కనెక్షన్లకు స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేయాలన్న ప్రభుత్వ నిర్ణయాన్ని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత తీవ్రంగా వ్యతిరేకించారు. స్మార్ట్ మీటర్ల పేరుతో పేద ప్రజలకు అందుతున్న విద్యుత్ సబ్సిడీలను దెబ్బతీసే ప్రయత్నం జరుగుతోందని ఆమె ఆరోపించారు. ఈ విధానాన్ని ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. స్మార్ట్ మీటర్ల ఏర్పాటు కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త విద్యుత్ సంస్కరణలలో భాగమని కవిత ఆరోపించారు. కేంద్రం తీసుకొచ్చిన పథకానికి రాష్ట్ర ప్రభుత్వం మద్దతు ఇస్తూ తెలంగాణలో స్మార్ట్ మీటర్లను అమలు చేసేందుకు ప్రయత్నిస్తోందని విమర్శించారు. స్మార్ట్ మీటర్లను ఏర్పాటు చేయడం ద్వారా కార్పొరేట్ సంస్థలకు ప్రయోజనం కల్పించే ప్రయత్నం జరుగుతోందని, ముఖ్యంగా అదానీ వ్యాపారానికి అనుకూలంగా ఈ విధానం తీసుకొస్తున్నారని ఆమె ఆరోపించారు. కొత్త స్మార్ట్ మీటర్లు ప్రీపెయిడ్ విధానంలో పనిచేస్తాయని కవిత ఆందోళన వ్యక్తం చేశారు. మొబైల్ ఫోన్‌కు ముందుగా రీచార్జ్ చేసుకున్నట్టే విద్యుత్ వినియోగానికి కూడా ముందుగానే డబ్బు చెల్లించాల్సి వస్తుందని ఆమె అన్నారు. రీచార్జ్ చేసిన మొత్తం పూర్తయితే విద్యుత్ సరఫరా నిలిచిపోయే పరిస్థితి వస్తుందని ఆమె అభిప్రాయపడ్డారు. ఈ విధానం పేద, మధ్యతరగతి కుటుంబాలపై అదనపు భారాన్ని మోపుతుందని విమర్శించారు. తెలంగాణలో అర్హత ఉన్న కుటుంబాలకు గృహ



జ్యోతి పథకం కింద నెలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందుతోంది. స్మార్ట్ మీటర్ల వల్ల ఈ పథకం ప్రయోజనాలకు భంగం కలిగే అవకాశం ఉందని కవిత ఆందోళన వ్యక్తం చేశారు. అలాగే ఎస్సీ, ఎస్టీ వర్గాలకు అందుతున్న విద్యుత్ ప్రయోజనాలు, సెలూన్లు, లాండ్రీ షాపులకు సంబంధించిన ఉచిత, సబ్సిడీ విద్యుత్ ప్రయోజనాలపైనా ప్రభావం పడే ప్రమాదం ఉందని ఆమె పేర్కొన్నారు.


**పవర్ ఎక్స్‌పోలో స్మార్ట్ మీటర్ల ప్రదర్శన**

హైదరాబాద్‌లో ఆగస్టు 22 నుంచి మూడు రోజుల పాటు పవర్ ఎక్స్‌పో నిర్వహించారు. విద్యుత్ రంగంలో కొత్త సాంకేతికతలు, స్మార్ట్ గ్రిడ్‌లు, విద్యుత్ ఆదా, ఆధునిక విద్యుత్ నిర్వహణ వ్యవస్థలను ఇందులో ప్రదర్శించారు. ఈ ఎక్స్‌పోలో ప్రదర్శించిన స్మార్ట్ మీటర్లను కవిత పరిశీలించారు. అనంతరం స్మార్ట్ మీటర్లను ప్రజలకు పరిచయం చేయడం, వాటి ఉపయోగాలపై డెమో నిర్వహించడం వెనుక ప్రభుత్వం ప్రజలను ఈ విధానానికి సిద్ధం చేసే ప్రయత్నం చేస్తోందని ఆమె విమర్శించారు.

# భూ భారతి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి

- పెండింగ్ దరఖాస్తులపై 2–3 రోజుల్లో నివేదికలు తెప్పించి చర్యలు తీసుకోవాలి
- అదనపు కలెక్టర్ చంద్రా రెడ్డి

విశాల భారతి ఇబ్రహీంపట్నం



ప్రజల నుంచి భూ భారతి ద్వారా అందుతున్న దరఖాస్తులను ఎలాంటి జాప్యం లేకుండా పరిశీలించి, సాధ్యమైనంత త్వరగా పరిష్కరించాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) చంద్రా రెడ్డి రెవెన్యూ శాఖ సూపరింటెండెంట్లను ఆదేశించారు.అదనపు కలెక్టర్ తన ఛాంబర్‌లో రెవెన్యూ శాఖ సూపరింటెండెంట్లతో సమీక్ష సమావేశం నిర్వహించి, భూ భారతి దరఖాస్తుల పరిష్కారం, పెండింగ్ సమస్యలు, క్షేత్రస్థాయిలో అవసరమైన నివేదికల సమర్పణ తదితర అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల నుంచి అందిన భూ భారతి దరఖాస్తులను ప్రాధాన్యతతో పరిశీలించి, వీలైనంత త్వరగా పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. తహసీల్దార్ లేదా ఆర్డీవో నుంచి నివేదిక అవసరమైన దరఖాస్తుల్లో, నివేదిక కోరిన తేదీ నుంచి 2-3 రోజుల్లోగా నివేదికను తెప్పించుకుని తదుపరి చర్యలు పూర్తి చేయాలని ఆదేశించారు. ఏదైనా సమస్య కార్యాలయ స్థాయిలోనే పరిష్కరించగలిగితే, దానిని తక్షణమే పరిష్కరించి దరఖాస్తును డిస్పోజ్ చేయాలని సూచించారు. తహసీల్దార్ లేదా ఆర్డీవో స్థాయి నివేదిక అవసరమయ్యే ఫైళ్లను, తమ స్థాయిలోనే పరిష్కరించాల్సిన ఫైళ్లను ప్రత్యేకంగా వేరు చేసి, వాటి పరిష్కారానికి అనుగుణంగా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.మధ్యవర్తులు, బ్రోకర్లను ప్రోత్సహించవద్దు భూ భారతి, 22A లేదా ఇతర భూ సంబంధిత సమస్యలను పరిష్కరిస్తామని చెప్పే మధ్యవర్తులు, బ్రోకర్లను ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రోత్సహించవద్దని అదనపు కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రజల తరఫున అంటూ కార్యాలయాలకు వచ్చే అనధికార మధ్యవర్తుల ద్వారా ఎటువంటి దరఖాస్తులు లేదా సమస్యల పరిష్కార ప్రక్రియను నిర్వహించకూడదని అధికారులకు సూచించారు. ప్రజలు కూడా ఈ విషయంలో అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు. భూ భారతి లేదా 22Aలో ఉన్న భూ సమస్యలను అధికారులతో మాట్లాడి పరిష్కరిస్తామని చెప్పే మధ్యవర్తులు, బ్రోకర్లను నమ్మవద్దని తెలిపారు. భూ సంబంధిత సమస్యల పరిష్కారం కోసం ప్రజలు నేరుగా సంబంధిత రెవెన్యూ కార్యాలయాలను సంప్రదించి, అధికారిక ప్రక్రియ ద్వారా తమ దరఖాస్తులను సమర్పించాలని సూచించారు.ప్రజలకు పారదర్శకంగా, వేగవంతంగా సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని, అధికారులు తమ పరిధిలోని దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచకుండా నిర్ణీత సమయంలో పరిష్కరించాలని అదనపు కలెక్టర్ ఆదేశించారు. రెవెన్యూ శాఖ అధికారులు ప్రజల సమస్యల పరిష్కారంలో మరింత బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ, ప్రభుత్వ పరిపాలనపై ప్రజల్లో విశ్వాసాన్ని మరింత పెంచేలా పనిచేయాలని ఆయన సూచించారు.

## జ్వరాల నియంత్రణకు కట్టుదిట్టమైన చర్యలు

- ఉల్వనూర్ పీహెచ్‌సీ పరిధిలో అప్రమత్తమైన వైద్యశాఖ
- ప్రతి కేసును క్షుణ్ణంగా పరిశీలించాలి
- జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ తుకారం రాథోడ్



**భద్రాద్రి ప్రతినిధి: విశాల భారతి :** పాల్వంచ మండలం, ఉల్వనూర్: ఉల్వనూర్ పీహెచ్‌సీ పరిధిలో ఇటీవల జ్వరంతో మరణం సంభవించిన నేపథ్యంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. తుకారం రాథోడ్ సోమవారం తుమ్మలగూడెం పీహెచ్‌సీని సందర్శించారు. ఆరోగ్య శిబిరం, ఏఎల్ఓ, డ్రై డే కార్యక్రమాలను పరిశీలించి ప్రజలు,సర్పంచ్, వైద్య సిబ్బందితో మాట్లాడారు.జ్వర కేసులపై ఇంటింటి సర్వే నిర్వహించాలని, ప్రతి కేసును క్షుణ్ణంగా పరిశీలించాలని సిబ్బందిని ఆదేశించారు. తీవ్ర కేసులను వెంటనే ఉన్నత వైద్య కేంద్రాలకు,అవసరమైతే 108 ద్వారా తరలించాలని సూచించారు. స్వల్ప జ్వర కేసులను ప్రతి నాలుగు గంటలకు పర్యవేక్షించాలని,పరిస్థితి విషమిస్తే తక్షణమే ఆస్పత్రికి తరలించాలని ఆదేశించారు.అలాగే గ్రామాల్లో ఏఎల్ఓ,డ్రై డే కార్యక్రమాలను పంచాయతీ సిబ్బంది సహకారంతో ప్రతిరోజూ నిర్వహించాలని,గర్భిణీల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు.జ్వర కేసుల విషయంలో నిర్లక్ష్యం చేయకుండా అప్రమత్తంగా ఉండాలని ఏ ఎస్ హెచ్ ఏ కార్యకర్తలకు ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు వైద్యాధికారి సిబ్బందికి సూచనలు చేశారు.

## పాల్వంచలో జరిగే బెంచ్ ప్రెస్ పోటీలను విజయవంతం చేద్దాం

- జిల్లా క్రీడాకారులకు పిలుపునిచ్చిన జివి రామిరెడ్డి



**భద్రాచలం : విశాల భారతి;** ఆగస్టు 30వ తేదీ అనగా ఆదివారం నాడు పాల్వంచలో యూనిటీగోల్డ్స్ జిమ్ వారి ఆధ్వర్యంలో నిర్వహించే బెంచ్ ప్రెస్ పోటీలను విజయవంతం చేయాలని జిల్లా జనరల్ సెక్రెటరీ జి.వి రాంరెడ్డి జిల్లా క్రీడాకారులకు పిలుపునివ్వడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో పాల్గొనే క్రీడాకారులు వయసు నిర్ధారణ కొరకు వారి యొక్క ఒరిజినల్ ఆధార్ కార్డును తీసుకొని రావలసి ఉంటుందని మరియు ఈ పోటీలో పాల్గొనే క్రీడాకారులు ఉదయం 8: 00 గంటలకు బాడీ వేయింగ్ కార్యక్రమం ప్రారంభించబడుతుంది కావున క్రీడాకారులు గమనించగలరు అని తెలిపారు. ఈ పోటీలో పాల్గొనే క్రీడాకారులకు టిఫిన్ మరియు మధ్యాహ్న భోజన సదుపాయం ఉచితంగా అందించబడుతుంది. ఈ పోటీలో పాల్గొని గెలుపొందిన క్రీడాకారులకు మెరిట్ సర్టిఫికెట్ మరియు మెమెంటో బహుకరించబడును. మరియు పార్టిసిపేట్ చేసిన ప్రతి క్రీడాకారునికి పార్టిసిపేషన్ సర్టిఫికెట్ కూడా ఇవ్వబడును. మరిన్ని వివరములకు జిల్లా జనరల్ సెక్రెటరీ. 9966588688.

**9642120130 జివి రామిరెడ్డి నెంబర్ లను సంప్రదించగలరు.**

## భక్తిశ్రద్ధలతో తొట్టెల ఊరేగింపు

**స్థానికుల ఆహ్వానం మేరకు పాల్గొన్న బిఆర్ఎస్ సీనియర్ నాయకుడు చెట్టి నవీన్ గౌడ్**



**విశాల భారతి, అబ్దుల్లాపూర్‌మెట్ :** పెద్ద అంబర్‌పేట్ డివిజన్ పసుమాముల గ్రామంలోని కళానగర్ లో బోనాల పండుగను పురస్కరించుకుని నిర్వహించిన తొట్టెల ఊరేగింపు కార్యక్రమం భక్తిశ్రద్ధలతో ఘనంగా జరిగింది. స్థానిక ప్రజల ఆహ్వానం మేరకు బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు చెట్టి నవీన్ కుమార్ గౌడ్ కార్యక్రమానికి హాజరై భక్తులతో కలిసి తొట్టెల ఊరేగింపులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించిన ఆయన, ప్రజలతో కలిసి బోనాల వేడుకల్లో పాల్గొన్నారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు బోనాల పండుగ ప్రతీకగా నిలుస్తుందని, అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. స్థానిక ప్రజలు, నాయకులు నవీన్ కుమార్ గౌడ్‌కు స్వాగతం పలికి కార్యక్రమంలో పాల్గొన్నందుకు కృతజ్ఞతలు తెలిపారు. వేడుకల్లో బోయ శ్రవణ్ కుమార్ , స్థానిక యువకులు మహిళలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని తొట్టెల ఊరేగింపును ఘనంగా నిర్వహించారు.

## నాగారంలో ఘనంగా వీసంశెట్టి వెంకటేశ్వర్లు 50వ వర్ధంతి సభ

- వీసంశెట్టి వెంకటేశ్వర్లు త్యాగం, సేవలు చిరస్మరణీయం.
- ఎర్రజెండా విస్తరణకు ఎనలేని కృషి
- పాలకుల ప్రజావ్యతిరేక విధానాలను తిప్పికొడదాం
- సిపిఐ రాష్ట్ర కార్యదర్శి,ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

భద్రాద్రి ప్రతినిధి :విశాల భారతి



అమరజీవి వీసంశెట్టి వెంకటేశ్వర్లు చేసిన నిస్వార్థ త్యాగం, ప్రజలకు, పార్టీకి ఆయన అందించిన సేవలు ఎప్పటికీ చిరస్మరణీయమని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు అన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ మండలం నాగారం గ్రామంలో అమరజీవి వీసంశెట్టి వెంకటేశ్వర్లు స్మారక స్తూపం వద్ద సోమవారం ఆయన 50వ వర్ధంతి సభ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కూనంనేని సాంబశివరావు ఆయన చిత్రపటానికి,స్మారక స్తూపానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం జరిగిన సంతాప సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ ప్రాంతంలో కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాణానికి, ఎర్రజెండా విస్తరణకు వీసంశెట్టి వెంకటేశ్వర్లు తన జీవితాన్ని ధారపోశారని కొనియాడారు. పాల్వంచ, బూర్గంపాడు, ములకలపల్లి మండలాల్లో భూస్వామ్య దోపిడీకి వ్యతిరేకంగా భూమి, భుక్తి, వ్యవసాయ కూలీల సమస్యలపై రాజీలేని పోరాటాలు చేశారని గుర్తుచేశారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుల నాయకత్వంలో పనిచేసి అణగారిన వర్గాలకు కొండంత అండగా నిలిచారని పేర్కొన్నారు. నాటి పోరాటాల స్ఫూర్తిని నేటి తరానికి అందించాల్సిన గురుతర బాధ్యత మనందరిపై ఉందని తెలిపారు. ఆయన ఆశయాలకు అనుగుణంగా కుల, మత, ప్రాంత భేదాలు లేని సమసమాజ స్థాపన కోసం శ్రమించాలని పిలుపునిచ్చారు. పేదలకు విద్య, వైద్యం, ఉపాధి, భూమి దక్కేంతవరకు ఎర్రజెండా అండతో ప్రజా ఉద్యమాలను ఉధృతం చేయడమే అమరులకు ఇచ్చే నిజమైన నివాళి అని స్పష్టం చేశారు. ఆయన కుటుంబం నేటికీ పార్టీలో నిబద్ధతతో కొనసాగడం గర్వకారణమన్నారు.ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్.కె. సాబీర్ పాషా, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ముత్యాల విశ్వనాథం, కల్లూరి వెంకటేశ్వరరావు, కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ మూడ్ గణేష్, రాష్ట్ర సమితి సభ్యులు నరాటి ప్రసాద్, సలిగంటి శ్రీనివాస్, చంద్ర నరేంద్ర, జిల్లా కార్యవర్గ సభ్యులు అడుసుమిల్లి సాయిబాబా వీసంశెట్టి పూర్ణచంద్రరావు, ఉప్పుశెట్టి రాహుల్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఆధునిక సంఘ సంస్కర్త పూలే

- సినిమాను తలపించిన నాటకం
- ఆ కాలంలో సమాజ రుగ్మతలను పారద్రోలిన గొప్ప నాయకుడు పూలే.

పాల్వంచ విశాల భారతి, 24,ఆగష్టు:



సమాజంలో అంటరానితనం, అవిద్య, మూఢ నమ్మకాలను పారద్రోలి, సమాజంలో వున్న రుగ్మతలను ఒంటరి పోరాటంతో పారద్రోలిన గొప్ప సంఘ సంస్కర్త పూలే అని వక్తలు కొనియాడారు. అభ్యుదయ ఆర్ట్ అకాడమీ హైదరాబాద్ వారిచే, సామాజిక చైతన్య నాటకోత్సవాల్లో భాగంగా, సింగరేణి కాలరీస్ కంపెని లిమిటెడ్ వారి ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి పాల్వంచ మండలంలోని పీయం శ్రీ సాంఘీక సొక్షేమ గురుకుల బాలుర పాఠశాల, కళాశాలలో పూలే జీవిత చరిత్రపై సత్యసోధన నాటకంను రెండవ రోజు ప్రదర్శించారు.ముందుగా వైస్ ప్రిన్సిపాల్ వెంకట రమణ, పాఠశాల పేరెంట్స్ కమిటి కో ఆర్డినేటర్ శనగ రామచందర్ రావు, అంబేద్కరిస్ట్ బరగడి దేవదానం, ఉపాధ్యాయుడు రవి పూలే దంపతుల చిత్ర పటానికి పూల మలలు వేసిన అనంతరం నాటకం ప్రారంభమైంది. రెండు గంటల నిడివి గల నాటకంలో పూలే జీవిత చరిత్ర ఆయన పిన్న వయసులో అనుభవించిన బాధలు, సావిత్రి బాయిని బాల్య వివాహం చేసుకున్న తర్వాత పరిణామాలను చక్కగా నాటకంలో ప్రదర్శించారు. ఆ కాలంలో వున్న సాంఘీక దురాచాలను ఎలా రూపుమాపారు, ఆ సంఘటనలను ఎలా ధీటుగా ఎదుర్కొన్నారో చక్కగా ప్రదర్శించారు. సమాజంలో వున్న రుగ్మతలను రూపుమాపిపందుకు దేశంలోనే మొట్టమొదటి సారిగా ప్రజలు సమక్షంలో మహాత్మా అనే బిరుదాంకితుడైన తీరును చక్కగా తెరకెక్కించారు. అవిద్యే సమాజానికి చీడ అని విద్యకోసం పాఠశాలలను ప్రారంభించి, వితంతువులకు వివాహాలు జరిపించిన తీరును విపులంగా చూపించారు. వెనకబాటు తనానికి, బ్రహ్మానాధిపత్యాన్ని ఎదురించిన తీరు అద్భుతం. వివాహ వ్యవస్థలో బ్రహ్మానాధిక్యాన్ని తగ్గించిన తీరును కోర్టు ద్వారా తీర్పును చక్కగా విపులంగా చూపించి రక్తికట్టించారు. అభివృద్ధి కి విద్యతో పాటు రిజర్వేషన్లు కలిచపించినపుడే ని మ్నజాతి అభివృద్ధి చెందుతుందని బ్రిటీష్ వారికి ఆకాలంతోనే వివరించి రిజర్వేషన్స్ కల్పించాలని అంబేద్కర్ కంటే ముందే వివరించిన తీరు పసందుగా ప్రదర్శించారు. నాటకం ఆద్యంతం జనరంజకంగా వుంది. సినిమాను తలపించింది. ప్రేక్షకులు, విద్యార్థులు కిమ్మనకుండా వీక్షించి తరించారు. సోమవారం మూడవరోజు చివరి రోజు బుద్ధునితో నా ప్రయాణం,బుద్ధుని బాటలో అంబేద్కర్ ప్రయానాన్ని ఆవిష్కరించే నాటకాన్ని ప్రదర్శిస్తారు.రచన దేవేంద్ర కాగా దర్శకత్వం వహించింది శివ ప్రసాద్. ఈ కార్యక్రమం లో శనగ వెంకటేశ్వర్లు, బట్టు ప్రాన్సిన్స్, దాసరి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడ్డ వాహనదారుల కుటుంబ సభ్యులకు కౌన్సెలింగ్

- మద్యం మత్తులో వాహనాలు నడిపితే ప్రమాదాలు జరుగుతాయి
- డ్రైవింగ్ లైసెన్స్ రిజిస్ట్రేషన్ ఇన్సూరెన్స్ పత్రాలు తప్పనిసరి
- వాహనదారులు ట్రాఫిక్ రూల్స్ తప్పనిసరిగా పాటించాలి
- ఇబ్రహీంపట్నం ఏసిపి కెపివి రాజు ట్రాఫిక్ సిఐ జితేందర్ రెడ్డి




**విశాల భారతి ఇబ్రహీంపట్నం :** ఇబ్రహీంపట్నం ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో పట్టుబడిన వాహనదారులు వారి కుటుంబ సభ్యులకు సోమవారం ఇబ్రహీంపట్నం డివిజన్ ఎసిపి కెవిపి రాజు, ట్రాఫిక్ సిఐ జితేందర్ రెడ్డి పాల్గొని డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో పట్టుబడిన వారికి వారి కుటుంబ సభ్యులకు కౌన్సెలింగ్ నిర్వహించారు.ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి వారు మాట్లాడుతూ మద్యం సేవించి వాహనం నడపడం వల్ల డ్రైవింగ్‌పై నియంత్రణ, ఏకాగ్రత నిర్ణయ సామర్థ్యం క్రమంగా తగ్గుతాయని అన్నారు. మద్యం మత్తులో వాహనాలు నడపడం వల్ల అనేక రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని, వాహనదారులతో పాటు ఇతర అమాయకుల ప్రాణాలు కూడా కోల్పోతున్నాయని తెలిపారు. వాహనం నడిపేటప్పుడు డ్రైవింగ్ లైసెన్స్, రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్, ఇన్సూరెన్స్ వంటి చెల్లుబాటు అయ్యే పత్రాలను తప్పనిసరిగా వెంట ఉంచుకోవాలని సూచించారు.అనుకోని ప్రమాదం జరిగినప్పుడు చెల్లుబాటు అయ్యే వాహన బీమా ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని వివరించారు.ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్, కారులో ప్రయాణించే వారు సీట్ బెల్ట్ ధరించాలని సూచించారు.వాహనాలను తప్పు మార్గంలో (రాంగ్ రూట్ లో ) నడపవద్దని,అతి వేగంగా వాహనాలు నడపవద్దని వేగ పరిమితులను పాటించాలని సూచించారు.ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటిస్తూ, బాధ్యతాయుతంగా సురక్షితంగా వాహనాలు నడపాలని సూచించారు.డ్రంక్ అండ్ డ్రైవ్‌కు దూరంగా ఉండి, తమ ప్రాణాలతో పాటు ఇతరుల ప్రాణాలను కూడా కాపాడాలని వాహనదారులకు సూచించారు.

## సంతతో నరకయాతన

- సోమవారం వచ్చిందంటే అడలెత్తుతున్న జనం
- పైసలు పంచాయతీకి.. ఇబ్బందులు జనానికి
- ప్రజల యాతనను పట్టించుకోని అధికారులు



**అశ్వాపురం, విశాల భారతి :** మండల కేంద్రంలో ప్రతి సోమవారం నిర్వహించే సంతతో వాహనదారులు నరకయాతన పడుతున్నారు. ఆర్ అండ్ బి ప్రధాన రహదారి దగ్గర నుండి పాత బస్టాండ్ సమీపంలోని అంబేద్కర్ విగ్రహం వరకు రోడ్డుకు ఇరువైపులా సంత నిర్వహణ సాగించడంతో అత్యవసర సమయాలలో ఈ మార్గం గుండా ప్రయాణం చేస్తున్న అంబులెన్స్లు, ద్విచక్ర వాహనదారుల పడుతున్న ఇబ్బందులు చెప్పనలివి కాకుండా ఉన్నాయి. సంత నిర్వహణ చేపట్టే పక్కనే పాత బస్టాండ్ కు సంబంధించి పెద్ద ఎత్తున ఖాళీ స్థలం ఉంది. ఇది పూర్తిగా నిరుపయోగంగానే ఉంటుంది. అశ్వాపురం మేజర్ గ్రామపంచాయతీకి చెందిన పాలకులతో పాటు అధికారులు సంబంధిత ఆర్టీసీ అధికారులతో సంప్రదింపులు జరిపి ఈ ప్రాంతంలో సంత నిర్వహణ చేపడితే ఎవ్వరికి ఇబ్బందులు తలెత్తకుండా ఉంటాయని పలువురు అంటున్నారు. పంచాయితీ కి ఆదాయ వనరులు సమకూర్చుకోవడం కోసం సంత నిర్వహణకు స్థలం లేకపోయినా వేలం పాటలు నిర్వహించి అనునిత్యం రద్దీగా ఉండే రోడ్డుపై అంగడి నిర్వహించడంతో ప్రజా అవసరాలకు తీవ్రమైన ఆటంకం కలుగుతుందని పలువురు అంటున్నారు. సంత వేలం ద్వారా పంచాయితీ పైసలు సమకూర్చుకొని ప్రజలకు మాత్రం రవాణాకు ఇక్కట్లు పెడుతుందని వాహనదారుడు వాబోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ ఉన్నతాధికారులు స్పందించి మండల కేంద్రంలో ప్రతి సోమవారం నిర్వహిస్తున్న సంతను రోడ్డు పై నిర్వహించకుండా ఈరొక ప్రాంతానికి తరలించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

## మారేళ్ల పాడు ఎత్తిపోతల పనులపై ఎమ్మెల్యే ప్రత్యేక దృష్టి

- ఈ నెలలోనే నాలుగు సార్లు సందర్శించిన వైనం
- సాగుకు నీళ్లు ఇచ్చేందుకు యుద్ధ ప్రాతిపదికన పనులు



**అశ్వాపురం, విశాల భారతి :** మండలంలోని బీజీ కొత్తూరు సమీపాన గల సీతారామ సాగర్ పంప్ హౌస్ కాలువ వద్ద మండల రైతాంగం కోసం ప్రత్యేకంగా నిర్మాణం చేపడుతున్న మారేళ్లపాడు ఎత్తిపోతల పథకం పనుల నిర్వహణపై పినపాక నియోజకవర్గం ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ప్రత్యేక దృష్టిని సారించారు. ఆగస్టు 15 నాటికి తుమ్మలచెరువుకి ప్రాజెక్టు ద్వారా నీళ్లు ఇస్తామని మంత్రి తుమ్మల నాగేశ్వర రావు రైతులకు హామీ ఇచ్చిన విషయం తెలిసిందే. అయితే కొన్ని పరిస్థితుల దృష్ట్యా అనుకున్న సమయానికి ప్రాజెక్టు పనులు పూర్తి కాకపోవడం, ఈ నెలాఖరిలోపైన కచ్చితంగా సాగుకు నీళ్లు ఇవ్వాలని మంత్రి ఆదేశించడంతో ఎమ్మెల్యే పాయం పలుమార్లు పనులు జరుగుతున్న తీరును పరిశీలించేందుకు అర్ధరాత్రులు కూడా ఆకస్మికంగా మారేళ్ల పాడులు తనిఖీ చేశారు. ఈ క్రమంలోనే సోమవారం మరో మారు మారెళ్ళపాడు ఎత్తిపోతల ప్రాజెక్ట్ ను సందర్శించిన ఆయన పనుల పురోగతిపై అధికారులతో తీవ్రంగా చర్చించారు. పనుల్లో ఎలాంటి జాప్యం లేకుండా యుద్ధ ప్రాతిపదికన వీలైనంత త్వరలో తుమ్మలచెరువుకు నీళ్లు ఇచ్చేలా కృషి చేయాలని కోరారు. మారేళ్లపాడు ఎత్తిపోతల పథకం పనులను ఈ నెలాఖరులోగా పూర్తి చేస్తే ఆయకట్టు రైతులకు వరి నాట్లు వేసుకునేందుకు సౌలభ్యంగా ఉంటుందని తెలిపారు. సీతారామ ప్రాజెక్ట్ ద్వారా రైతులకు సాగునీరు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే తెలిపారు.

## లారీ ఢీకొని యువకుడు మృతి.. మరొకరికి తీవ్ర గాయాలు



**రాజేంద్రనగర్, విశాల భారతి :** శంషాబాద్ మామిడిపల్లి నుంచి జడ్చర్లకు వెళ్తున్న ద్విచక్ర వాహనం ప్రమాదానికి గురై యువకుడు మృతి చెందిన విషాద ఘటన శంషాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. ఫిర్యాదుదారుడి అన్నయ్య కొందరు వెంకటేష్ (S/o లేట్ అర్జున్) తన స్నేహితుడి యమహా బైక్ (TS07M5472)పై డ్రైవింగ్ చేస్తుండగా, లిక్కి కార్తీక్ రెడ్డి వెనుక కూర్చుని ఉన్నాడు. ఇద్దరూ కలిసి మామిడిపల్లి నుంచి జడ్చర్ల వైపు వెళ్తుండగా, సాయంత్రం సుమారు 5:20 గంటల సమయంలో పాలమాకుల దాటిన తర్వాత సుమారు 200 మీటర్ల దూరంలో ముందు వెళ్తున్న వాహనాన్ని వెంకటేష్ ఓవర్‌టేక్ చేసే క్రమంలో బైక్ అదుపుతప్పి రోడ్డుపై పడిపోయింది. అదే సమయంలో వెనుక నుంచి వస్తున్న లారీ (AP16TJ1537) డ్రైవర్ అతివేగంగా, అజాగ్రత్తగా వాహనం నడుపుతూ వచ్చి రోడ్డుపై పడిపోయిన వెంకటేష్ తలపై నుంచి లారీ టైర్ ఎక్కడంతో తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. బైక్‌పై వెనుక కూర్చున్న కార్తీక్ రెడ్డికి కూడా తీవ్ర రక్తగాయాలు కావడంతో చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు. ప్రమాదం జరిగిన విషయం ఫిర్యాదుదారుడి స్నేహితుడు లిక్కి హేమంత్ రెడ్డి ఫోన్ ద్వారా సమాచారం ఇవ్వడంతో కుటుంబ సభ్యులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. రోడ్డుపైనే వెంకటేష్ మృతదేహం పడి ఉండటాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. ప్రమాదానికి కారణమైన లారీ డ్రైవర్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేయడంతో శంషాబాద్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ప్రమాదానికి గల పూర్తి కారణాలు, లారీ డ్రైవర్ నిర్లక్ష్యంపై పోలీసులు విచారణ కొనసాగిస్తున్నారు.

**ఇట్లు:**
వై. సురేందర్ రెడ్డి
ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్
శంషాబాద్ పోలీస్ స్టేషన్, ఎఫ్‌సీసీ

## కేపీహెచ్‌బీలో విషాదం

**డిప్రెషన్‌తో మహిళ బలవన్మరణం**



**సైబరాబాద్ విశాల భారతి:** కేపీహెచ్‌బీ పోలీస్‌స్టేషన్ పరిధిలో విషాదం చోటుచేసుకుంది. డిప్రెషన్‌తో బాధపడుతున్న ఓ మహిళ బలవన్మరణానికి పాల్పడింది. కేపీహెచ్‌బీ ఎస్సై శశిధర్ తెలిపిన వివరాల ప్రకారం.. కేరళలోని కన్నూరుకు చెందిన సోను పురుషోత్తమన్, శీతల్ (32) దంపతులకు ఆరేళ్ల క్రితం వివాహమైంది. వీరికి నాలుగేళ్ల కుమార్తె ఉంది. పురుషోత్తమన్ ఎస్‌బీఐలో డీఎంగా పనిచేస్తున్నారు. కేపీహెచ్‌బీ ఆరో ఫేజ్‌లోని పంచవటి అపార్ట్‌మెంట్‌లో భార్య, కుమార్తె, తల్లిదండ్రులతో కలిసి వారు నివసిస్తున్నారు. సోమవారం సాయంత్రం శీతల్ కొద్దిసేపు టెర్రస్‌కు వెళ్లే మెట్ల వద్ద కూర్చుంది. అనంతరం టెర్రస్‌పైకి వెళ్లి అపార్ట్‌మెంట్ ఆవరణలో పడిపోవడంతో అక్కడికక్కడే మృతిచెందింది.సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. శీతల్ కొంతకాలంగా డిప్రెషన్‌తో బాధపడుతూ మందులు వినియోగిస్తున్నట్లు భర్త, కేరళలో ఉన్న ఆమె సోదరుడు పోలీసులకు తెలిపారు. బలవన్మరణానికి గల కారణాలపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. కేరళలో ఉన్న ఆమె తల్లిదండ్రులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రి మార్చురీకి తరలించారు.

## నిర్మాణంలో ఉన్న భవనం నుంచి కిందపడి యువకుడు మృతి

**రాజేంద్రనగర్, విశాల భారతి :** నార్సింగి పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఆర్‌కే కన్స్ట్రక్షన్ సైట్‌లో సోమవారం ఉదయం విషాదకర ఘటన చోటుచేసుకుంది. నిర్మాణంలో ఉన్న భవనం మొదటి అంతస్తు నుంచి ప్రమాదవశాత్తు కిందపడటంతో జగ్గిశెట్టి సాయి తేజ (25) తీవ్రంగా గాయపడి మృతి చెందాడు. ఉదయం సుమారు 9:30 గంటల సమయంలో ఈ ప్రమాదం జరిగినట్లు పోలీసులు తెలిపారు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన సాయి తేజను హుటాహుటిన ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లోని మెడికవర్ ఆసుపత్రికి తరలించారు. అయితే వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించి 'బ్రాట్ డెడ్'గా ప్రకటించారు. మృతుడు జగ్గిశెట్టి సత్యం కుమారుడిగా పోలీసులు గుర్తించారు. సమాచారం అందుకున్న నార్సింగి పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు. ప్రమాదం జరిగిన తీరుపై ఆరా తీస్తూ నిర్మాణ ప్రదేశంలో భద్రతా చర్యలపై కూడా విచారణ చేపట్టారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు నార్సింగి పోలీసులు వెల్లడించారు.

# నర్సింగిలో అక్రమ నిర్మాణాలపై ఉక్కుపాదం..
# భవనాలు సీజ్.. ఆక్రమణలు తొలగింపు!






**అనుమతులు లేకుండా కడితే అంతే..**
**అక్రమ నిర్మాణాలపై టౌన్ ప్లానింగ్ కొరడా!**

**రాజేంద్రనగర్, విశాల భారతి :**

అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపట్టడం, అనుమతులకు విరుద్ధంగా అదనపు అంతస్తులు నిర్మించడం, ప్రభుత్వ, పార్కు స్థలాలను ఆక్రమించడం వంటి చర్యలపై నర్సింగి సర్కిల్-45 టౌన్ ప్లానింగ్ అధికారులు కఠిన చర్యలు చేపట్టారు. సోమవారం సర్కిల్ పరిధిలోని పలు ప్రాంతాల్లో విస్తృతంగా తనిఖీలు నిర్వహించి అనధికార నిర్మాణాలను గుర్తించి తొలగించడంతో పాటు కొన్ని భవనాలను సీజ్ చేశారు. నెక్నాంపూర్‌లోని కృష్ణారెడ్డి ఎన్‌క్లేవ్‌లో అనుమతులకు విరుద్ధంగా అదనపు అంతస్తుల నిర్మాణం చేపడుతున్న భవనంపై అధికారులు చర్యలు తీసుకున్నారు. భవనం 5వ అంతస్తుకు ఏర్పాటు చేసిన సెంటరింగ్‌ను టౌన్ ప్లానింగ్ సిబ్బంది తొలగించారు. అనంతరం నిర్మాణ నిబంధనలను ఉల్లంఘించిన భవనాన్ని నిబంధనల ప్రకారం సీజ్ చేశారు. అనుమతులు లేకుండా అదనపు అంతస్తులు నిర్మిస్తే కఠిన చర్యలు తప్పవని అధికారులు స్పష్టం చేశారు. అదేవిధంగా నెక్నాంపూర్ గ్రామం సర్వే నంబర్ 31లోని సెక్రటేరియట్ వైఎస్సార్ కాలనీలో పార్కు స్థలంలో జరిగిన అనధికార ఆక్రమణలపై కూడా అధికారులు చర్యలు చేపట్టారు. పార్కు స్థలాన్ని ఆక్రమించి ఏర్పాటు చేసిన అనధికార నిర్మాణాలను తొలగించారు. ప్రజల వినియోగానికి ఉద్దేశించిన పార్కులు, ప్రభుత్వ స్థలాలను ఆక్రమిస్తే ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని అధికారులు హెచ్చరించారు. నర్సింగి 60 యార్డ్స్ కాలనీ పరిధిలోని గిరిగిరిగడ్డ ప్రాంతంలో అనుమతులు లేకుండా నిర్మించిన గ్రౌండ్ ప్లస్ వన్ అప్పర్ ఫ్లోర్ భవనాన్ని కూడా టౌన్ ప్లానింగ్ సిబ్బంది గుర్తించి సీజ్ చేశారు. భవన నిర్మాణానికి అవసరమైన అనుమతులు తీసుకోకుండా నిర్మాణాలు చేపట్టడం నిబంధనలకు విరుద్ధమని అధికారులు పేర్కొన్నారు. సర్కిల్ పరిధిలో అనధికార నిర్మాణాలు, అక్రమ ఆక్రమణలపై నిరంతరం నిఘా కొనసాగుతుందని నర్సింగి సర్కిల్-45 డిప్యూటీ కమిషనర్ తెలిపారు. భవన నిర్మాణానికి ముందు సంబంధిత అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వ, పార్కు, ప్రజా ప్రయోజనాలకు సంబంధించిన స్థలాలను ఆక్రమించే వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. నిబంధనలను ఉల్లంఘిస్తూ నిర్మాణాలు చేపట్టే వారిపై భవిష్యత్తులోనూ తనిఖీలు ముమ్మరం చేసి అవసరమైన చర్యలు కొనసాగిస్తామని అధికారులు వెల్లడించారు.

## ఫీజుల బకాయిలపై బీజేపీ పోరుబాట

**రీయింబర్స్‌మెంట్ నిధులు వెంటనే విడుదల చేయాలని డిమాండ్**



**విశాల భారతి, అబ్దుల్లాపూర్‌మెట్ :** తెలంగాణలో విద్యార్థులకు సంబంధించిన ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు చేపట్టిన రెండు రోజుల నిరాహార దీక్షకు మద్దతుగా మన్సూరాబాద్ డివిజన్ మాజీ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి పాల్గొన్నారు. నాంపల్లిలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయం వద్ద నిర్వహిస్తున్న నిరాహార దీక్షలో రాంచందర్ రావుతో కలిసి కొప్పుల నర్సింహారెడ్డి పాల్గొని సంఘీభావం తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం సుమారు రూ.15 వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయకుండా విద్యార్థులను ఇబ్బందులకు గురిచేస్తోందని బీజేపీ నాయకులు ఆరోపించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధుల కోసం విద్యార్థులు, వారి కుటుంబాలు ఎదురుచూస్తున్న నేపథ్యంలో ప్రభుత్వం వెంటనే స్పందించి బకాయిలను విడుదల చేయాలని కొప్పుల నర్సింహారెడ్డి డిమాండ్ చేశారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ఫీజు రీయింబర్స్‌మెంట్ సమస్యకు తక్షణ పరిష్కారం చూపాలని కోరారు. విద్యార్థుల హక్కుల కోసం బీజేపీ చేస్తున్న పోరాటానికి తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని ఆయన తెలిపారు. ప్రభుత్వం బకాయిలను విడుదల చేసే వరకు విద్యార్థుల తరపున పోరాటాన్ని కొనసాగిస్తామని బీజేపీ నాయకులు స్పష్టం చేశారు.

## ప్రజలు అందించే వినతులను సంబంధిత శాఖల జిల్లా అధికారులు తక్షణమే పరిష్కరించాలి

**ప్రజావాణికి(53)ఫిర్యాదులు.. జిల్లా అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) కిరణ్మయి**



**విశాల భారతి ఇబ్రహీంపట్నం:** ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు అందించే వినతులను సంబంధిత శాఖల జిల్లా అధికారులు తక్షణమే పరిష్కరించాలని జిల్లా అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) కిరణ్మయి అన్నారు. ఈ మేరకు సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి (53) ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదు దారుల నుండి సమస్యలను జిల్లా అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) కిరణ్మయి, అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి తో కలిసి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ కిరణ్మయి మాట్లాడుతూ ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు అందించే వినతులను సంబంధిత శాఖల జిల్లా అధికారులు తక్షణమే పరిష్కరించాలని ఆదేశించారు. అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. రెవెన్యూ శాఖ-26, ఇతర శాఖలు -27, మొత్తం 53 దరఖస్తులు అందాయి. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి శారదా దేవి వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## మిలాద్ ఉన్ నబీని ప్రశాంతంగా జరుపుకోవాలి

**ఇబ్రహీంపట్నం సీఐ మహేందర్ రెడ్డి**




**విశాల భారతి ఇబ్రహీంపట్నం:** ఫ్యూచర్ సిటీ కమిషనరేట్ ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ పరిధిలోని మసీదు కమిటీ నిర్వాహకులు, ప్రతినిధులతో సీఐ మహేందర్ రెడ్డి ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముస్లిం సోదరుల పవిత్ర పండుగ మిలాద్ ఉన్ నబీ (లేదా ఈద్-ఎ మిలాద్)ని అత్యంత ప్రశాంతమైన వాతావరణంలో, శాంతిభద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా జరుపుకోవాలని సీఐ మహేందర్ రెడ్డి పిలుపునిచ్చారు. మిలాద్ ఉన్ నబీ పండుగను పురస్కరించుకుని ఫ్యూచర్ సిటీ కమిషనరేట్ ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ పరిధిలో మసీదు కమిటీ నిర్వాహకులు, ప్రతినిధులతో సీఐ ప్రత్యేక సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. పండుగ ఏర్పాట్లు, ఊరేగింపుల (జూలూస్) నిర్వహణపై కమిటీ సభ్యులతో చర్చించి, వారికి పలు కీలక సూచనలు ఇచ్చారు . పండుగ వేడుకలు, ప్రార్థనలు నిర్వహించే సమయంలో ఎక్కడా ఎలాంటి ఘర్షణలకు తావులేకుండా కమిటీ సభ్యులు స్వచ్ఛందంగా పర్యవేక్షించాలన్నారు. స్థానిక పోలీసుల ముందస్తు అనుమతితోనే ఊరేగింపులు నిర్వహించాలని, నిర్దేశించిన మార్గాల్లోనే జూలూస్ సాగాలని స్పష్టం చేశారు. మైకులు, సౌండ్ సిస్టమ్స్ వాడేటప్పుడు కోర్టు నిబంధనల ప్రకారం శబ్ద కాలుష్యం లేకుండా నిర్ణీత డెసిబెల్స్ మాత్రమే వాడాలని, ఇతరులకు ఇబ్బంది కలిగించవద్దని సూచించారు. సోషల్ మీడియాలో వచ్చే ఎలాంటి తప్పుడు ప్రచారాలను, వదంతులను నమ్మవద్దని, ఏదైనా సమస్యాత్మక విషయం దృష్టికి వస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. పండుగను అందరూ భక్తిశ్రద్ధలతో, సోదరభావంతో జరుపుకోవాలని, పోలీసు శాఖకు పూర్తి స్థాయిలో సహకరించాలని సీఐ మహేందర్ రెడ్డి ఈ సమావేశంలో విజ్ఞప్తి చేశారు. మసీదు కమిటీల సభ్యులు కూడా పోలీసుల సూచనలను పాటిస్తూ పండుగను ప్రశాంతంగా ముగిస్తామని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో వివిధ మసీదు కమిటీల ప్రతినిధులు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో బోనాల వేడుకలు

**అమ్మవారి పలహారం బండి ఊరేగింపుల్లో పాల్గొన్న కళ్లెం నవజీవన్ రెడ్డి**





**విశాల భారతి, అబ్దుల్లాపూర్‌మెట్ :** బోనాల పండుగను పురస్కరించుకుని ఎల్‌బీనగర్ నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో నిర్వహించిన అమ్మవారి పలహారం బండి ఊరేగింపు కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో ఘనంగా జరిగాయి. హయత్‌నగర్ మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి ఆయా కార్యక్రమాల్లో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులతో కలిసి బోనాల వేడుకల్లో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందారు. కొత్తపేట్‌లో నిర్వహించిన పలహారం బండి ఊరేగింపులో రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి యశ్‌పాల్ గౌడ్‌తో కలిసి పాల్గొన్న కళ్లెం నవజీవన్ రెడ్డి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. హస్తినాపురంలో రంగారెడ్డి జిల్లా కార్యదర్శి నరేష్ యాదవ్‌తో కలిసి వేడుకల్లో పాల్గొన్నారు. అదే విధంగా వనస్థలిపురంలో రాష్ట్ర బీజేవైఎం కార్యవర్గ సభ్యుడు భార్గవ్‌తో కలిసి అమ్మవారి పలహారం బండి ఊరేగింపులో పాల్గొని భక్తులతో మమేకమయ్యారు. నాగోల్‌లో నిర్వహించిన బోనాల వేడుకల్లోనూ పాల్గొని అమ్మవారికి పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా కళ్లెం నవజీవన్ రెడ్డి మాట్లాడుతూ.. బోనాల పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుందని అన్నారు. అమ్మవారి కృపతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. భక్తిశ్రద్ధలతో పండుగను నిర్వహిస్తున్న ప్రజలకు బోనాల శుభాకాంక్షలు తెలిపారు. ఆయా ప్రాంతాల్లో నిర్వహించిన పలహారం బండి ఊరేగింపుల్లో భక్తులు, మహిళలు, యువత, స్థానిక నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని పండుగ వాతావరణాన్ని మరింత సందడిగా మార్చారు.

## దారిద్ర్యపు నీడలో మేడి సరిత

- నిలువ నీడ లేక డబల్ బెడ్ రూమ్ కై ఎదురుచూపు
- నిరంతరం బతుకు పోరాటం వెతుకు కోసం ఆరాటం
- జానెడు పొట్ట కోసం ఇళ్లల్లో పాసి పనులు
- డొక్కలిండిన మట్టి బతుకుల దీన గాథ
- అధికారులు స్పందించి ఆదుకోవాలని ప్రార్థన



**భద్రాచలం :విశాల భారతి;**

భద్రాచలం పట్టణంలో శివారు ప్రాంతమైన రాజుపేట కాలనీలో నివాసముంటున్న ఓ నిరుపేద మహిళ కన్నీటి గాథ మేడి సరిత నేడు ఆమె జీవితం దరిద్రం అంచులో కొట్టుమిట్టాడుతున్న నేపథ్యం కనిపిస్తుంది. తిండి కోసం పాచి పనులు చేస్తూ బ్రతుకు బండిని భారంగా ముందుకు లాక్కుపోతున్న వైనం కనిపిస్తుంది. భార్యాభర్తలిద్దరూ రెక్కలు ముక్కలు చేసుకుని ఎంత పని చేసినా తినేందుకు సరిపోయే పరిస్థితి లేదు ఇంటి అద్దె పెనుబారంగా మారిన భయానక పరిస్థితులు వారి గుండెల్లో నిత్యం కనిపిస్తుంటాయి. అయినా బ్రతుకు పడవను ముందుకు నడిపించాల్సిన పరిస్థితి ఉంది. ఎంత కూలిచేసిన దిన సరుకులకే సరిపోవటం వారి జీవన పోరాటం ప్రశ్నార్ధకంగా మారింది. చినిగిన బట్టలు చింపిరి జుట్టు అభివృద్ధికి ఆమడ దూరంలో వారి జీవితాలు తారసపడుతున్నాయి. ఉండేందుకు నిలువ నీడ లేదు అద్దె ఇంట్లో ఉంటూ అతి కష్టం మీద జీవనం సాగిస్తున్నారు. ఆడంబరం లేని జీవితం దిన దిన గండంగా పొట్ట పోసుకుంటూ దారిద్రపు దిగువున ఉన్న జీవితం కనిపిస్తుంది. ప్రభుత్వం ఏర్పాటు చేసిన డబల్ బెడ్ రూమ్ ఇల్లు ఇస్తే వారి జీవితంలో ఎంతో కొంత అద్దెలు కట్టే భారం తగ్గుతుందని వారి ఆవేదన వ్యక్తపరుస్తున్నారు. కూలి లేని నాడు పస్తులున్న పరిస్థితులు ఉన్నాయని వారి కంట ఘోష ఎవరికైనా కన్నీరు పెట్టిస్తుంది. నేటి అధునాతన జీవితంలో అన్నగారిన జీవితాలు ఎన్నో మరెన్నో అడుగున పడి ప్రభుత్వ సహకారం కోసం ఎదురుచూస్తున్నాయి అందులో మేడి సరిత జీవితం ఒకటి ఇటువంటి కుటుంబాన్ని ప్రభుత్వం డబల్ బెడ్ రూమ్ ఇల్లు ఇచ్చి ఆదుకోవాలని వారి పేదరికం ప్రభుత్వం మెరుగుపరచాలని కారు ప్రభుత్వాధికారులను సవినయంగా వేడుకుంటున్నారు.

## రమేష్ నాయక్‌కు ప్రాణహాని ఉందంటూ ఆరోపణలు

**విశాల భారతి, అబ్దుల్లాపూర్‌మెట్ :**



తనపై కుట్రపూరితంగా తప్పుడు ఆరోపణలు చేస్తూ రాజకీయంగా, సామాజికంగా వేధిస్తున్నారని సాహెబ్‌నగర్ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు కేతావత్ రమేష్ నాయక్ ఆరోపించారు. యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు జక్కిడి శివచరణ్ రెడ్డి, ఆయన తండ్రి ప్రభాకర్ రెడ్డిలే తనను లక్ష్యంగా చేసుకుని ఆరోపణలు చేయిస్తున్నారని ఆయన విమర్శించారు. తనపై స్పా కేంద్రంలో అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తున్నారంటూ ఆరోపణలు చేయించడం తీవ్ర అవమానకరమని రమేష్ నాయక్ అన్నారు. తాను ఎస్టీ, లంబాడ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తిననే కారణంతోనే తనపై కక్షపూరితంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. తనపై గతంలో నమోదైన కేసును ఆధారాలు లేవన్న కారణంతో న్యాయస్థానం కొట్టివేసిందని, అయినప్పటికీ ఆ కేసును మళ్లీ ప్రస్తావిస్తూ తన ప్రతిష్టను దెబ్బతీసే ప్రయత్నం చేస్తున్నారని పేర్కొన్నారు. తాను గత 16 సంవత్సరాలుగా కాంగ్రెస్ పార్టీలో సామాన్య కార్యకర్తగా పనిచేస్తున్నానని రమేష్ నాయక్ తెలిపారు. పార్టీ కార్యక్రమాలతో పాటు ఎన్నికల సమయంలో కాంగ్రెస్ అభ్యర్థుల విజయానికి ప్రచారంలో చురుగ్గా పాల్గొన్నానని చెప్పారు. పార్టీ అధిష్ఠానం తనకు సాహెబ్‌నగర్ డివిజన్ అధ్యక్షుడిగా బాధ్యతలు అప్పగించిందని, ఆ పదవి దక్కడం కొందరికి ఇష్టం లేకనే తనపై ఆరోపణలు చేస్తున్నారని అన్నారు. తనపై చేసిన ఆరోపణలకు ఆధారాలు ఉంటే బహిరంగంగా వెల్లడించాలని జక్కిడి శివచరణ్ రెడ్డి, ప్రభాకర్ రెడ్డిలను రమేష్ నాయక్ డిమాండ్ చేశారు. తన కుటుంబం, తనపై సామాజికంగా తీవ్ర ప్రభావం పడేలా ఆరోపణలు చేయడం వల్ల బయట తిరగలేని పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. తనకు, తన కుటుంబానికి భద్రత కల్పించాలని కోరారు. తనపై ఆరోపణలు చేసిన విద్యా రెడ్డిపై వనస్థలిపురం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు రమేష్ నాయక్ తెలిపారు. తన ఫిర్యాదుపై పోలీసులు చట్టప్రకారం విచారణ జరిపి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. అవసరమైతే యూత్ కాంగ్రెస్ జాతీయ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టి తనకు న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తానని ప్రకటించారు. తనకు పార్టీ పదవి కేటాయించడంపై కొందరు అసంతృప్తితో వ్యవహరిస్తున్నారని, కాంగ్రెస్ పార్టీలో బీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాలకు సముచిత ప్రాధాన్యం కల్పించాల్సిన అవసరం ఉందని రమేష్ నాయక్ అన్నారు. తనపై జరుగుతున్న పరిణామాలపై పార్టీ రాష్ట్ర నాయకత్వం స్పందించి వాస్తవాలను పరిశీలించి న్యాయం చేయాలని కోరారు.

## నిర్మాణ సామగ్రి చోరీ ముఠా గుట్టురట్టు

**ఐదుగురు అరెస్టు.. రూ.లక్ష నగదు, రెండు వాహనాలు స్వాధీనం**

**సైబరాబాద్ - విశాల భారతి**

నల్లగండ్లలో నిర్మాణ సామగ్రి చోరీకి పాల్పడుతున్న ముఠాను చందానగర్ పోలీసులు అరెస్టు చేశారు. ఐదుగురు నిందితులను అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.లక్ష నగదు, చోరీకి ఉపయోగించిన ట్రాలీ ఆటో, బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. మరో నలుగురు నిందితులు పరారీలో ఉన్నారని ఆర్‌సీ పురం డివిజన్ ఏసీపీ వై. శ్రీనివాస్ కుమార్ తెలిపారు. నల్లగండ్లలోని వెర్టెక్స్ వేగా డెవలపర్స్‌కు చెందిన నిర్మాణ సామగ్రి నిల్వ ప్రాంతంలో ఈ నెల 19, 20 తేదీల మధ్య అర్ధరాత్రి చోరీ జరిగింది. అర్ధరాత్రి 12 గంటల నుంచి ఒంటిగంటన్నర మధ్య దుండగులు షీట్ మెటల్ కాంపౌండ్ వాల్‌ను ధ్వంసం చేసి లోపలికి ప్రవేశించారు. అక్కడ నిల్వ ఉంచిన మివాన్ అల్యూమినియం బోర్డులు, బారికేడింగ్ షీట్లను ఎత్తుకెళ్లారు. సంస్థ ప్రతినిధుల ఫిర్యాదుతో చందానగర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. సాంకేతిక ఆధారాలతో దర్యాప్తు చేపట్టిన పోలీసులు ఈ నెల 24న ఐదుగురు నిందితులను అరెస్టు చేశారు. కొండాపూర్ మసీద్‌బండ వడ్డెరబస్తీకి చెందిన ఆనంద్ (21), అనిల్ (26), బాలాజీ (19), రాఘవేంద్రకాలనీకి చెందిన సుభాష్ (23), న్యూహఫీజ్‌పేట ప్రేమ్‌నగర్‌కు చెందిన యోగేష్ దండగులె (20)ను అదుపులోకి తీసుకున్నారు. వీరిలో ఆనంద్ ట్రాక్టర్ డ్రైవర్‌గా, అనిల్, బాలాజీ ఆటో డ్రైవర్లుగా, సుభాష్ డ్రైవర్‌గా, యోగేష్ కూలీగా పనిచేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. విచారణలో నిందితులు మరో మూడు చోరీ కేసుల్లోనూ తమ ప్రమేయాన్ని వెల్లడించినట్లు ఏసీపీ వై. శ్రీనివాస్ కుమార్ తెలిపారు.

## నిఘా నీడలో నాగోల్

**'నేను సైతం 2.0'లో భాగంగా 74 సీసీ కెమెరాల ఏర్పాటు**



**విశాల భారతి, అబ్దుల్లాపూర్‌మెట్ :** ప్రజల భద్రత, నేరాల నియంత్రణే లక్ష్యంగా 'నేను సైతం 2.0' కార్యక్రమం ద్వారా నాగోల్ పోలీస్ స్టేషన్ పరిధిలో మరో 74 సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేశారు. మల్కాజిగిరి పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో చేపట్టిన ఈ కార్యక్రమంలో ఎల్‌బీనగర్ ట్రాఫిక్ డీసీపీ బి. శ్రీనివాసులు, నాగోల్ పోలీస్ ఇన్‌స్పెక్టర్ మహమ్మద్ మక్బూల్ జానీ బుధవారం కెమెరాలను ప్రారంభించారు.కృషినగర్‌లోని పల్లవి డీబీఆర్ అపార్ట్‌మెంట్స్‌లో 30 కెమెరాలు, రాఘవేంద్రనగర్ కాలనీ, తట్టిఅన్నారం డబుల్ బెడ్‌రూమ్, అన్నవరపు సత్యనారాయణ కాలనీల్లో మరో 44 కెమెరాలను ఏర్పాటు చేశారు. దీంతో ఆయా ప్రాంతాల్లో పోలీసుల నిఘా వ్యవస్థ మరింత బలోపేతం కానుంది. ఈ సందర్భంగా డీసీపీ బి. శ్రీనివాసులు మాట్లాడుతూ.. ప్రజల భాగస్వామ్యంతో ఏర్పాటు చేస్తున్న సీసీటీవీ కెమెరాలు నేరాల నియంత్రణతో పాటు నిందితులను త్వరగా గుర్తించేందుకు, ప్రజలకు మెరుగైన భద్రత కల్పించేందుకు ఎంతగానో ఉపయోగపడుతున్నాయని తెలిపారు. మల్కాజిగిరి పోలీస్ కమిషనరేట్ పరిధిలో 'నేను సైతం 2.0' కార్యక్రమం ద్వారా ఇప్పటివరకు 2,58,457 సీ సీటీవీ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ఎల్‌బీనగర్ జోన్ పరిధిలో 81,183 కెమెరాలు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. సీసీటీవీ కెమెరాల ఏర్పాటులో ప్రజలు చూపిస్తున్న సహకారం అభినందనీయమని డీసీపీ అన్నారు. ప్రజల భాగస్వామ్యంతో నేరాలను మరింత సమర్థవంతంగా నియంత్రించడంతో పాటు శాంతిభద్రతలను పటిష్ఠంగా నిర్వహించేందుకు అవకాశం ఏర్పడుతుందని తెలిపారు. ప్రజలు సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎల్‌బీనగర్ ట్రాఫిక్ ఏసీపీ బి. నవీన్‌రెడ్డి, ఎస్ఐలు పి. శివనాగ ప్రసాద్, ఉమ, కాలనీ ప్రతినిధులు, అపార్ట్‌మెంట్ వాసులు డాక్టర్ విష్ణు, శ్రీనివాస్, వెంకట్‌రెడ్డి, శ్రీరాములు, అంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## శంషాబాద్‌లో లారీ క్లీనర్ అదృశ్యం



**రాజేంద్రనగర్, విశాల భారతి:** శంషాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో లారీ క్లీనర్ అదృశ్యమైన ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కేరళకు చెందిన 40 ఏళ్ల వైజేష్ అనే వ్యక్తి కనిపించకుండా పోయినట్లు అతనితో కలిసి పని చేస్తున్న లారీ డ్రైవర్ అభినేష్ మారపురకల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదుదారు అభినేష్ మైసూరులోని సుందరం ట్రాన్స్‌పోర్ట్స్‌లో లారీ డ్రైవర్‌గా పని చేస్తుండగా, వైజేష్ అతని లారీకి క్లీనర్‌గా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో మైసూరు నుంచి KL58Q6566 నంబరు గల లారీలో అల్లం లోడుతో హైదరాబాద్‌కు వచ్చారు. ఆ లోడును హైదరాబాద్‌లో దించిన అనంతరం ఈ నెల 21వ తేదీ తెల్లవారుజామున సుమారు 4.30 గంటలకు ఘన్‌సిమియాగూడలోని కేరళ తమిళనాడు రోడ్ క్యారియర్స్ ట్రాన్స్‌పోర్ట్ కార్యాలయానికి వెళ్తుండగా ఘన్‌సిమియాగూడ సిగ్నల్ వద్దకు చేరుకున్నారు. అక్కడ వైజేష్ తనకు ఆకలిగా ఉందని, సిగ్నల్ సమీపంలోని ఓ హోటల్‌కు వెళ్లి భోజనం చేసి వస్తానని చెప్పి లారీ నుంచి వెళ్లాడు. ఎంత సమయం గడిచినా తిరిగి రాకపోవడంతో అభినేష్ అతని కోసం వెతికాడు. వైజేష్ మొబైల్‌కు ఫోన్ చేయగా స్విచ్ ఆఫ్ రావడంతో ఆందోళనకు గురయ్యాడు. అనంతరం అతని కుటుంబ సభ్యులు, స్నేహితులు, పరిచయస్తులను ఫోన్ ద్వారా సంప్రదించడంతో పాటు పరిసర ప్రాంతాల్లో గాలించినప్పటికీ ఎలాంటి ఆచూకీ లభించలేదు. వైజేష్ తన స్వగ్రామమైన కేరళకు వెళ్లి ఉండవచ్చని ఫిర్యాదుదారు అనుమానం వ్యక్తం చేశారు. తప్పిపోయిన వ్యక్తి ఎత్తు సుమారు 5.5 అడుగులు, తెల్లటి ఛాయ, గుండ్రటి ముఖం కలిగి ఉంటాడని, మలయాళం మాట్లాడుతాడని తెలిపారు. అదృశ్యమైన సమయంలో తెల్లటి చొక్కా, నల్లటి లుంగీ ధరించి ఉన్నట్లు పోలీసులకు వివరించారు. ఎంత వెతికినా ఆచూకీ లభించకపోవడంతో అభినేష్ సోమవారం శంషాబాద్ పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి వైజేష్ ఆచూకీ కోసం దర్యాప్తు చేపట్టారు. అతని మొబైల్ ఫోన్ వివరాలు, పరిసర ప్రాంతాల్లోని సీసీ కెమెరా దృశ్యాలను పరిశీలిస్తూ అదృశ్యమైన వ్యక్తి కోసం గాలింపు చర్యలు కొనసాగిస్తున్నారు.

ఇట్లు
వై. సురేందర్ రెడ్డి
ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్
పి.ఎస్. శంషాబాద్, ఫ్యూచర్ సిటీ

## నార్సింగిలో ట్రాఫిక్ కష్టాలకు చెక్ పెట్టేలా చర్యలు
## కాళీమందిర్–సన్‌సిటీ మార్గంలో యూటర్న్లపై దృష్టి

**భక్తులు, వాకర్స్ భద్రతకు ప్రత్యేక ఏర్పాట్లు**



**రాజేంద్రనగర్, విశాల భారతి :** నార్సింగి ట్రాఫిక్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఆంజనేయులు, సబ్ఇన్‌స్పెక్టర్ శంకర్‌లతో కొనసాగుతున్న సెంట్రల్ మీడియన్ పనులపై నిర్మాణాత్మక చర్చ జరిగింది. కాళీమందిర్ నుంచి సన్‌సిటీ వరకు అవసరమైన ప్రాంతాల్లో యూటర్న్‌లు ఏర్పాటు చేయడం, వాహనదారులకు ఇబ్బందులు కలగకుండా తగినంత గ్యాప్‌లు ఉండేలా చర్యలు తీసుకోవడం వంటి అంశాలపై ప్రధానంగా చర్చించారు. ముఖ్యంగా దేవాలయాల సమీపంలో భక్తులు, వాకర్స్ సురక్షితంగా రాకపోకలు సాగించేలా తగిన ఏర్పాట్లు చేయాలని సూచించారు. అలాగే పాదచారుల కోసం క్రాసింగ్ మార్కింగ్‌లు ఏర్పాటు చేయడంతో పాటు, పుష్‌బటన్ సదుపాయంతో కూడిన పెలికాన్ సిగ్నల్స్ ఏర్పాటు చేయాల్సిన అవసరంపై కూడా చర్చించారు. ట్రాఫిక్ రద్దీని తగ్గిస్తూ పాదచారుల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులను కోరారు. ఈ సమావేశంలో ఏసీఫ్ జనరల్ సెక్రటరీ నరేందర్ బాబు, ఎగ్జిక్యూటివ్ సభ్యులు విజయ్ పద్మనాభన్, హేమ శేఖర్, సాయి రెడ్డి, మున్సిపల్ వర్క్ ఇన్‌స్పెక్టర్ కిరణ్ తేజ్, సంబంధిత కాంట్రాక్టర్ పాల్గొన్నారు.





# జీవన బంధం...చెట్లతోనే మన అనుబంధం



- మొక్కలు పెంచుదాం పర్యావరణాన్ని పరిరక్షిద్దాం
- ప్రతి ఒక్కరూ తమ జన్మదినం రోజున రెండు ముక్కలు నాటాలి
- కాలనీలన్నీ పచ్చదనంతో విరాజిల్లాలి..
- చామ విజయ శేఖర్ రెడ్డి కాంగ్రెస్ సీనియర్ నాయకులు

**విశాల భారతి-అబ్దుల్లాపూర్ మెట్ :**

కుంట్లూరు ఆది తిరుమల నగర్ కాలనీలో సోమవారం వన మహోత్సవ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి కాలనీవాసులందరూ మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన కాంగ్రెస్ సీనియర్ నాయకులు చాలా విజయ శేఖర్ రెడ్డి అదేవిధంగా మున్సిపల్ మేనేజర్ శ్రీనివాస్ కాలనీ అధ్యక్షులు మరియు కాలనీ కమిటీ సభ్యులు అందరూ కలిసి మొక్కలు నాటారు.. ఈ సందర్భంగా కాంగ్రెస్ సీనియర్ నాయకులు చామ విజయ శేఖర్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరు మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని అదేవిధంగా కాలనీలోని ప్రతి ఒక్క కుటుంబ సభ్యుడు తమ జన్మదిన పురస్కరించుకొని రెండు మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. అదేవిధంగా కాలనీలో మొక్కలు నాటిన అనంతరం వాటి సంరక్షణ బాధ్యత కూడా కాలనీ కమిటీ సభ్యులు అదేవిధంగా మున్సిపల్ సిబ్బంది తీసుకోవాలని దానిపై ప్రత్యేక శ్రద్ధ వహించి వాటిని కాపాడాలని తెలియజేశారు.. మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ మేనేజర్ శ్రీనివాస్ మాట్లాడుతూ మొక్కలను సంరక్షించే బాధ్యత కాలనీవాసులతో పాటు మేము కూడా మున్సిపల్ సిబ్బంది గా ఈ బాధ్యత తీసుకుంటామని తెలుపుతూ అందరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని అన్నారు.. ఈ కార్యక్రమంలో ఆది తిరుమల నగర్ కాలనీ అధ్యక్షులు మాదారపు అశోక్,ఉపాధ్యక్షులు దోమకొండ శ్రీనివాస్,కార్యదర్శి వీరవల్లి శ్రీనివాస్,జనరల్ సెక్రెటరీ లింగస్వామి మరియు కాలనీ సభ్యులు దుర్గాప్రసాద్,ప్రభాకర్,అన్వర్,శంకర్,బాలసుబ్రమణ్యం, సోమయ్య,రవి,మనసాని కాలనీ అధ్యక్షులు రెడ్డి వీర్రాజు, మరియు మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు..

## లెక్చరర్స్ కాలనీ నూతన కమిటీకి అభినందనలు

**కాలనీ అభివృద్ధి, సంక్షేమానికి సమర్ధవంతంగా పనిచేయాలి : గుర్రం శ్రీనివాస్ రెడ్డి**



**విశాల భారతి, అబ్దుల్లాపూర్‌మెట్ :** ఎల్‌బీ నగర్ నియోజకవర్గంలోని ఏబ్లాక్ లెక్చరర్స్ కాలనీ నూతన కమిటీ ఏర్పాటు కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఏబ్లాక్ అధ్యక్షులు గుర్రం శ్రీనివాస్ రెడ్డి హాజరై నూతన కాలనీ కమిటీ సభ్యులను హృదయపూర్వకంగా అభినందించి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా గుర్రం శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. నూతనంగా ఏర్పడిన కమిటీ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. కాలనీ అభివృద్ధి, ప్రజల సంక్షేమం, మౌలిక వసతుల మెరుగుదలతో పాటు స్థానిక ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కమిటీ సమష్టిగా కృషి చేయాలని సూచించారు. కాలనీ ప్రజల అవసరాలను గుర్తించి సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని ఆకాంక్షించారు. నూతన కమిటీ ఐక్యతతో, సమన్వయంతో పనిచేస్తూ కాలనీ అభివృద్ధిలో కీలక పాత్ర పోషించాలని అన్నారు. నూతన కమిటీ సభ్యులు తమపై ఉంచిన బాధ్యతలను సమర్ధవంతంగా నిర్వర్తిస్తూ కాలనీ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలనీ వాసులు , కమిటీ సభ్యులు, స్థానికులు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా నైషదం పద్మావతి వర్ధంతి

**పేదలకు చీరల పంపిణీ**



**ముషీరాబాద్ విశాల భారతి:** ప్రముఖ సంఘ సేవకురాలు నైషదం పద్మావతి 23వ వర్ధంతి వేడుకలను సోమవారం బాగ్ లింగంపల్లి లో సీనియర్ కాంగ్రెస్ నాయకురాలు నైషదం సత్యనారాయణమూర్తి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూల మాలవేసి నివాళులర్పించడంతోపాటు పలువురు జిహెచ్ఎంసి కార్మికులతోపాటు సుమారు 100 మంది పేద మహిళలకు చీరలను పంపిణీ చేశారు. అనంతరం సత్యనారాయణ మూర్తి మాట్లాడుతూ... సామాజిక సేవా కార్యక్రమంలో భాగంగా ప్రతి ఏడాది ఇలాంటి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ హౌస్ఫెడ్ డైరెక్టర్ అయిలినేని కిషన్రావు, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ఆర్. వివేక్, రఫీ అహ్మమద్, వి వెంకటస్వామి గౌడ్, ప్రియాంక, డా. ఎన్. సంతోషలక్ష్మి, నైషదం రాధాకృష్ణ మూర్తి, ఎన్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల సర్టిఫికెట్లు నిలిపివేయొద్దు

**ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల పేరుతో విద్యార్థులను ఇబ్బంది పెట్టొద్దు**



**విశాల భారతి, అబ్దుల్లాపూర్‌మెట్ :** ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు ఆలస్యమవుతున్నాయనే కారణంతో విద్యార్థుల ధ్రువపత్రాలను కళాశాలలు నిలిపివేయడం సరికాదని సమాచార హక్కు చట్టం సాధన కమిటీ జాతీయ చైర్మన్ డా. చంటి ముదిరాజ్ అన్నారు. ఈ మేరకు హైదరాబాద్‌లో తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ వి. బాలకిష్టారెడ్డిని కలిసి విద్యార్థుల సమస్యలపై వినతిపత్రం సమర్పించారు. ప్రభుత్వం నుంచి ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదలలో జాప్యం జరుగుతున్న కారణంగా కొన్ని కళాశాలలు విద్యార్థుల ఒరిజినల్ సర్టిఫికెట్లు, మార్కుల మెమోలు, డిగ్రీ, తాత్కాలిక ధ్రువపత్రాలు, బదిలీ ధ్రువపత్రాలను నిలిపివేస్తున్నట్లు కమిటీ దృష్టికి వచ్చిన విషయాన్ని ఉన్నత విద్యా మండలి చైర్మన్‌కు వివరించారు. ప్రభుత్వం-కళాశాలల మధ్య ఉన్న ఆర్థిక సమస్యలకు విద్యార్థులను బాధ్యులను చేయడం తగదని డా. చంటి ముదిరాజ్ పేర్కొన్నారు. సర్టిఫికెట్లు అందుబాటులో లేకపోవడం వల్ల విద్యార్థులు ఉద్యోగ అవకాశాలు, ఉన్నత విద్యలో ప్రవేశాలు, పోటీ పరీక్షలకు దరఖాస్తు చేసుకునే అవకాశాలను కోల్పోయే పరిస్థితి ఏర్పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని రాష్ట్రవ్యాప్తంగా కళాశాలలకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసి, నిలిపివేసిన ధ్రువపత్రాలను వెంటనే విద్యార్థులకు అందించేలా చర్యలు తీసుకోవాలని కమిటీ కోరింది. విద్యార్థుల సర్టిఫికెట్లు నిలిపివేస్తున్న కళాశాలలపై విచారణ జరిపి, నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేసింది. విద్యార్థి సర్టిఫికెట్ అతని భవిష్యత్తుకు తాళంచెవి. ఆర్థిక బకాయిల పేరుతో దాన్ని బందీ చేయకూడదు అని డా. చంటి ముదిరాజ్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అరవింద స్వామి, సహాయ కార్యదర్శి శ్రీకాంత్ రెడ్డి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

**నిజామాబాద్ జిల్లా. :/ఇందల్వాయి, విశాల భారతి** : రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందగా, అతని స్నేహితుడికి స్వల్ప గాయాలయ్యాయి. పోలీసుల వివరాల ప్రకారం.. డిచ్‌పల్లి మండలం ఖిల్లా డిచ్‌పల్లి గ్రామానికి చెందిన నకిడి నరేశ్ (30) వ్యవసాయం చేస్తూ జీవిస్తున్నాడు. సోమవారం రాత్రి సుమారు 7.30 గంటలకు తన స్నేహితుడితో కలిసి స్ప్లెండర్ ప్లస్ బైక్‌పై వ్యక్తిగత పనిమీద బయటకు వెళ్లి తిరిగి ఇంటికి వస్తున్నాడు. ఈ క్రమంలో బీబీపూర్ సమీపంలోని అన్నల్ దాబా వద్ద యూటర్న్ తీసుకుంటుండగా హైదరాబాద్ నుంచి నాగ్‌పూర్ వైపు వెళ్తున్న షిఫ్ట్ డిజైర్ కారు (TS18 B 3633) వేగంగా, అజాగ్రత్తగా వచ్చి బైక్‌ను ఢీకొట్టింది. ప్రమాదంలో నరేశ్ తీవ్రంగా గాయపడి సంఘటనా స్థలంలోనే మృతి చెందాడు. అతని స్నేహితుడికి స్వల్ప గాయాలయ్యాయి. ఈ ఘటనపై పోలీసులు షిఫ్ట్ డిజైర్ కారు డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.



## సారంపల్లి మల్లారెడ్డి మరణం రైతాంగ ఉద్యమాలకు తీరని లోటు

**సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బి సామెల్**

**విశాల భారతి ఇబ్రహీంపట్నం**

సిపిఎం పార్టీ సీనియర్ నేత,రైతు ఉద్యమ నాయకుడు, అఖిల భారత కిసాన్ సభ జాతీయ ఉపాధ్యక్షులు, కామ్రేడ్ సారంపల్లి మల్లారెడ్డి మరణం రైతు ఉద్యమాలకు తీరని లోటు అని, సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బి.సామెల్ అన్నారు. సోమవారం స్థానిక పాషా, నరహరి స్మారక కేంద్రంలో మల్లారెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్ళు అర్పించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో రైతు సంఘం స్థాపనలో కీలక పాత్ర పోషించారని వ్యవసాయ రంగ నిపుణుడిగా, నీటిపారుదల రంగంలో నిష్ణాతుడిగా అపార అనుభవం కలిగిన నాయకుడని అనేకమంది రాజకీయ నాయకులు, అధికారులు కూడా మల్లారెడ్డి దగ్గర సలహాలు తీసుకునే వారిని అలాంటి వ్యక్తి మరణించడం బాధాకరమని మల్లారెడ్డి మృతికి సిపిఎం జిల్లా కమిటీ తరఫున సంతాపం తెలుపుతూ వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. మహబూబాద్ ప్రాంతంలో శ్రీరాంసాగర్ ప్రాజెక్టు కాలువలు కోసం జరిగిన పోరాటంలో మల్లారెడ్డి సలహాలు సూచనలు ఎంతో ఉపయోగపడ్డాయని తెలిపారు. కాలువలు తవ్వి ఆమనగల్లు గ్రామం వద్ద రిజర్వ్ ఫారెస్ట్ పేరుతో కాల్వలు వదిలేస్తే వాటికోసం పోరాటం నిర్వహించిన సందర్భంగా మల్లారెడ్డి రైతు నాయకులుగా ఆ పోరాటంలో ప్రత్యక్షంగా పాల్గొనీ ఆ పోరాటానికి ఉత్సాహాన్ని ఇచ్చారని తెలిపారు. శ్రీరాంసాగర్ ప్రాజెక్టు కాలువ నీళ్లు ఈ ప్రాంతానికి రావడం కోసం వెన్నవరం కాలువ పోరాటం లో మల్లారెడ్డి పాత్ర కీలకమైందని తెలిపారు. రైతాంగ సమస్యల పరిష్కారం కోసం జరిగిన పోరాటాలు ఉద్యమాల్లో ప్రత్యక్షంగా పాల్గొని రైతు ఉద్యమ నేతగా జీవితకాలం పోరాటం చేశారని తెలిపారు. ఉమ్మడివరంగల్ జిల్లాలో పుట్టిన మల్లారెడ్డి ఆ జిల్లా లో సిపిఎం పార్టీ నిర్మాణంలో, రైతు సంగం నిర్మాణంలో కీలక పాత్ర పోషించారని, సిపిఎం పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులుగా, కంట్రోల్ కమిషన్ చైర్మన్ గా, బాధ్యతలు నిర్వహించారని తెలిపారు. కమ్యూనిస్టు నాయకునిగా నిరాడంబరమైన జీవితం గడిపారని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో రైతాంగ సమస్యల మీద, వ్యవసాయం, పంటలు నీటి ప్రాజెక్టుల నిర్వహణ మీద అపారమైన జ్ఞానం సంపాదించారని, వారి మరణం తెలంగాణ రైతాంగ ఉద్యమానికి కాకుండా, ప్రజా పోరాటాలకు కూడా తీవ్ర లోటని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు జగన్ పోల్కంపల్లి, పొచమోని కృష్ణ, బి. యాదగిరి, కృష్ణ, గుడ్డేటి జంగయ్య పాల్గొన్నారు.

## టీజీపీఏలో ఏపీ ఎక్సైజ్ ఎస్ఐలకు ఉన్నతాధికారుల మార్గదర్శనం



**148 మంది ట్రైనీలతో ముఖాముఖి.. శిక్షణ, వసతులపై సంతృప్తి వ్యక్తం చేసిన ఉన్నతాధికారులు**

**రాజేంద్రనగర్, విశాల భారతి:**

ఆంధ్రప్రదేశ్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖలో శిక్షణ పొందుతున్న 148 మంది సబ్ఇన్‌స్పెక్టర్లతో ముఖాముఖి నిర్వహించేందుకు ఆ శాఖ కమిషనర్ శ్రీధర్ ఐఏఎస్, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ రాహుల్ దేవ్ శర్మ ఐపీఎస్ సోమవారం ఆర్‌బీవీఆర్ఆర్ తెలంగాణ పోలీస్ అకాడమీ (టీజీపీఏ)ని సందర్శించారు. ఈ సందర్భంగా రాణి రుద్రమదేవి ఆడిటోరియంలో ఏపీ ఎక్సైజ్ ఎస్ఐ ట్రైనీలతో ఉన్నతాధికారులు ముఖాముఖి నిర్వహించారు. ట్రైనీలతో నేరుగా మాట్లాడిన ఉన్నతాధికారులు శిక్షణా కార్యక్రమాలు, అకాడమీలో అందుతున్న వసతులు, భోజనం, వసతి, ఫిజికల్ ఫిట్‌నెస్, శిక్షణా విధానం తదితర అంశాలపై వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. శిక్షణకు సంబంధించి ఎలాంటి సమస్యలు లేవని ట్రైనీలు వెల్లడించడంతో అధికారులు సంతృప్తి వ్యక్తం చేశారు. ట్రైనీల శారీరక దారుఢ్యం, క్రమశిక్షణ, శిక్షణ పట్ల ఉన్న ఆసక్తిని వారు అభినందించారు. అనంతరం కమిషనర్ శ్రీధర్ ఐఏఎస్, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ రాహుల్ దేవ్ శర్మ ఐపీఎస్ ట్రైనీలకు ప్రత్యేక తరగతులు నిర్వహించారు. ఎక్సైజ్ చట్టాల అమలు, ఎన్‌ఫోర్స్‌మెంట్ విధులు, ఫీల్డ్ స్థాయిలో ఎదురయ్యే సవాళ్లు, వృత్తి నైపుణ్యం, క్రమశిక్షణ తదితర అంశాలపై విలువైన సూచనలు, మార్గదర్శకత్వం అందించారు. శిక్షణలో పొందిన జ్ఞానం, నైపుణ్యాలను ప్రజా సేవలో సమర్థవంతంగా వినియోగించాలని సూచించారు. విధి నిర్వహణలో చట్టబద్ధత, నిష్పక్షపాత వైఖరి, క్రమశిక్షణతో పాటు ప్రజల పట్ల బాధ్యతాయుతమైన ప్రవర్తన ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు.

**టీజీపీఏ శిక్షణకు ప్రశంసలు**

ఏపీ ఎక్సైజ్ ఎస్ఐలకు అత్యుత్తమ శిక్షణ అందించేందుకు టీజీపీఏ డైరెక్టర్ అభిలాషా బిష్ట్ ఐపీఎస్ ఆధ్వర్యంలో అధికారులు, శిక్షణ సిబ్బంది చేస్తున్న కృషిని కమిషనర్ శ్రీధర్, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ రాహుల్ దేవ్ శర్మ ప్రత్యేకంగా అభినందించారు. ట్రైనీలకు నాణ్యమైన శిక్షణతో పాటు మౌలిక వసతులు, వసతి, ఫిజికల్ ఫిట్‌నెస్ సౌకర్యాలు కల్పిస్తున్నందుకు టీజీపీఏ డైరెక్టర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. అకాడమీ అందిస్తున్న శిక్షణా ప్రమాణాలపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ నరహరి, టీజీపీఏ అధికారులు, శిక్షణ సిబ్బంది, ఏపీ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖకు చెందిన 148 మంది ఎస్ఐ ట్రైనీలు పాల్గొన్నారు.

## క్యామ మల్లేష్‌కు పరామర్శ

**త్వరగా కోలుకోవాలని ఆర్ ఎస్ ప్రవీణ్ కుమార్ ఆకాంక్ష**



**విశాల భారతి, అబ్దుల్లాపూర్‌మెట్ :** ఇటీవల అనారోగ్యానికి గురై ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న భువనగిరి పార్లమెంట్ బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జ్ క్యామ మల్లేష్‌ను బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డా. ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ ఐపీఎస్ (రిటైర్డ్) పరామర్శించారు. మల్లేష్ నివాసానికి వెళ్లిన ప్రవీణ్ కుమార్ ఆయన ఆరోగ్య పరిస్థితిని, యోగక్షేమాలను ఆప్యాయంగా అడిగి తెలుసుకున్నారు. మల్లేష్ త్వరగా సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకుని తిరిగి ప్రజాక్షేత్రంలో చురుగ్గా పాల్గొనాలని ప్రవీణ్ కుమార్ ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఆయనకు ధైర్యం చెప్పి, ఆరోగ్యంపై తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఆర్ ఫౌండేషన్ చైర్మన్ బూడిద రాంరెడ్డి, బండరావిరాల గ్రామ సర్పంచ్ కందికంటి విజయ్ కుమార్, ఎం.సి. కేశవరావు, ఆందోజు శంకరాచారి, కొమ్ము శ్రీనివాస్ యాదవ్, పూదరి అంజన్ కుమార్, మహేష్ చారి, ముదిగొండ వెంకట్, బండరావిరాల గ్రామ ఉపసర్పంచ్ దూస శంకర్ ముదిరాజ్, వార్డు సభ్యులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## బీఎస్పీలో చేరికలు

**రాష్ట్ర అధ్యక్షుడు ఇబ్రాం శేఖర్ ఆధ్వర్యంలో పలువురు నాయకుల చేరిక**



**విశాల భారతి, అబ్దుల్లాపూర్‌మెట్ :** బహుజన్ సమాజ్ పార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఇబ్రాం శేఖర్ సమక్షంలో పలువురు చేరికలు. బిఎస్పీ పార్టీ రంగారెడ్డి జిల్లా ఈసీ సభ్యుడు చిత్రం క్రిష్ణ ఆధ్వర్యంలో సయ్యద్ నూర్ హుస్సేన్, మహ్మద్ సులేమాన్, తౌహీద్, చంటి బహుజన్ సమాజ్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు ఇబ్రాం శేఖర్ నూతనంగా పార్టీలో చేరిన వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. బీఎస్పీ సిద్ధాంతాలు, బహుజనుల హక్కులు, సామాజిక న్యాయం, సమానత్వం కోసం పార్టీ చేస్తున్న పోరాటంలో నూతన సభ్యులు భాగస్వాములు కావాలని ఆయన సూచించారు. పార్టీలో చేరిన సయ్యద్ నూర్ హుస్సేన్, మహ్మద్ సులేమాన్, తౌహీద్, చంటి మాట్లాడుతూ.. బీఎస్పీ ఆశయాలకు అనుగుణంగా పనిచేస్తూ పార్టీ బలోపేతానికి తమ వంతు కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని నూతన సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు.

## ఫీజుల బకాయిలు చెల్లించాలి

**విద్యార్థులకు రూ.15 వేల కోట్ల బకాయిలను వెంటనే విడుదల చేయాలి: కసిరెడ్డి భాస్కరరెడ్డి**




**సైబరాబాద్ విశాల భారతి:** విద్యార్థులకు చెల్లించాల్సిన ఫీజు బకాయిలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని బీజేపీ రాష్ట్ర నాయకుడు కసిరెడ్డి భాస్కరరెడ్డి డిమాండ్ చేశారు. ''ఫీజుల బకాయి.. బీజేపీ లడాయి'' నినాదంతో రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు ఎన్. రాంచందర్‌రావు చేపట్టిన రెండు రోజుల నిరాహార దీక్షకు రాష్ట్ర పార్టీ కార్యాలయంలో కసిరెడ్డి భాస్కరరెడ్డి సంఘీభావం తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులకు చెల్లించాల్సిన సుమారు రూ.15 వేల కోట్ల ఫీజు బకాయిలను ప్రభుత్వం తక్షణమే విడుదల చేయాలని కోరారు. విద్యార్థుల కోసం ఖర్చు చేసే ఈ మొత్తాన్ని వ్యయంగా కాకుండా రాష్ట్ర భవిష్యత్తుకు పెట్టుబడిగా ప్రభుత్వం భావించాలని సూచించారు.ఫీజులు చెల్లించకపోవడంతో లక్షలాది మంది విద్యార్థులకు కళాశాలలు సర్టిఫికెట్లు ఇవ్వకపోవడం వారి భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం చూపుతోందని ఆవేదన వ్యక్తం చేశారు.ఫీజు బకాయిల విషయంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన తప్పునే ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కూడా కొనసాగిస్తోందని విమర్శించారు. విద్యార్థుల సమస్యలను పరిష్కరించడంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విద్యాశాఖ మంత్రిగా విఫలమయ్యారని ఆరోపించారు. వెంటనే విద్యాశాఖను సమర్థుడైన వ్యక్తికి అప్పగించాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధికార ప్రతినిధి ఎం. రవికుమార్ యాదవ్, జిల్లా ప్రధాన కార్యదర్శి తోపుగొండ మహిపాల్‌రెడ్డి, సురభి రవీందర్‌రావు, బాల్ద అశోక్, నరేందర్‌రెడ్డి, కుమార్ యాదవ్‌తో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఐలమ్మ స్ఫూర్తితో హక్కుల కోసం పోరాడాలి


**వీరనారి వర్ధంతిని గ్రామ గ్రామాన ఘనంగా నిర్వహిద్దాం: పెద్దవూర బ్రహ్మయ్య రజక**



**విశాల భారతి, అబ్దుల్లాపూర్‌మెట్ :** భూమి కోసం, భుక్తి కోసం, విముక్తి కోసం పోరాడిన తెలంగాణ రైతాంగ పోరాట యోధురాలు వీరనారి చాకలి ఐలమ్మ వర్ధంతిని వచ్చే నెల 10వ తేదీన గ్రామ గ్రామాన, మండల మండలాలలో, పట్టణ ప్రాంతాల్లో ఘనంగా నిర్వహించి ఆమెకు నివాళులర్పించాలని మన ఆలోచన సాధన సమితి రాష్ట్ర ప్రచార కార్యదర్శి పెద్దవూర బ్రహ్మయ్య రజక పిలుపునిచ్చారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట చరిత్రలో చాకలి ఐలమ్మ తన ధైర్యసాహసాలతో చెరగని ముద్ర వేశారని ఆయన అన్నారు. దొరలు, భూస్వాముల దౌర్జన్యాలు, వెట్టి చాకిరీకి వ్యతిరేకంగా నిలబడి పేదలు, కష్టజీవులు, అణగారిన వర్గాల హక్కుల కోసం ఆమె సాగించిన పోరాటం నేటికీ స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. తన భూమిని అక్రమంగా స్వాధీనం చేసుకునేందుకు ప్రయత్నించిన భూస్వామ్య శక్తులకు లొంగకుండా ఐలమ్మ ధైర్యంగా ఎదురొడ్డి నిలిచారని తెలిపారు. తన హక్కును కాపాడుకోవడమే కాకుండా పేదలు, రైతులు తమ హక్కుల కోసం పోరాడాలనే స్ఫూర్తిని ప్రజల్లో నింపారని అన్నారు. *భూమి దున్నేవాడిదే* " అనే హక్కు భావనకు చాకలి ఐలమ్మ పోరాటం ప్రతీకగా నిలిచిందని బ్రహ్మయ్య రజక అన్నారు. మహిళలు కూడా అన్యాయానికి వ్యతిరేకంగా ముందుండి పోరాడగలరని తన జీవితంతో నిరూపించిన ధీరవనిత ఐలమ్మ అని కొనియాడారు. నేటి యువత, మహిళలు ఐలమ్మ పోరాట చరిత్రను తెలుసుకుని సామాజిక న్యాయం, సమానత్వం, ఆత్మగౌరవం, హక్కుల సాధన కోసం ఆమె ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని ఆయన కోరారు. వచ్చే నెల 10న నిర్వహించే వర్ధంతి కార్యక్రమాల్లో ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని వీరనారి చాకలి ఐలమ్మకు ఘన నివాళులర్పించాలని పిలుపునిచ్చారు.

## వివాదాస్పద భూ సమస్యలను సత్వరమే పరిష్కరించాలి

**ప్రభుత్వ ముఖ్య సలహాదారులు బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి**



**నిజామాబాద్ జిల్లా విశాల భారతి** రెంజల్ తాహసీల్దార్ కార్యాలయంలో అధికారులతో మాజీ మంత్రి ప్రభుత్వ ముఖ్య సలహాదారులు సుదర్శన్ రెడ్డి సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిషేధిత జాబితాలో ఉన్న వివాదాస్పద భూముల పరిష్కారం లభిస్తుందని ఆయన అన్నారు. రైతులు ఎదుర్కొంటున్న భూ సమస్యలపై రీ సర్వే నిర్వహించి రెవెన్యూ, సబ్ రిజిస్టర్ అధికారులు రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను సత్వరమే పరిష్కరించాలని ఆయన సూచించారు. అదేవిధంగా గ్రామ పంచాయతీలలో కారోబార్ గా విధులు నిర్వహిస్తునటువంటి వారిని వెంటనే విధుల నుండి తొలగించాలన్నారు. వారి వల్ల గ్రామాలలో అనేక అవకతవకలు జరుగుతున్నట్లు ఆయన అన్నారు. ఎవరైతే కారోబార్లను విధుల నుండి తొలగించలేదో వారిపై కచ్చితంగా యాక్షన్ తీసుకుంటామన్నారు. అలాగే ఉపాధి హామీ సిబ్బంది మరియు అధికారులు ప్రభుత్వ పాఠశాలలతో పాటు గ్రామాల్లోని డ్రైనేజీలను పరిశుభ్రంగా ఉండే విధంగా చూడాలన్నారు. ఈ విధానాన్ని రేంజల్ మండలంలోని కాకుండా జిల్లా వ్యాప్తంగా అమలు అయ్యే విధంగా చూడాలని సంబంధిత శాఖ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బీన్ హుందాన్, గ్రంథాలయ జిల్లా చైర్మన్ అంతిరెడ్డి రాజారెడ్డి, తహసీల్దార్ శ్రావణ్ కుమార్, ఎంపీడీవో కమలాకర్, పలు శాఖల మండల స్థాయి అధికారులు మరియు కాంగ్రెస్ మండల అధ్యక్షులు మోబిన్ ఖాన్, మాజీ జెడ్పిటిసి నాగభూషణ్ రెడ్డి, మాజీ సర్పంచ్ జావిద్, సాయ రెడ్డి,మండల నాయకులు సాయిబాబా గౌడ్, సాయ గౌడ్, ఆసాని అనిల్, తదితరులు పాల్గొన్నారు.

# సీతారామ ప్రాజెక్టు నీటిని బయ్యారం మండలానికి తరలించాలి

- కరువు నివారణకు ఇదే శాశ్వత పరిష్కారం:
- ధర్నాలో న్యూడెమోక్రసీ, ఏఐకేఎంఎస్ నాయకుల డిమాండ్



**బయ్యారం విశాల భారతి:**

వర్షాభావ పరిస్థితులతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న బయ్యారం మండలానికి సీతారామ ప్రాజెక్టు ద్వారా గోదావరి జలాలను అందించడమే కరువు నివారణకు శాశ్వత పరిష్కారమని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి గౌని ఐలయ్య, ఏఐకేఎంఎస్ రాష్ట్ర నాయకులు నందగిరి వెంకటేశ్వర్లు, మోకాళ్ల మురళీకృష్ణ డిమాండ్ చేశారు. ప్రభుత్వం తక్షణమే కరువు సహాయక చర్యలు చేపట్టి రైతులను ఆదుకోవాలని కోరారు. ఏఐకేఎంఎస్ ఆధ్వర్యంలో బయ్యారం మండల పరిషత్ కార్యాలయం ఎదుట నిర్వహించిన ధర్నాలో నాయకులు మాట్లాడుతూ.. ఈ ఏడాది వర్షాలు ఆశించిన స్థాయిలో కురవకపోవడంతో రైతులు తీవ్ర ఆందోళనలో ఉన్నారని అన్నారు. గత నాలుగు దశాబ్దాలుగా బయ్యారం చెరువు అలుగు పడకుండా ఉండటం ఇదే తొలిసారి అని పేర్కొన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ప్రభుత్వం కరువు నివారణకు యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు.

**కాలువలు శిథిలం.. ఆరుతడి పంటలు ఎలా సాగు చేయాలి?.**

అధికారులు ఆరుతడి పంటలు సాగు చేయాలని రైతులకు సూచిస్తున్నప్పటికీ బయ్యారం చెరువు కింద ఉన్న కాలువలు శిథిలావస్థకు చేరుకోవడంతో ఆరుతడి పంటలు సాగు చేయడం సాధ్యం కాదని నాయకులు అన్నారు. చెరువు తూము ఎత్తితే నీరు లోతట్టు పొలాల్లో వారాల తరబడి నిలిచిపోయి పంటలు కుళ్లిపోయే ప్రమాదం ఉందన్నారు. చెరువు నిండుతుందనే ఆశతో ఇప్పటికే పలువురు రైతులు వరి నార్లు పోసుకోవడంతో పాటు నాట్లు కూడా వేశారని తెలిపారు. ప్రస్తుతం తూముకు సీలు వేయడంతో నాట్లు వేసిన పంటలు, నారుమడులు నీరు లేక ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వరి సాగు చేయవద్దని అధికారులు చెబుతున్నప్పటికీ తమ భూములు ఆరుతడి పంటలకు అనుకూలంగా లేకపోవడంతో అనేకమంది రైతులు భూములను సాగు చేయకుండా వదిలేయాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు.

**ఎకరాకు వేలాది రూపాయల పెట్టుబడి.. రైతులపై అప్పుల భారం.**

ఇప్పటికే నాట్లు వేసిన రైతులు ఎకరాకు రూ.15 వేల నుంచి రూ.20 వేల వరకు పెట్టుబడి పెట్టారని నాయకులు తెలిపారు. నాట్లు వేయని రైతులు సైతం నార్లు పోసుకొని, దుక్కులు దున్ని ఎకరాకు సుమారు రూ.10 వేల వరకు ఖర్చు చేశారని చెప్పారు. మొక్కజొన్న, పత్తి తదితర పంటలకు కూడా రైతులు ఎకరాకు సుమారు రూ.15 వేల వరకు పెట్టుబడి పెట్టారని పేర్కొన్నారు. బ్యాంకుల నుంచి, ప్రైవేటు వ్యాపారుల నుంచి అధిక వడ్డీలకు అప్పులు తెచ్చుకుని విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేసిన రైతులు ఇప్పుడు వర్షాభావ పరిస్థితులతో తీవ్ర ఆందోళనకు గురవుతున్నారని అన్నారు. రైతులను ఆదుకోవాల్సిన ప్రభుత్వ పెద్దలు కరువు నివారణ చర్యలపై దృష్టి పెట్టకుండా వర్షాలు పడకపోవడానికి క్షుద్రపూజలు కారణమంటూ బాధ్యతారహిత వ్యాఖ్యలు చేయడం సరికాదని విమర్శించారు.

**హామీ ఇచ్చిన సీతారామ ప్రాజెక్టు నీళ్లు ఎక్కడ?**

బయ్యారం, గార్ల చెరువులతో పాటు ఏజెన్సీ ప్రాంతాలకు సీతారామ ప్రాజెక్టు ద్వారా గోదావరి జలాలు అందిస్తామని గతంలో ప్రభుత్వం స్పష్టమైన హామీ ఇచ్చిందని నాయకులు గుర్తుచేశారు. ఈ అంశాన్ని ప్రాజెక్టు డీపీఆర్‌లోనూ పేర్కొన్నారని తెలిపారు. నాటి ముఖ్యమంత్రి 2016 ఫిబ్రవరి 16న ఇల్లందు నియోజకవర్గంలోని రోళ్లపాడు చెరువు వద్ద సీతారామ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశారని పేర్కొన్నారు. అయితే ప్రాజెక్టు తొలి దశ పనులను పక్కనపెట్టి, శంకుస్థాపన చేసిన రోళ్లపాడు చెరువుతో పాటు బయ్యారం, గార్ల చెరువులను విస్మరించి పాలేరు వైపు నీటిని తరలించే కాలువ పనులకు ప్రాధాన్యత ఇవ్వడం అన్యాయమని మండిపడ్డారు.

**రూ.20 వేల కోట్ల ప్రాజెక్టు.. బయ్యారం రైతులకు మాత్రం నీళ్లు లేవు.**

ఇప్పటికే సీతారామ ప్రాజెక్టుపై సుమారు రూ.20 వేల కోట్లు ఖర్చు చేసినప్పటికీ బయ్యారం ప్రాంతంలోని ఒక్క ఎకరానికైనా కొత్తగా సాగునీరు అందకపోవడం దురదృష్టకరమని నాయకులు అన్నారు. ప్రాజెక్టు ఉద్దేశం వెనుకబడిన ప్రాంతాలకు సాగునీరు అందించడమే అయినప్పటికీ ప్రస్తుతం నాగార్జునసాగర్ ఆయకట్టుకు రెండో, మూడో పంటలకు నీటి భరోసా కల్పించే ప్రాజెక్టుగా పరిమితమైందని విమర్శించారు.

**మున్నేరు నీళ్లను తరలించడంపైనా ఆగ్రహం.**

అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్లు గడిచినా కాంగ్రెస్ ప్రభుత్వం బయ్యారం, గార్ల ప్రాంతాలకు గోదావరి నీటిని అందించలేదని నాయకులు విమర్శించారు. బయ్యారం, గార్ల మండలాల సమీపంలో ప్రవహించే మున్నేరు నీటిని కూడా పాలేరు వైపు తరలించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టడం మరింత అన్యాయమని అన్నారు. బయ్యారం ప్రాంతానికి సాగునీరు అందించకుండా నీటి వనరులను ఇతర ప్రాంతాలకు తరలిస్తే ఈ ప్రాంత రైతాంగం తీవ్రంగా నష్టపోతుందని హెచ్చరించారు.

**భూమిలేని వ్యవసాయ కూలీలను ఆదుకోవాలి**

కరువు పరిస్థితుల్లో భూమిలేని వ్యవసాయ కూలీల పరిస్థితి మరింత దయనీయంగా మారిందని నాయకులు అన్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు భూమిలేని వ్యవసాయ కూలీలకు సంవత్సరానికి రూ.12 వేల ఆర్థిక సహాయం వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సీతారామ ప్రాజెక్టు ద్వారా తక్షణమే గోదావరి జలాలను బయ్యారం చెరువుకు తరలించాలి, కరువు సహాయక చర్యలు వెంటనే ప్రారంభించాలి, రైతులు,వ్యవసాయ కూలీలను ఆర్థికంగా ఆదుకోవాలి అని నాయకులు స్పష్టం చేశారు. రైతుల ప్రయోజనాలను విస్మరిస్తే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం నాయకులు తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని మండల తహసీల్దార్, మండల అభివృద్ధి అధికారులకు సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఏఐకేఎంఎస్ మండల అధ్యక్షుడు బానోతు నరసింహ, కార్యదర్శి తోకల వెంకన్న, మాజీ ఎంపీపీ ఊకే పద్మ, మాజీ పీఏసీఎస్ చైర్మన్ రామగిరి బిక్షం, తుడుం వీరభద్రం, మాదంశెట్టి నాగేశ్వరరావు, నేతకాని రాకేష్, మేకపోతుల నాగేశ్వరరావు, ఏపూరి వీరభద్రం, బొల్లం సోమక్క, యాతం రమణారెడ్డి, కొదుమూరి నాగేశ్వరరావు, భూక్యా రాము, బానోత్ హోలీ, నూతక్కి భూషణ్‌రావు, మెంగు భగవాన్, ఎస్.కె. మహమూద్, యాకూబ్ పాషా తదితరులు పాల్గొన్నారు.

## నందివనపర్తిలో ఫామ్ ల్యాండ్‌పై చర్యలు తీసుకోవాలి

**పెరుమళ్ళ విక్రాంత్**



**విశాల భారతి ఇబ్రహీంపట్నం :** యాచారం మండలపరిధిలోని నంది వనపర్తి గ్రామంలో వెలిసిన అక్రమ ఫామ్ ల్యాండ్‌పై తక్షణమే చర్యలు తీసుకోవాలని, సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో నంది వనపర్తి గ్రామానికి చెందిన పేరుమాల్ల విక్రాంత్ యాచారం మండల తహసీల్దార్ కు ఫిర్యాదు చేశారు. గ్రామంలోని సర్వే నెంబర్ 581లో గతంలో 'శ్రీ భువి నేచర్ వ్యాలీ' పేరుతో ఫామ్ ల్యాండ్ ఏర్పాటు చేశారని ఆయన పేర్కొన్నారు. దానికి అదనంగా నిబంధనలకు విరుద్ధంగా మరో 5 ఎకరాలు పొడిగించి అందులో రోడ్లు, డ్రైనేజీ పనులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా వెంచర్లు చేస్తూ ప్రభుత్వ ఖజానాకు గండి కొడుతున్నారని విక్రాంత్ ఆరోపించారు. ప్రభుత్వ నియమ నిబంధనలను ఉల్లంఘిస్తూ సాగుతున్న ఈ అక్రమ ఫామ్ ల్యాండ్‌ను తక్షణమే తొలగించి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## నందివనపర్తి 8వ వార్డులో తీవ్ర నీటి సమస్య ప్రజావాణిలో ఫిర్యాదు

- తక్షణమే పరిష్కరించాలని ఎంపీడీవోకు వినతి
- వార్డు మెంబర్ కొండాపురం సుష్మ శ్రీశైలం



**విశాల భారతి ఇబ్రహీంపట్నం:** యాచారం మండలంలోని నంది వనపర్తి గ్రామం 8వ వార్డులో నెలకొన్న తీవ్ర నీటి సమస్యను పరిష్కరించాలని వార్డు సభ్యురాలు కొండాపురం సుష్మా శ్రీశైలం కోరారు. ఈ మేరకు సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఎంపీడీవో రాధారాణి కి వినతిపత్రం అందజేశారు. వార్డులో ప్రజలు తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, నీటి సరఫరా సక్రమంగా లేకపోవడంతో రోజువారీ అవసరాలకు కూడా నీరు అందక అవస్థలు పడుతున్నారని ఆమె తెలిపారు. ఈ సందర్భంగా వార్డు సభ్యురాలు కొండాపురం సుష్మా శ్రీశైలం మాట్లాడుతూ 8వ వార్డులో కొంతకాలంగా నీటి సమస్య తీవ్రంగా ఉందని, పలుమార్లు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ సమస్య పూర్తి స్థాయిలో పరిష్కారం కాలేదని తెలిపారు. వేసవి కాలం ముగిసినప్పటికీ నీటి ఇబ్బందులు కొనసాగుతుండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ముఖ్యంగా మహిళలు, వృద్ధులు, చిన్నారులు నీటి కోసం ఇబ్బందులు పడుతున్నారని, దూర ప్రాంతాలకు వెళ్లి నీటిని తెచ్చుకోవాల్సిన పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. తాగునీటి సమస్యతో పాటు ఇంటి అవసరాలకు కూడా సరిపడా నీరు అందక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. వార్డులో నీటి సరఫరా వ్యవస్థను అధికారులు పరిశీలించి, లోపాలను గుర్తించి వెంటనే మరమ్మతులు చేపట్టాలని కోరారు. అవసరమైన చోట్ల పైప్‌లైన్ మరమ్మతులు, నీటి ట్యాంకుల ద్వారా సరఫరా వంటి ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టి ప్రజలకు ఇబ్బంది లేకుండా చూడాలని విజ్ఞప్తి చేశారు. ప్రజల ప్రాథమిక అవసరమైన తాగునీటి సమస్యపై అధికారులు ప్రత్యేక దృష్టిసారించి శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు. ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని అధికారులు తక్షణమే స్పందించి 8వ వార్డులో నీటి సమస్యను పరిష్కరించాలని, భవిష్యత్‌లో ఇలాంటి సమస్యలు పునరావృతం కాకుండా శాశ్వత చర్యలు చేపట్టాలని కొండాపురం సుష్మా శ్రీశైలం కోరారు.

## సైబరాబాద్‌లో అక్రమ నిర్మాణాలపై ఉక్కుపాదం

- 70 గజాల్లో 7 మీటర్లకు మించిన నిర్మాణాల కూల్చివేత
- ఫిర్యాదులపై నిర్లక్ష్యం చేస్తే అధికారులపై చర్యలు



**సైబరాబాద్ విశాల భారతి:** అక్రమ నిర్మాణాలపై సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు ఉక్కుపాదం మోపాలని నిర్ణయించారు. నిబంధనలకు విరుద్ధంగా చేపడుతున్న నిర్మాణాలను గుర్తించి, ఎలాంటి ఒత్తిళ్లకు తలొగ్గకుండా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ సృజన అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా 70 గజాల విస్తీర్ణంలో 7 మీటర్లకు మించి చేపడుతున్న నిర్మాణాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. నిబంధనలకు విరుద్ధంగా ఉన్న నిర్మాణాలను గుర్తించిన వెంటనే కూల్చివేత చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు.అక్రమ నిర్మాణాలపై ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను అధికారులు నిర్లక్ష్యం చేయరాదని కమిషనర్ హెచ్చరించారు. ఫిర్యాదు అందిన తర్వాత క్షేత్రస్థాయిలో పరిశీలించి నిర్మాణం నిబంధనలకు విరుద్ధంగా ఉందా లేదా అన్నది నిర్ధారించి, అక్రమంగా ఉంటే తప్పనిసరిగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇతర పనులు, పరిపాలనా బాధ్యతలు ఉన్నప్పటికీ అక్రమ నిర్మాణాలను గుర్తించడం, వాటిపై చర్యలు తీసుకోవడాన్ని విస్మరించరాదని పేర్కొన్నారు.అనుమతులు లేకుండా నిర్మిస్తున్న భవనాలు, అనుమతులకు మించి అదనపు అంతస్తులు చేపడుతున్న నిర్మాణాలు, నిబంధనలను ఉల్లంఘిస్తున్న నిర్మాణాలపై ప్రత్యేక నిఘా పెట్టాలని అధికారులను ఆదేశించారు. నిర్మాణదారులు నిబంధనలు ఉల్లంఘించినట్లు తేలితే నోటీసులు జారీ చేయడంతో పాటు అవసరమైన సందర్భాల్లో కూల్చివేత చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. అక్రమ నిర్మాణాలను చూసీచూడనట్లు వ్యవహరించే అధికారులపై కూడా శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. అక్రమ నిర్మాణాల విషయంలో అధికారులు ఎవరైనా డబ్బులు తీసుకున్నట్లు తేలితే కఠిన చర్యలు తప్పవని సృజన స్పష్టం చేశారు. అవినీతికి పాల్పడినట్లు ఆధారాలు లభిస్తే సస్పెన్షన్‌కు కూడా వెనుకాడబోమని హెచ్చరించారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను పారదర్శకంగా పరిష్కరించడంతో పాటు నిర్మాణ అనుమతుల విషయంలో నిబంధనలను కచ్చితంగా అమలు చేయాలని అధికారులకు సూచించారు. సైబరాబాద్ పరిధిలో అక్రమ నిర్మాణాలకు అడ్డుకట్ట వేయడమే లక్ష్యంగా క్షేత్రస్థాయిలో తనిఖీలు ముమ్మరం చేయాలని కమిషనర్ ఆదేశించారు. నిబంధనలను ఉల్లంఘించి నిర్మాణాలు చేపడుతున్న వారిపై చర్యలు తీసుకోవడంతో పాటు అక్రమ నిర్మాణాలకు సహకరించే అధికారులపైనా బాధ్యత నిర్ధారిస్తామని ఆమె స్పష్టం చేశారు. ప్రజల ఫిర్యాదుల పరిష్కారంలో జాప్యం, నిర్లక్ష్యం లేదా అవినీతిని ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని తేల్చిచెప్పారు.

## ఉద్యోగుల మహా ధర్నా కార్యక్రమంనకు అనుమతి ఇవ్వండి

**జిల్లా అదనపు కలెక్టర్, జెయింట్ సీపీ కి వినతి పత్రం సమర్పణ**



**విశాల భారతి ఇబ్రహీంపట్నం :** ఉద్యోగుల సమస్యల పరిష్కారం కొరకు ఈ నెల 27 న 11గంటల నుండి తలపెట్టిన మహా ధర్నా కార్యక్రమం అనుమతి కొరకు రంగారెడ్డి జిల్లా అదనపు జిల్లా కలెక్టర్ కిరణ్మయి, ఫ్యూచర్ సిటీ జెయింట్ కమిషనర్ చందన దీప్తి ను కలసి వినతిపత్రాని టీజీజేఏసీ చైర్మన్ ఊటు యశ్వంత్ ఆధ్వర్యంలో వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా టీజీజేఏసీ చైర్మన్ ఊటు యశ్వంత్ మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యలను జిల్లా కలెక్టర్ కి తెలియజేయడం జరిగింది. టీజీజేఏసీ రాష్ట్ర చైర్మన్ శ్రీ మారం జగదీశ్వర్, సెక్రటరీ జనరల్ ఏలూరి శ్రీనివాస్ రావు, కార్యవర్గం తీసుకున్న నిర్ణయం మేరకు రంగారెడ్డి జిల్లా లో అన్ని వర్గాల ఉద్యగుల అభీష్టం మేరకు మహా ధర్నా కార్యక్రమం శాంతియుతంగా అన్ని భాగస్వామ్య సంఘాలు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలో ఉన్న ఉద్యోగులు పెద్దఎత్తున సమస్యల పరిష్కారం కొరకు కొంగర కాలన్ జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద తరలి రావాలని పిలుపునిచ్చారు.. ఈ కార్యక్రమంలో టీజీజేఏసీ నాయకులు శ్రీనివాసరావు ,రంగయ్య , ఆనంద్ సింగ్, గోపాల్ నాయక్ వాణి శ్రీదేవి, అన్నపూర్ణ, తేజ ,గౌస్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు

## నల్లబెల్లం కేసులో బైండోవర్ ఉల్లంఘన రూ.70 వేల

**డోర్నకల్ విశాల భారతి:** నల్లబెల్లం, పటిక కేసులో బైండోవర్ నిబంధనలు ఉల్లంఘించిన నిందితుడికి రూ.70 వేల జరిమానా విధించారు. క్రైమ్ నంబర్ 140/2026 కేసులో ఏ2 నిందితుడిగా ఉన్న డీజే నవీన్ అలియాస్ జాటోత్ నవీన్ గత మార్చిలో తొర్రూరు తహసీల్దార్ వద్ద బైండోవర్ అయ్యాడు.అయితే తాజాగా బైండోవర్ నిబంధనలు ఉల్లంఘించినట్లు గుర్తించిన తొర్రూరు ఎక్సైజ్ అధికారులు, దంతాలపల్లి పోలీసులు నిందితుడిని తహసీల్దార్ ఎదుట హాజరుపరిచారు. విచారణ అనంతరం రూ.70 వేల జరిమానా విధించారు. బైండోవర్ ఉల్లంఘిస్తే జరిమానాతో పాటు రిమాండ్ కూడా తప్పదని దంతాలపల్లి ఎస్ఐ రవికుమార్ హెచ్చరించారు.



## పాలిటెక్నిక్ విద్యను ప్రైవేటీకరించే జీవో నంబర్ 97ను రద్దు చేయాలి: పి.డి.ఎస్.యు

**సూర్యాపేట (విశాల భారతి):**



రాష్ట్రంలో పాలిటెక్నిక్ విద్యను ప్రైవేటీకరణ దిశగా తీసుకెళ్లే ప్రభుత్వ విధానాలను వెంటనే విరమించుకోవాలని, ఇందుకు సంబంధించిన జీవో నంబర్ 97ను తక్షణమే రద్దు చేయాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం సూర్యాపేట జిల్లా అధ్యక్షులు పుల్లూరి సింహాద్రి డిమాండ్ చేశారు. సంఘం సూర్యాపేట జిల్లా కార్యవర్గం ఆధ్వర్యంలో వందలాది మంది విద్యార్థులతో భారీ ప్రదర్శన నిర్వహించి, అనంతరం జిల్లా కలెక్టరేట్ కార్యాలయం ముందు ఉధృతమైన ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని జిల్లా కలెక్టర్ గారికి అందజేశారు.ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి జిల్లా అధ్యక్షులు పుల్లూరి సింహాద్రి మాట్లాడుతూ.. ప్రభుత్వ విద్యాసంస్థలను బలోపేతం చేయాల్సిన ప్రభుత్వం, ఆ బాధ్యతను మరిచి ప్రైవేట్ సంస్థలకు అప్పగించే విధానాలను అవలంబించడం వల్ల పేద విద్యార్థులు తీవ్రంగా నష్టపోతారని ఆవేదన వ్యక్తం చేశారు. నూతన జాతీయ విద్యావిధానంలో భాగంగా పాలిటెక్నిక్ కళాశాలలను 'యువ భారత్ నైపుణ్య విశ్వవిద్యాలయం'లో విలీనం చేస్తే, పేద, మధ్యతరగతి, బడుగు, బలహీన వర్గాల విద్యార్థులకు సాంకేతిక విద్య అందని ద్రాక్షలా మారుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తీసుకువస్తున్న కొత్త విధానాల వల్ల విద్యార్థులు ప్రవేశ పరీక్ష ద్వారా నేరుగా ఉన్నత సాంకేతిక విద్య (బీటెక్) లో చేరే అవకాశం దెబ్బతింటుందని, డిప్లొమా విద్య విలువ తగ్గిపోతుందని హెచ్చరించారు. అంతేకాకుండా ఫీజులు భారీగా పెరుగుతాయని, విద్యార్థులు ఉన్నత విద్య వైపు వెళ్లకుండా కేవలం చిన్న ఉద్యోగాలకే పరిమితం అయ్యే ప్రమాదం ఉందన్నారు. ప్రస్తుతం 'రాష్ట్ర సాంకేతిక విద్యా శిక్షణ మండలి' ద్వారా కొనసాగుతున్న విద్యా వ్యవస్థను నైపుణ్య విశ్వవిద్యాలయం పరిధిలోకి తీసుకెళ్లడం వల్ల పరీక్షలు, సిలబస్ విషయంలో తీవ్ర మార్పులు వచ్చి, విద్యార్థుల విద్యా సంవత్సరం దెబ్బతింటుందని ఆందోళన వ్యక్తంచేశారు. ఇప్పటికే మొదటి, ద్వితీయ, తృతీయ సంవత్సరాల్లో చదువుతున్న విద్యార్థుల భవిష్యత్తుపై తీవ్ర అనిశ్చితి నెలకొందని, వారి సిలబస్, పరీక్షలు, ఉన్నత విద్యా ప్రవేశాల ప్రక్రియపై ప్రభుత్వం తక్షణమే స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. సాంకేతిక విద్యను ప్రభుత్వ రంగంలోనే ఉంచాలని, సాంకేతిక విద్యా మండలి స్వయం ప్రతిపత్తిని కొనసాగిస్తూ మరింత బలోపేతం చేయాలని కోరారు. వీటన్నింటికీ కారణమవుతున్న వివాదాస్పద జీవో నంబర్ 97ను ప్రభుత్వం వెంటనే వెనక్కి తీసుకోకపోతే విద్యార్థి లోకాన్ని ఐక్యం చేసి ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షులు పులి రాఖీ, నాయకులు స్నేహ, రిషిత, నవీన, జానకి, అమృత వర్షిని, గాయత్రి, లహరి, శృతి, శ్రీవాణి, ప్రవీణ్, యోగి, విజయ్ మరియు వందలాది మంది విద్యార్థులు పాల్గొన్నారు.

## మాక్లూర్ మండల ప్రజావాణి లో 14దరఖాస్తులు

**మాక్లూర్ , విశాల భారతి:** మండలములో సోమవారం రోజున నిర్వహించిన "ప్రజావాణి" కార్యక్రమములో మొత్తం 14 దరఖాస్తులు వచ్చినట్లు నోడల్ అధికారి మండల అభివృద్ధి అధికారి తెలిపారు, వచ్చిన దరఖాస్తుల సంబంధిత అధికారులు ఇట్టి సమస్యలు తొందరగా పరిష్కారం చేయాలని తెలిపారు, దరఖాస్తులు రెవిన్యూ శాఖకు దరఖాస్తులు 12 ఆర్ఎంబి శాఖకు.. దరఖాస్తు (1,.)(పంచాయతీ రాజ్ శాఖకు దరఖాస్తులు (1)వచ్చినట్లు నోడల్ అధికారి అన్నారు, ఈ కార్యక్రమంలో అన్ని శాఖల మండల అధికారులు పాల్గొన్నారు.



## పంచెకట్టు వేడుకలో కాంగ్రెస్ పార్టీ నాయకులు



**కురవి విశాల భారతి:** కురవి మండలం కందికొండ స్టేజ్‌లోని ఫంక్షన్ హాల్‌లో బత్తుల వీరన్న-సంధ్యారాణి దంపతుల కుమారుడు చి. రామచరణ్ పంచెకట్టు వేడుకను కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, ఆత్మీయుల సమక్షంలో ఘనంగా నిర్వహించారు. సంప్రదాయబద్ధంగా నిర్వహించిన ఈ శుభకార్యానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై చిన్నారి రామచరణ్‌ను ఆశీర్వదించి, బత్తుల కుటుంబ సభ్యులకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులకు బత్తుల కుటుంబ సభ్యులు ఆత్మీయ స్వాగతం పలికారు. చిన్నారి రామచరణ్ భవిష్యత్తు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో, విద్యాభివృద్ధితో వర్ధిల్లాలని నాయకులు ఆకాంక్షించారు. కుటుంబంలో జరిగే శుభకార్యాల్లో అందరూ కలిసి పాల్గొని ఆత్మీయతను చాటుకోవడం ఆనందంగా ఉందని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కురవి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బాలగాని శ్రీనివాస్ గౌడ్, మహబూబాబాద్ వ్యవసాయ మార్కెట్ చైర్మన్ ఇస్లావత్ సుధాకర్ నాయక్, కురవి మండల మాజీ అధ్యక్షుడు అంబటి వీరభద్రం గౌడ్, ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు గొల్లపల్లి రజనీకాంత్, డోర్నకల్ నియోజకవర్గ సామాజిక మాధ్యమాల సమన్వయకర్త కొర్ని అనిల్, గ్రామ అధ్యక్షుడు గాండ్ల సతీష్, యాకు పాషా, కందికొండ ఉప సర్పంచ్ కొర్ని సునీత-చందు, కాంగ్రెస్ నాయకులు ముత్తిలింగం, సిలువేరు నరేష్ తదితర నాయకులు, కార్యకర్తలు, బంధుమిత్రులు, ఆత్మీయులు పాల్గొని రామచరణ్‌ను ఆశీర్వదించారు. కాంగ్రెస్ పార్టీ నాయకుల రాకతో పంచెకట్టు వేడుక మరింత సందడిగా మారింది. కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామస్తుల మధ్య సంతోషకర వాతావరణంలో కార్యక్రమం ఘనంగా సాగింది.

## సారంపల్లి మల్లారెడ్డి మృతి రైతాంగ ఉద్యమానికి తీరని లోటు

**ఏఐకేఎంఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మండల వెంకన్న**



**మహబూబాబాద్ జిల్లా విశాల భారతి:** సీనియర్ సీపీఐ(ఎం) నాయకులు, రైతాంగ, ప్రజా ఉద్యమాల నిర్మాణంలో కీలక పాత్ర పోషించిన కామ్రేడ్ సారంపల్లి మల్లారెడ్డి మృతి రైతాంగ ఉద్యమానికి తీరని లోటని అఖిల భారత రైతు కూలీ సంఘం (ఏఐకేఎంఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మండల వెంకన్న అన్నారు. వరంగల్ జిల్లాలోని మధ్యతరగతి రైతు కుటుంబంలో జన్మించిన సారంపల్లి మల్లారెడ్డి గ్రామస్థాయి నాయకుడిగా తన ప్రస్థానాన్ని ప్రారంభించి, అంచెలంచెలుగా ఎదిగి రాష్ట్ర, కేంద్ర స్థాయిలో రైతాంగ ఉద్యమానికి విశేష సేవలందించారని తెలిపారు. వ్యవసాయ రంగం, రైతుల సమస్యలు, సాగునీటి సమస్యలపై ఆయనకు లోతైన అవగాహన ఉండేదని, రైతులు, కూలీలు, పేదలు, అణగారిన వర్గాల హక్కుల కోసం నిరంతరం పోరాడారని పేర్కొన్నారు. 85 సంవత్సరాలు దాటిన వయస్సులోనూ వృద్ధాప్యాన్ని లెక్కచేయకుండా అహర్నిశలు కష్టజీవుల పక్షాన నిలిచి, తుది శ్వాస వరకు ప్రజా ఉద్యమాలకు అంకితమైన పోరాట యోధుడు సారంపల్లి మల్లారెడ్డి అని మండల వెంకన్న కొనియాడారు. ఆయన మృతి రైతాంగ ఉద్యమానికే కాకుండా పేద ప్రజలు, కూలీలు, అణగారిన వర్గాల పోరాటాలకు కూడా తీవ్ర లోటని ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం తెల్లవారుజామున సుమారు 3 గంటల సమయంలో సారంపల్లి మల్లారెడ్డి భౌతికంగా తమను విడిచి వెళ్లడం బాధాకరమన్నారు. ఆయన ఆశయాలు, ప్రజా ఉద్యమాల పట్ల ఆయన చూపిన నిబద్ధత, రైతాంగ సమస్యల పరిష్కారం కోసం సాగించిన పోరాట స్ఫూర్తి భవిష్యత్ తరాలకు మార్గదర్శకంగా నిలుస్తుందని పేర్కొన్నారు. కామ్రేడ్ సారంపల్లి మల్లారెడ్డి మృతికి అఖిల భారత రైతు కూలీ సంఘం (ఏఐకేఎంఎస్) తరపున ప్రగాఢ సంతాపం వ్యక్తం చేస్తున్నామని, ఆయన కుటుంబ సభ్యులకు హృదయపూర్వక సానుభూతి తెలియజేస్తున్నామని మండల వెంకన్న తెలిపారు.

## బుల్లెట్ ట్రైన్ కోసం ఉద్యమిద్దాం: పచ్చిపాల రామకృష్ణ యాదవ్



**మునగాల, (విశాలభారతి):** హైదరాబాద్ నుండి జాతీయ రహదారి వెంబడి సూర్యాపేట, కోదాడ మీదుగా విజయవాడకు బుల్లెట్ ట్రైన్ నడపాలని బీసీ విద్యార్థి సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి పచ్చిపాల రామకృష్ణ యాదవ్ కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం మునగాలలో ఆయన మాట్లాడుతూ.. సూర్యాపేట జిల్లా కేంద్రం, కోదాడ పట్టణాలు మూడు జిల్లాలకు సరిహద్దులుగా ఉన్నాయని తెలిపారు. ఇక్కడి నుండి బుల్లెట్ ట్రైన్ నడిపితే ఎంతోమంది ప్రయాణికులకు బాసటగా ఉంటుందని ఆయన అభిప్రాయపడ్డారు. దీనివల్ల విద్యా, వ్యాపార తదితర రంగాలలో కోదాడ, సూర్యాపేట ప్రాంతాలు మరింత అభివృద్ధి చెందుతాయని అన్నారు. ప్రస్తుతం హైదరాబాద్, విజయవాడలకు వెళ్లాలంటే గంటల తరబడి ఆలస్యం అవుతోందని, బుల్లెట్ ట్రైన్ అందుబాటులోకి వస్తే ప్రయాణికులు చాలా సులభంగా, త్వరగా తమ గమ్య స్థానాలకు చేరుకోవచ్చని పేర్కొన్నారు. ఈ బుల్లెట్ ట్రైన్ సాధన కోసం విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని పచ్చిపాల రామకృష్ణ యాదవ్ స్పష్టం చేశారు.

# చౌటుప్పల్ హత్య కేసులో చురుగ్గా స్పందించిన పోలీసులు 24 గంటల్లోనే నిందితుల అరెస్ట్





- వివరాలు వెల్లడించిన చౌటుప్పల్ డీఎస్పీ మధుసూదన్ రెడ్డి
- దానయ్య సొంత అన్న కొడుకు శివతో,భార్య శారద హత్య చేయించినట్టుగా నిర్ధారణ
- మృతుడి భార్య తో శివకు గత కొంత కాలంగా వివాహేతర సంబంధం కొనసాగుతుంది
- శారదకు ఇంకా కొద్ది మందితో అక్రమ సంబంధాలు ఉన్నట్లు వెల్లడి
- నిందితులు శివ,శారదను అరెస్ట్ చేసి,రిమాండ్‌కు తరలింపు

**చౌటుప్పల్,విశాల భారతి**

చౌటుప్పల్ పోలీస్ స్టేషన్ పరిధిలో సంచలనం సృష్టించిన హత్య కేసును పోలీసులు వేగంగా ఛేదించారు. మండలం పంతంగి గ్రామం శనగలగుట్ట వద్ద అంకిరెడ్డిగూడెం గ్రామానికి చెందిన రాపోలు దానయ్య, 36 సం.రాలు హత్యకు గురైనట్లు సమాచారం అందిన వెంటనే పోలీసులు అప్రమత్తమయ్యారు.

**డీఎస్పీ పర్యవేక్షణలో దర్యాప్తు:**

సమాచారం అందిన వెంటనే చౌటుప్పల్ డీఎస్పీ పి. మధుసూదన్ రెడ్డి పర్యవేక్షణలో, ఇన్స్పెక్టర్ జె. మన్మథ కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. క్లూస్ టీమ్ మరియు డాగ్ స్క్వాడ్ ను రప్పించి కీలక ఆధారాలను సేకరించి, నిందితుల ఆచూకీ కోసం ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశారు. పోలీసుల చాకచక్యంతో కేసులో పురోగతి సాధించి నిందితులను త్వరగా గుర్తించి అదుపులోకి తీసుకున్నారు.

**విచారణలో వెలుగులోకి వచ్చిన అసలు కారణం:**

పోలీసుల దర్యాప్తులో సంచలన విషయం వెలుగులోకి వచ్చింది. మృతుడు దానయ్య భార్య రాపోలు శారద, 34 సం.రాలు మరియు అదే గ్రామానికి చెందిన సొంత బావ కుమారుడైన రాపోలు శివ @ చింటూ, 19 సం.రాలు మధ్య కొంతకాలంగా అక్రమ సంబంధం ఉన్నట్లు తేలింది. తమ సంబంధానికి భర్త దానయ్య అడ్డుగా ఉన్నాడనే ఉద్దేశ్యంతో శారద తన ప్రియుడు శివతో కలిసి 23.08.2028 రోజున మధ్యాహ్నం సమయంలో దానయ్యపై రాయితో దాడి చేసి, అనంతరం కర్రతో తలపై కొట్టడంతో తీవ్ర గాయాలై మృతి చెందినట్లు విచారణలో ఒప్పుకున్నారు.

**నిందితుల వివరాలు:**

రాపోలు శివ @ చింటూ, తండ్రి సాయిలు, వయస్సు 19 సం.రాలు, వడ్డెర కులం, వృత్తి డ్రైవర్, నివాసం అంకిరెడ్డిగూడెం గ్రామం, చౌటుప్పల్ మండలం.రాపోలు శారద, భర్త దానయ్య, వయస్సు 34 సం.రాలు, వడ్డెర కులం, వృత్తి కూలీ, నివాసం అంకిరెడ్డిగూడెం గ్రామం, చౌటుప్పల్ మండలం. ఈ ఘటనపై కేసు నమోదు చేసి నిందితులను అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు. న్యాయస్థానం ఆదేశాల మేరకు రిమాండ్ కు తరలించడం జరిగింది. ఈ కేసును వేగంగా ఛేదించిన ఇన్స్పెక్టర్ జె. మన్మథ కుమార్, ఎస్ఐలు కె. యాదగిరి, పి. రవీందర్, బి. అజయ్ భార్గవ్, ఉదయ్, జంగయ్య మరియు సిబ్బందిని డీఎస్పీ పి. మధుసూదన్ రెడ్డి అభినందించారు.

## బెస్ట్ డైరెక్టర్ అవార్డు గ్రహీత శ్రీధర్ గౌడ్‌కు ఘన సన్మానం



**దేవరుప్పుల విశాల భారతి :** డ్రంక్ అండ్ డ్రైవ్ వల్ల కుటుంబాలపై పడుతున్న ప్రభావాన్ని కళ్లకు కట్టినట్లు చూపిస్తూ, ప్రజల్లో అవగాహన కల్పించేలా రూపొందించిన షార్ట్ ఫిలింకు బెస్ట్ డైరెక్టర్ అవార్డు అందుకున్న అంబాల శ్రీధర్ గౌడ్‌ను దేవరుప్పుల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు దావెర అనిల్ కుమార్ ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా దావెర అనిల్ కుమార్ మాట్లాడుతూ.. సమాజంలో చైతన్యం తీసుకువచ్చేలా సందేశాత్మక చిత్రాన్ని రూపొందించి అవార్డు అందుకున్న శ్రీధర్ గౌడ్‌ను అభినందించారు. భవిష్యత్తులో మరిన్ని మంచి చిత్రాలను రూపొందించి ప్రజల్లో సామాజిక అవగాహన కల్పించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు కాసారపు ధర్మారెడ్డి, ఉప్పల సురేష్ బాబు, షబ్బీర్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు ఇనుముల నాగరాజు, ఎస్టీ సెల్ అధ్యక్షుడు బుక్య సజ్జన్, రెడ్డి రాజుల రమేష్, సుధాకర్ రెడ్డి, వీరన్న, అంజయ్య, విద్యాసాగర్, సర్పంచులు నవీన్, భాస్కర్, దేవేందర్, మేడ కొండయ్య, నరేందర్, ఉపేందర్, కిషన్, నాగేష్ తదితర కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీలో పాల్గొన్న దావెర అనిల్ కుమార్



**దేవరుప్పుల విశాల భారతి :** పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి ఆదేశాల మేరకు దేవరుప్పుల మండల ఎంపీడీవో కార్యాలయంలో నూతన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో కార్యాలయ అధికారులు అర్హులైన లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దావెర అనిల్ కుమార్ పాల్గొన్నారు.అనిల్ కుమార్ మాట్లాడుతూ.. పేద, అర్హులైన కుటుంబాలకు ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందించడంలో స్మార్ట్ రేషన్ కార్డులు కీలకంగా ఉపయోగపడతాయని అన్నారు. అర్హులైన ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందేలా ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి నాయకత్వంలో నియోజకవర్గ ప్రజల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో కార్యాలయ అధికారులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, వివిధ గ్రామాల సర్పంచులు, లబ్ధిదారులు బాలమ్మ, ధనలక్ష్మి, రామ్ నాయక్, నవీన్ నాయక్, సుధాకర్, శ్రీధర్ పాల్గొన్నారు.

## సైబర్ నేరాల పై కస్తూరి భా గాంధీ గురుకుల విద్యార్థినులకు అవగాహన : యస్ ఐ లచ్చి రెడ్డి



**మోతె ఆగస్టు 24 విశాల భారతి :** ఎస్పీ కె నరసింహ ఐపిఎస్ ఆదేశాల మేరకు మోతె SI లచ్చి రెడ్డి ఆధ్వర్యంలో మండల కేంద్రం లోని కస్తూర్బా గాంధీ బాలికల గురుకుల పాఠశాల లో గంజాయి డ్రగ్స్ మత్తు మందులపై ,ట్రాఫిక్ రూల్స్ , సైబర్ నేరాలు , రోడ్డు ప్రమాదాల పైన , షీ టీమ్స్ పైన పోలీసు కళాభృందంతో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగినది ఈకార్యక్రమాన్ని ఉద్దేశించి యస్ ఐ లచ్చిరెడ్డి మాట్లాడుతూ జిల్లా ఎస్పీ కే. నరసింహ ఐపిఎస్ ఆదేశాల మేరకు సైబర్ నేరాల పై రోడ్డు నియమ నిబంధనల పై గంజాయి మత్తు పదార్థాల పై షీ టీమ్స్ పై పటిష్టంగా పనిచేస్తున్నమని తెలిపారు. చదువుకునే విద్యార్థులు ఇంటర్నెట్ ను సద్వినియోగం చేసుకోవాలి, సైబర్ మోసగాళ్ళ వల్ల మోసాలకు గురి కావద్దని బ్యాంక్ ఖాతా , ATM కార్డ్ వివరాలు , OTP వివరాలు ఇతరులకు తెలపవద్దని ఇతరులు ఆశ చూపితే వాటికి ఆకర్షితులు కావొద్దు. మెసేజ్ లలో వచ్చే బ్లూ లింక్ అనుసరించి వ్యక్తిగత వివరాలు నమోదు చేయవద్దు అని కోరినారు.సైబర్ మోసాల పై 1930 టోల్ ఫ్రీ నంబర్ కు పిర్యాదు చేయాలని అన్నారు. అలాగే వేధింపుల పై 112 కు సమాచారం ఇవ్వాలని తెలిపినారు. వ్యక్తిగత సమాచారం , బ్యాంకు వివరాలు , ఏటీఎం పిన్ నెంబర్లు , సోషల్ మీడియాలో బహిర్గతం చేయొద్దన్నారు యువత చెడు వ్యసనాల బారిన పడొద్దు అన్నారు ఈ కార్యక్రమం లో కస్తూర్బా గాంధీ గురుకుల పాఠశాల ఇన్చార్జ్ ప్రిన్సిపల్ రజిని, పోలీస్ స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్ శ్రీకాంత్ , పోలీస్ కళా బృందం ఇంచార్జి యల్లయ్య , సభ్యులు గోపయ్య , సత్యం ,చారి ,కృష్ణ గురులింగం ,అధ్యాపక బృందం విద్యార్థులు పాల్గొన్నారు.



## జై కేసారంలో బాలల పరిరక్షణ కమిటీ ఏర్పాటు



- బాల్యవిహా వివాహాలు జరగకుండా చూడాలి
- సమ్మిరెడ్డి భారతమ్మ సర్పంచ్
- దత్తత చట్టబద్ధంగా తీసుకోవాలి-ఎం.మత్స్యగిరి

**చౌటుప్పల్,విశాల భారతి:**

మండలంలోని జై కేసారం గ్రామంలో సోమవారం జిల్లా బాలల పరిరక్షణ విభాగం (డీసీపీయు) ఆధ్వర్యంలో గ్రామ స్థాయి బాలల పరిరక్షణ కమిటీని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డీసీపీయు సోషల్ వర్కర్ ఎం. మత్స్యగిరి మాట్లాడుతూ.. పిల్లల రక్షణ, సంరక్షణ కోసమే ఈ కమిటీని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. గ్రామ సర్పంచ్ ఈ కమిటీకి చైర్మన్‌గా ఉంటారని, 14 మంది సభ్యులుగా ఉంటారని తెలిపారు. దత్తత ప్రక్రియ చట్టబద్ధంగా మాత్రమే జరగాలని, అనాథ పిల్లలకు ప్రభుత్వం అందిస్తున్న స్కాలర్షిప్ సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గ్రామంలో పిల్లలకు ఏవైనా సమస్యలు ఎదురైతే ఈ కమిటీలో చర్చించి పరిష్కారం చూపే అవకాశం ఉందని వివరించారు. గ్రామ సర్పంచ్ సమ్మిరెడ్డి భారతమ్మ మాట్లాడుతూ.. గ్రామంలో బాల్య వివాహాలు జరగకుండా చూడాలని, బడి మానేసిన పిల్లలపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. ప్రతి నెలా కమిటీ సమావేశం తప్పనిసరిగా నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి దశరథ, స్కోప్ (ఎన్జిఓ) సంస్థ ప్రతినిధి నరసింహరాజు, అంగన్‌వాడీ టీచర్లు, స్కూల్ టీచర్లు, ఆశా వర్కర్లు, మహిళా సంఘం లీడర్లు, యువజన సంఘం లీడర్లు తదితరులు పాల్గొన్నారు.

## హైవే బ్రిడ్జి పనులపై బీఆర్ఎస్ నేతల వినతి

- బ్రిడ్జి,రోడ్డు పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలి
- సుర్వి యాదవ్ బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు
- కొయ్యడ శేఖర్ గౌడ్ బిఆర్ఎస్ మున్సిపల్ ఫ్లోర్ లీడర్



**చౌటుప్పల్,విశాల భారతి:**

పట్టణంలో జాతీయ రహదారిపై కొనసాగుతున్న బ్రిడ్జి, రోడ్డు నిర్మాణ పనులను వేగవంతం చేయాలని కోరుతూ బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు సుర్వి యాదయ్య గౌడ్ అధికారులకు వినతిపత్రం అందజేశారు. విజయవాడ హైదరాబాద్ జాతీయ రహదారి (ఎన్ హెచ్ 65) పై నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయని, వలిగొండ, మునుగోడు, నారాయణపూర్, ధర్మోజిగూడెం, గుజ్జ తదితర ప్రాంతాల ప్రజలు కూడా ఇదే ప్రధాన మార్గాన్ని వినియోగిస్తున్నారని ఆయన తెలిపారు. ప్రస్తుతం పనులు నెమ్మదిగా సాగుతుండటంతో ఉదయం, సాయంత్రం వేళల్లో తీవ్ర ట్రాఫిక్ జామ్ ఏర్పడి వాహనదారులు గంటల తరబడి ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో చౌటుప్పల్ ఆర్డీఓకు వినతిపత్రం అందజేసిన సుర్వి యాదయ్య గౌడ్ పలు కీలక డిమాండ్లు చేశారు.బ్రిడ్జి, రోడ్డు పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలి. పనులు పూర్తయ్యే వరకు ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలి.నిర్మాణ ప్రాంతంలో ప్రజల భద్రత కోసం సరైన బారికేడ్లు, హెచ్చరిక బోర్డులు, రాత్రి వేళల్లో లైటింగ్ ఏర్పాటు చేయాలి. పనులు నాణ్యతా ప్రమాణాలతో, ఆర్ అండ్ బీ అధికారుల నిరంతర పర్యవేక్షణలో జరగాలి. రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి చౌటుప్పల్ లోని పనులను స్వయంగా పరిశీలించి ప్రజల ఇబ్బందులను పరిష్కరించాలని ఆయన ఈ సందర్భంగా కోరారు. అధికారులు సానుకూలంగా స్పందించి త్వరితగతిన చర్యలు తీసుకుంటే చౌటుప్పల్ ప్రజలకు, హైవేపై ప్రయాణించే వేలాది మంది వాహనదారులకు త్వరలోనే ట్రాఫిక్ కష్టాల నుంచి ఉపశమనం లభించనుంది. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్, ఫ్లోర్ లీడర్ కొయ్యడ శేఖర్ గౌడ్, మునుగోడు బీఆర్ఎస్వీ నియోజకవర్గ అధ్యక్షులు నల్పరాజు రమేష్, మండల నాయకులు బోయ శ్రీరాములు, ధర్మోజిగూడెం గ్రామ అధ్యక్షులు బత్తుల సింహాద్రి, నారాయణపూర్ గ్రామ శాఖ అధ్యక్షులు తెలంగాణ భిక్షం, గుజ్జ గ్రామ శాఖ అధ్యక్షులు సత్తయ్య, నాయకులు పొట్ట జంగయ్య, సుర్వి లింగస్వామి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడ్డ రెవెన్యూ ఉద్యోగులు

**యాదాద్రి భువనగిరి :**

అలేరు మండలంలో రూ.14 వేల లంచం స్వీకరిస్తూ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, గ్రామ పాలన అధికారి అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులకు పట్టుబడ్డారు. ఈ ఘటనకు సంబంధించి ఏసీబీ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. అలేరు మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ వేముగంటి పూర్ణచందర్ రావు (ఏఓ 1), కొలనుపాక గ్రామ పాలన అధికారి షేక్ అహ్మద్ (ఏఓ 2) లు లంచం డిమాండ్ చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఫిర్యాదుదారుడి సోదరి విక్రయించిన భూమి రిజిస్ట్రేషన్‌కు వీలుగా తహసీల్దార్‌కు నివేదిక ఇవ్వడానికి రూ.14 వేల లంచం డిమాండ్ చేసినట్లు ఏసీబీ పేర్కొంది. ఈ క్రమంలో సోమవారం ఏసీబీ నల్గొండ రేంజ్ అధికారులు వల పన్ని చర్యలు చేపట్టారు. ఏఓ 1 డిమాండ్ మేరకు ఏఓ 2 ద్వారా రూ.14 వేల లంచం స్వీకరిస్తుండగా అధికారులు పట్టుకున్నారు. ఏఓ 2 వద్ద నుంచి అతని సమక్షంలోనే రూ.14 వేల లంచం మొత్తాన్ని ఏసీబీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ప్రభుత్వ విధులను సక్రమంగా నిర్వర్తించకుండా, అక్రమ ప్రయోజనం పొందేందుకు ప్రయత్నించినట్లు ఏసీబీ అధికారులు తెలిపారు. ఇద్దరు నిందితులను నాంపల్లిలోని ఎస్‌పీఈ, ఏసీబీ కేసుల కోసం ఏర్పాటు చేసిన గౌరవనీయ Iవ అదనపు ప్రత్యేక న్యాయస్థానం ముందు హాజరుపరిచి జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించారు. కేసు దర్యాప్తు కొనసాగుతోంది

## ఆపదలో కార్యకర్తలకు అండగా ఉంటాం

**శాసనసభ్యులు ఉత్తమ్ పద్మావతి**



**మోతె ఆగస్టు 24 విశాల భారతి :** సోమవారం మండల పరిధిలోని హుస్సేనా బాద్ గ్రామంలో మాజీ ఉప సర్పంచ్ కొమ్ము యలమంచమ్మ అకాల మరణం చెందిన విషయం తెలుసుకున్న కోదాడ నియోజకవర్గ శాసన సభ్యురాలు నలమాద ఉత్తమ్ పద్మావతి కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల వెంట తీసుకొని కొమ్ము యలమంచమ్మ దశ దిన కర్మకు హాజరై వారి కుటుంబ సభ్యులను ఓదార్చి వారి కుటుంబానికి సానుభూతిని తెలియజేసి వారి కుటుంబానికి అండగా ఉంటామని భరోసా కల్పించారు సిరికొండ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్త షేక్ సలీమ్ ఇటీవల కాలంలో ట్రాక్టర్ ప్రమాదం లో మరణించిన సంఘటన తెలుసు కొని వారి కుటుంబాన్ని పరామర్శించి వారి కుటుంబ సభ్యులను ఓదార్చి వారికీ ధైర్యాన్ని చెప్పారు, భీక్య తండ గ్రామానికి చెందిన హలవత్ నాగులు, బూబాలు జంట హత్యలకు గురైన వారి కుటుంబాన్ని సందర్శించి వారి చిత్ర పటాలకు పూలతో నివాళ్ళు అర్పించి వారి కుటుంబానికి ధైర్యం చెప్పి ఓదార్చారు ఈ కార్యక్రమం లో రాష్ట్ర రైతు కో ఆర్డినేటర్ మధుసూదన్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు కీసర సంతోష్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ పులి ఈదయ్య మాజీ జడ్ పి టి సి పందిళ్లపల్లి పుల్లా రావు మాజీ జడ్ పి టి సి మాతృ నాయక్ మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మామిడి వెంకటేశ్వర్లు మేకల గురుకృష్ణ కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు లింగయ్య యలమంచమ్మ కుటుంబ సభ్యులు, సలీమ్ కుటుంబ సభ్యులు, నాగులు బూబా కుటుంబ సభ్యులు సిరికొండ, బిక్య తండ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు

## ఆపదలో కార్యకర్తలకు అండగా ఉంటాం

**శాసనసభ్యులు ఉత్తమ్ పద్మావతి**



**మోతె ఆగస్టు 24 విశాల భారతి :** సోమవారం మండల పరిధిలోని హుస్సేనా బాద్ గ్రామంలో మాజీ ఉప సర్పంచ్ కొమ్ము యలమంచమ్మ అకాల మరణం చెందిన విషయం తెలుసుకున్న కోదాడ నియోజకవర్గ శాసన సభ్యురాలు నలమాద ఉత్తమ్ పద్మావతి కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల వెంట తీసుకొని కొమ్ము యలమంచమ్మ దశ దిన కర్మకు హాజరై వారి కుటుంబ సభ్యులను ఓదార్చి వారి కుటుంబానికి సానుభూతిని తెలియజేసి వారి కుటుంబానికి అండగా ఉంటామని భరోసా కల్పించారు ఈ కార్యక్రమం లో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు కీసర సంతోష్ రెడ్డి మాజీ జడ్ పి టి సి పందిళ్లపల్లి పుల్లా రావు మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మామిడి వెంకటేశ్వర్లు మేకల గురుకృష్ణ కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు లింగయ్య యలమంచమ్మ కుటుంబ సభ్యులు గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు

## విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలి: ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి

**కళాశాల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉంది**




**మునగాల, విశాలభారతి:** మునగాల మండలం ఆకుపాముల గ్రామంలోని మహాత్మ జ్యోతిబా పూలే తెలంగాణ వెనుకబడిన తరగతుల సంక్షేమ జూనియర్ కళాశాలలో ప్రథమ సంవత్సర విద్యార్థులకు స్వాగతం పలుకుతూ ఫ్రెషర్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కోదాడ నియోజకవర్గ శాసనసభ్యురాలు నల్లమాద పద్మావతి రెడ్డి గారు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కళాశాల ప్రాంగణంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి గారికి కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపక బృందం, విద్యార్థులు ఘనంగా స్వాగతం పలికారు. ముందుగా మహాత్మ జ్యోతిబా పూలే చిత్ర పటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం ప్రజాప్రతినిధులు, కళాశాల యాజమాన్యం ఎమ్మెల్యే గారిని శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి గారు మాట్లాడారు. విద్యార్థులు తమ లక్ష్యాలను నిర్దేశించుకుని క్రమశిక్షణతో చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం గ్రామీణ, వెనుకబడిన తరగతుల విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు నిరంతరం కృషి చేస్తోందని పేర్కొన్నారు. సాంస్కృతిక పోటీలు మరియు విద్యా రంగంలో విశేష ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఎమ్మెల్యే గారి చేతుల మీదుగా ప్రశంసా పత్రాలు, బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, స్థానిక నాయకులు, పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

## పెద్దనాగారం స్టేజిలో యూబీఐ బ్యాంకు ఏర్పాటు చేయాలి



**డోర్నకల్ విశాల భారతి:** పెద్దనాగారం స్టేజిలో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా శాఖ ఏర్పాటు చేయాలని కోరుతూ వరంగల్ రీజినల్ మేనేజర్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ డాక్టర్ రామచంద్రు నాయక్ సమ్మతి లేఖను సర్పంచ్ భర్త భూక్య హరిలాల్, మండల కాంగ్రెస్ అధ్యక్షులు బొబ్బ సోమిరెడ్డి ఆధ్వర్యంలో అందించారు.పెద్దనాగారం స్టేజి పరిధిలోని నర్సింహులపేట, మరిపెడ మండలాలకు చెందిన 11 గ్రామాల ప్రజలు బ్యాంకింగ్ సేవల కోసం సుమారు 10 కిలోమీటర్లు వెళ్లాల్సి వస్తోందని తెలిపారు. సుమారు 15 వేల జనాభాకు బ్యాంకు సేవలు అందుబాటులోకి వస్తే ఎంతో ప్రయోజనం చేకూరుతుందని వివరించారు.వినతిపై సానుకూలంగా స్పందించిన ఆర్ఎం నూతన బ్రాంచ్ ఏర్పాటుకు సుముఖత వ్యక్తం చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## చిన్నగూడూరు మండలంలో డిజిటల్ క్రాప్ సర్వే ప్రారంభం



**డోర్నకల్ విశాల భారతి:** చిన్నగూడూరు మండలంలో సోమవారం నుంచి డిజిటల్ క్రాప్ సర్వే ప్రారంభమైంది. వానాకాలంలో రైతులు సాగు చేసిన పంటల వివరాలు, సాగు విస్తీర్ణాన్ని ఎంపిక చేసిన సర్వే నంబర్లలో క్షేత్రస్థాయిలో నమోదు చేయనున్నారు.డిజిటల్ క్రాప్ సర్వే వాలంటీర్లు పంటల వివరాలను నమోదు చేస్తుండగా, వ్యవసాయ విస్తరణ అధికారులు (ఏఈఓలు) ప్రక్రియను పర్యవేక్షిస్తున్నారు. భవిష్యత్తులో పంటల సేకరణ ప్రక్రియతో ఈ వివరాలు అనుసంధానం కానున్నందున రైతులు తమ పంటల వివరాలను తప్పనిసరిగా, ఖచ్చితంగా నమోదు చేయించుకోవాలని వ్యవసాయ శాఖ అధికారులు సూచించారు.వాలంటీర్లు గ్రామాలకు వచ్చినప్పుడు రైతులు అందుబాటులో ఉండి పూర్తి సహకారం అందించాలని, పంట వివరాలు, సాగు విస్తీర్ణం సక్రమంగా నమోదయ్యాయో పరిశీలించుకోవాలని తెలిపారు. ఏవైనా సందేహాలు ఉంటే సంబంధిత వ్యవసాయ విస్తరణ అధికారులను సంప్రదించాలని మండల వ్యవసాయ శాఖ అధికారులు కోరారు.



# 'రాకా'లో లేడీ విలన్?

అల్లు అర్జున్ తాజా చిత్రం 'రాకా' నిర్మాణ దశ నుంచే ప్రేక్షకుల్లో ఆసక్తిని రేకెత్తిస్తున్నది. అట్లీ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సైన్స్ ఫాంటసీ మూవీలో దీపికా పడుకోన్‌తో పాటు రష్మిక మందన్న, మృణాల్ ఠాకూర్, జాన్వీకపూర్ కథానాయికలుగా నటిస్తున్నారని తెలిసింది. కథావిస్తృతి దృష్ట్యా నలుగురు నాయికలకు చోటుందని చెబుతున్నారు. తాజాగా 'రాకా' ప్రపంచంలోకి మలయాళ భామ ఐశ్వర్యలక్ష్మి ఎంట్రీ ఇవ్వబోతున్నట్లు తెలిసింది. పూర్తి నెగెటివ్ షేడ్స్‌తో ఆమె పాత్ర సాగుతుందని, కథాగమనంలో కీలకంగా ఉంటుందని సమాచారం. పాన్ ఇండియా స్థాయిలో ప్రెస్టీజియస్ సినిమా కావడం, దర్శకుడు అట్లీ తన పాత్రను తీర్చిదిద్దిన విధానం నచ్చడంతో ఐశ్వర్యలక్ష్మి లేడీ విలన్‌గా కనిపించడానికి ఓకే చెప్పిందని అంటున్నారు. మరి ఈ వార్తలో నిజమెంతో తెలియాలంటే అధికారిక ప్రకటన రావాల్సిందే. త్వరలో హైదరాబాద్‌లో 'రాకా' కొత్త షెడ్యూల్ ప్రారంభంకానుంది. ప్రస్తుతం ఐశ్వర్యలక్ష్మి తెలుగులో 'సంబరాల ఏటిగట్టు' చిత్రంలో నాయికగా నటిస్తున్నది.

Published by Rajini Pagilla on behalf of Keerthi Media House, Editor : Gangarapu Vijay. RNI No APTEL/2010/32877.